వేంపల్లి గంగాధర్





# హిరణ్యరాజ్యం

రాయలసీమ ఫ్యాక్షనిజం చారిత్రక నేపథ్యం పరిణామక్రమం

వేంపల్లి గంగాధర్

# హిరణ్యరాజ్యం

*(రాయలసీమ ఫ్యాక్షనిజం చారిత్రాత్మక నేపథ్యం*

*పరిణామక్రమం - విశ్లేషణ)*

శ్రీ పి.టి.వీరారెడ్డి ఫౌండేషన్

కడప

www.ptvrfoundation.org

**HIRANYARAJYAM**
***(Rayalaseema Factionism - Parinama kramam - Visleshana)***
by VEMPALLI GANGADHAR
e-mail : vempalli_gangadhar@yahoo.co.in

copyright with writer

*First published*
July, 2008
by Sri P.T. Veera Reddy Foundation, Kadapa

*Cover Painting* :

*Cover Design* :

*DTP* : T.V.Narayana Rao - 9440591530

*for copies*
Dr. P.Adharsh Reddy
Chairman
Sri P.T. Veera Reddy Foundation
21/460, P.P. Street, 7 Roads
Kadapa - 516001
Andhra Pradesh - India
Ph: 08562 - 242909

Visalandhra Book House
and its branches in A.P.
Prajasakthi Book House
Disa Pustaka Kendram,
Navodaya Book House

Price : Rs. 50/-

"హిరణ్యం" అంటే బంగారమని అర్థం.
రాయలసీమను చరిత్ర పుటల్లో హిరణ్య
రాజ్యమని కీర్తించారు.

నెత్తుటి తడి అంటని
సీమ నేలను
స్పృశిస్తూ...

# Sri P.T. VEERA REDDY

*A Philanthropist and Humanitarian*

**(1907 - 1990)**

## A Great Nationalist and Freedom Fighter:

He followed the principles of Mahatma Gandhi and took part in the freedom struggle. He was also closely associated with Pandit Jawaharlal Nehru. He participated in the protest campaign against the Simon Commission. He was close friend of Sri Neelam Sanjeeva Reddy, Sri Koti Reddy, Sri Kasu Brahmananda Reddy and Sri Bejawada Gopal Reddy.

Inspired by Mahatma Gandhi and Jawaharlal Nehru, he became a member of the Congress Party. In 1955 he wanted to contest the Assembly Election from Kadapa Constituency on Congress ticket. But the party gave ticket to another candidate. Sri Neelam Sanjeeva Reddy visited Chennur to ask him not to contest the election. But he could not meet him. He returned to Kurnool and wrote a letter to him but with the support of Sri Koti Reddy he contested the election and got second position. What though the contest be he lost, his spirit of challenge, uncompromising attitude, unstinted perseverence awed even his opponents who stood beside him with folded hands awfully and reverentially.

## His Political Life:

Sri P.T. Veera Reddy appeared for the Public Service Commission Examination and was elected as Thahsildhar in 1930. But on account of the death of his eldest brother, he had to look after the agricultural lands. In 1932 he became the Munebu of Upparapalle at the age of 25. Then by dint of his honesty and sheer sincerity he became the Vice President of Chennur Panchayat in 1933. His amicable association with the people earned him great respect and he became President of Chennur Panchayat at the age of 27. He continued unanimously unopposedly as President for 36 years from 1934 to 1959 and then 1970 to 1981.

He entered the Co-operative field and did various services to the people. He was the Founder - President of Land Mortgage Bank, Kadapa in 1944 and continued to hold the same post for 26 years (1944-70). In addition, he served as the President of the District Co-operative Bank, Kadapa from 1950 to 1956. During his tenure as President, hundreds of poor people got jobs in indifferent cadres. Moreover he improved the business transactions of the bank turn over from four lakh rupees to fifty lakh rupees. This raised him to the position of one of the Directors of the Co-operative Central Land Mortgage Bank, Barkathpura, Hyderabad from 1970 to 1979.

<u>*See website : www.ptvrfoundation.org*</u>

# ఆత్మీయ అంకితం

హింసను ద్వేషించే అహింసామూర్తి,

శాంతిని కాంక్షించే కరుణామూర్తి,

నిదురించే చైతన్యాన్ని రగిలించే ఉద్యమనేత,

మహోన్నత స్ఫూర్తి ప్రదాత

**శ్రీ పి.టి.వీరారెడ్డి**గారి

దివ్యస్మృతికి...

## Telugu story writer making literary waves

Vempalli Gangadhar, a Telugu story writer of Kadapa district, finds place among 10 literary doyens such as Mahasweta Devi, Ashapurna Devi, Javed Akhtar and likes in the contemporary Indian literature section on 'Indianetzone', an e-magazine on literature.

Gangadhar's book 'Molakala Punnami', a collection of 13 short stories, delineates characters from rural background and is full of pathos of the deprivedand reflects the voices of those who depend on land and vagaries of nature. It is a feather in Gangadhar's cap to figure among writers such as Mulkraj Anand, K.M.Munshi, Jibananda Das, Buddhadev Bose and Dharamvir Bharati and Sunil Gangopadhyay on the site. Gangadhar's short stories were adjudged the best in R.S.Krishnamurthy Memorial story competetions at Visakhapatnam and by Telugu monthly, 'Vipula' this year.

Renowned writer Gunturu Seshendra Sarma, who wrote the foreword in the book 'Molakala Punnami', acknowledged that the stories reflected a similar struggle like that in his popular work 'Adhunika Mahabharatham'. The book by Gangadhar also carries an article 'Kadapa Mandalika Bhasha' (local district of Kadapa) by Boodaraju Radhakrishna. Gangadhar is also the receipient of American Telugu Association Award and a national story award.

- *M.Subramanyam*

## Stories with a rural flavour

The inspiring collection of stories delienating its characters from a rural background, speaks in earthy tones through the voices of those who depend on land and the vagaries of nature giving either misery or bounty. The stories are full of pathos of the deprived, both economically and emotionally. They have a distinct quality, which separates them from the run-of-the mill stories.

The title story 'Molakala Punnami' is a powerful with an unexpected ending. So also are stories such as 'Moodu Padunla Vaana', Poola Chetulu', 'Mynam Bommalu', 'Sreeman Doravaariki' which penetrate into the subtle realities beneath the superficial realities of life.

Gangadhar's handling of the characters has a depth which will haunt the reader long after one has finished reading the stories. He sometimes comes across as a poet when he derives inspiration directly from nature, and within the frame work of the story, spills his poetry in prose form. Boodaraju Radhakrishna's essay explains the regional dialects and what 'ideolect' is. The production value and printing of the book is very good, but is priced very low - a truly commendable gesture by the author. A must read book.

- *Ambika Ananth*

*THE HINDU, 12.9.2006.*

# ఎందుకీ పుస్తకం?

"గతం, వర్తమానాలకు మధ్య నిరంతరం సాగే సంభాషణే చరిత్ర".

పుట్టినచోట ఏ నది అయినా విస్తారంగా వుండదు. ప్రవహిస్తూ తన వేగాన్ని, గతినీ విస్తృతం చేసుకుంటుంది. చరిత్ర కూడా అంతే! నిరంతరం మార్పులకు గురైన సంఘజీవనాన్ని చరిత్ర ప్రతిబింబిస్తుంది.

ఒక పరిణామ క్రమాన్ని చారిత్రాత్మక దృష్టి కోణం నుంచి చరిత్రను 'రికార్డు' చేసి మనకు తెలియని మన చరిత్రను ఆవిష్కరించడం మా ప్రయత్న ఉద్దేశ్యం. ఫ్యాక్షనిజం నిర్మూలనకు మా వంతు బాధ్యతగా చేస్తున్న ఒక అవగాహన ప్రచారం.

ప్రతి ఒక్క జీవి తాను బతికే స్థలానికి, పరిసరానికి అనువుగా మారుతుంది. కానీ ఏదీ స్థిరం కాదు. ఒకప్పుడు మైదానాలు ఉన్నచోట పర్వతాలు సైతం ప్రత్యక్షమౌతాయి. సముద్రాలు ఇంకిపోయి పొడినేల భూమి ద్వారా ఏర్పడుతుంది. అలాగే ఈ నేల మీద కూడా ఫ్యాక్షన్ అంతరించిపోయి, అందరి జీవితాల్లోనూ కాంతిపూల పరిమళాలు పూచే కొత్త జీవితం అవతరించాలనేది మా ఆశ... ఆకాంక్ష.



"దేన్నయినా సృష్టించడానికి యుగాలు పట్టవచ్చు. నాశనం చేయడానికి క్షణాలు చాలు. ఇలా సృష్టికి – విలయానికి మధ్య జరిగే సంభాషణే మానవ చరిత్ర సారం... సారాంశం" అని అంటారు చరిత్రకారుడు బెంజిమన్ ఆర్టోలి. హింస, విధ్వంసంతో మనమేం సాధించగలం? ఘర్షణ... సంఘర్షణ... కక్షలు మనిషి జీవితానికి తీరని శాపాలు. 'హింస' స్థానంలో శాంతి కపోతాలు ఎగరాలనేది మా ఆశయం.

**- డా॥ పి.ఆదర్శరెడ్డి**

**చైర్మన్, శ్రీ పి.టి.వీరారెడ్డి ఫౌండేషన్**

# 'సీమ' తెల్లపావురం కావాలి!

- భూమన్

స్వాతంత్ర్యానికి ముందు ఫ్యాక్షనిస్టు అంటే అవివేకమైన మూర్ఖపు చర్యలు చేపట్టే వ్యక్తి, గుంపు లేదా గ్రామసమూహం అని నిర్వచించడం జరిగింది. ఫ్యాక్షనిస్టంటే పల్లెల్లో చిన్న తగాదాలకే తన ప్రాణాలు లేదా తమందరి ప్రాణాలూ, ఆస్తిపాస్తులూ బరిలో పెట్టేవాడుగా అర్థముండేది. చిన్న భూమి తగాదా దొమ్మీలకు హత్యలకూ దారి తీసేది. పైచేయి అయినవాడు పగతో గుంపు తయారు చేసి పోషించేవాడు. హింస జరిగిన ప్రతిసారీ ప్రత్యర్థులు ఎదురుదాడికి దిగేవారు. హత్యకు హత్య, వామికి వామి, ఇంటికి ఇల్లు, పంటకు పంట... అదీ ఎదురుదాడి. ఫ్యాక్షన్ వల్ల ప్రతి గుంపూ పల్లెలో ఇంటాబయటా జాగ్రత్తగా మసలేవారు. దాడి జరుగుతుందనే భీతితో తుపాకులు పట్టుకుని జట్లుగా తిరిగేవారు. ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం, పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, రాజకీయాల అవగాహనా లోపమూ ఫ్యాక్షనిజం బలపడ్డానికి పెద్దగా దోహదం చేశాయి.

పూర్వం ఫ్యాక్షన్ అనేది పల్లెలో పెత్తనం కోసమే ఉండేది. ఇవ్వాళ అది అక్రమ ధనార్జనకు, అధికార దుర్వినియోగానికి, గ్రామీణ ప్రాంతాల్లో మాఫియా రాజులు కావడానికి ఉపయోగపడుతోంది. పూర్వం ఫ్యాక్షన్‌లో ఉండేవాళ్లెవరైనా తమ ఆస్తులు కరిగి, చివర్లో బికారీలుగా మిగిలేవారు. ఇప్పుడున్న ఫ్యాక్షనిస్టులు రాజకీయాల్లో, సారా వ్యాపారంలో సివిల్, అటవీ కాంట్రాక్ట్‌ల్లో దిగి వాటిని తానొక్కడే హక్కుభుక్తం చేసుకుంటాడు. అన్ని సంస్థాగత ఆర్థికకలాపాల్లోనూ, మాఫియాగా మారి మామూళ్లు వసూలు చేయడం దైనందిన వ్యవహారంగా మారింది. కిందిస్థాయి వ్యవస్థాగత, అవ్యవస్థాగత పాలనావిభాగాలు అన్నీ కూడా తర, తమ బేధం లేకుండా వీరికి దాసోహం అంటాయి. స్థానిక ఫ్యాక్షనిస్టు నుంచి పూర్వానుమతి పొందకుండా నిర్ణయాలు తీసుకోవడానికి, వాటిని అమలు జరపడానికి దాదాపు అన్ని సందర్భాల్లోనూ అధికారులు జంకుతారు. పూర్వం ఫ్యాక్షన్ ప్రభావం కేవలం ఫ్యాక్షనిస్టుల మీద, వారి అనుచరుల మీద మాత్రమే ఉండేది. ఇవాళ గ్రామాల్లోని ప్రతి సామాన్య వ్యక్తి కూడా ఫ్యాక్షన్ కార్యకలాపాల దుష్పరిణామానికి గురవుతున్నాడు. కాలక్రమేణా వలస జీవులుగా మిగిలిపోవడం జరిగింది. ఈ నడిమధ్యలో అధిక సంఖ్యాకులైన సామాన్యుల గోడు వినేవారుండరు.

# రాయలసీమ ఆత్మగౌరవం!

- మాసీమ రాజగోపాల్‌రెడ్డి

రాజకీయ పార్టీలు పోటీపడి, తెలంగాణాకు జరిగిన అన్యాయాన్ని భూతద్దంలో చూపిస్తూ, దానికి ప్రత్యేక ప్యాకేజీ కావాలంటున్నాయి. మంచిదే. మరి కరువు సీమపైగాని, వెనుకబడిన ఉత్తరాంధ్రపైగాని ఈ పార్టీల సానుభూతి సారించకపోవడము విచారకరం. వీటికి ప్రత్యేక ప్యాకేజీ కావాలని ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేవారే లేరు. అది చేయాలనుకొన్నా, ప్రచార నిమిత్తం నోటిమాటలకే పరిమితమైపోతున్నది. సమస్యలు ఎదురైనప్పుడు, నిప్పుకోడి ఇసుకలో తలదూర్చి, సమస్యల వలయం నుండి బయటపడేందులకు చేసే ప్రక్రియ ఇది. దీనిని పలాయన మంత్రమంటారు. దీనివలన ఏ సమస్యా పరిష్కారం కాదు. కావున నిప్పులాంటి నిజాన్ని తెలుసుకొని, పరిష్కారానికి ప్రయత్నించడం తెలివిమంతుల లక్షణం. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుచున్నది ఓట్ల రాజకీయం, కాకపోతే సీట్ల రాజకీయం. ఏ ప్రాంతంలో తమ పార్టీకి సీట్లు వస్తాయో, ఆ ప్రాంత సమస్యలను ప్రధానంగా పట్టించుకొని పాటుపడే దుస్థితికి రాజకీయ పార్టీలు దిగజారిపోయాయి. ప్రజల అవసరాలనుగానీ, రాష్ట్ర అభివృద్ధినిగాని చిత్తశుద్ధితో పట్టించుకొనడం పార్టీలు మరచిపోయాయి. ఏమి చెప్పినా, చేసినా, ఏ వుద్యమం చేపట్టినా రాజకీయ లబ్ధి తప్ప, ప్రజా ప్రయోజనాలు శూన్యం. ఇలాంటి పార్టీలతో రాయలసీమ సమస్యలు పరిష్కారం కానేరవు.

కోస్తా వాసులు సమావేశాలు జరిపి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని తీర్మానిస్తూ ప్రకటనలు చేస్తున్నారు. ఇష్టముంటే ఎలాంటి రక్షణలు, కోరికలు కోరకుండా, రాయలసీమ ఆంధ్రాలో బేషరతుగా చేరవచ్చని వారు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో ఉన్న పత్రికలు, కోస్తా వాసుల కొరకు, తెలంగాణ వాసుల కొరకు మాత్రమే శ్రమిస్తున్నాయి. రాయలసీమ వార్తలను, అవసరాలను వీలైనంత వరకు కుదించి, ప్రాధాన్యత ఇవ్వకుండా జిల్లా ఎడిషన్‌లలో మారుమూల వేయడం జరుగుచున్నది. అంతటితో సరిపెట్టుకొనకుండా, రాయలసీమ బాంబుల గడ్డ అని, అది కక్షలకు, కార్పణ్యాలకు పుట్టినిల్లు అని, హత్యలు నిత్యకృత్యమని అసలు ఎడిషన్‌లు ప్రచురిస్తూ ఉంటాయి. ఇందుకు తామేమీ తగ్గమని, చిన్నచిన్న ఘర్షణలను కూడా పదేపదే చూపిస్తూ ఏ మారుమూల, ఎక్కడో జరిగిన ఒక హత్యను జుగుప్సాకర దృశ్యాలను అదేపనిగా చూపిస్తూ, రాయలసీమలో మరే సమస్యలు

లేవనేలా చేస్తూ, సీమవాసుల పట్ల ఏహ్యాభావం కలిగించేందులకు ఎలక్ట్రానిక్ మీడియా పోటీపడుతూ పాటుపడుచున్నది. ఇక కోస్తా వారి కుటీర పరిశ్రమగా తయారైన సినిమాల విషయం ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది.రాయలసీమ వాసులు రాక్షస సంతతికి చెందినవారనే భావన కలిగించేందులకు అనువైన సినిమాలు, అందులో కొన్ని సన్నివేశాలు, ప్రతి సినిమాలో ఒక ఈ ప్రాంత దుష్టపాత్ర సర్వసాధారణమైపోయింది. సమైక్య భావాన్ని, సమైక్య రాష్ట్రవాదాన్ని పెంచి పోషించే పత్రికలు కాని, ఎలక్ట్రానిక్ మీడియాగాని, సినిమాలు కాని కలికానికి కూడా కానరావు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో, రాజకీయ పార్టీలలో, ప్రచార సాధనాలలో సమైక్యతాభావం అంత ఉంటున్నది.

ఏ పార్టీకి చెందినవారైనా, రాష్ట్ర అవసరాలకు కాకుండా తాముంటున్న ప్రాంత సమస్యలను ప్రస్తావించడం, ఇతర ప్రాంతాల అభివృద్ధిని అడ్డుకోవడం పరిపాటి అయిపోయింది. ఇట్టి పరిస్థితుల్లో ఒకవేళ ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే రాయలసీమ వాసుల గతేమిటి? ఎటువైపు అని తేల్చుకునేందుకు గతాన్ని మననం చేసుకుని, ముందుకు అడుగులు వేయవలసిన సమయం ఆసన్నమైంది. రక్షణలు లేని రాయలసీమ స్థితిగతులు ఎలా ఉంటాయో అని తేల్చుకునేందులకుగాను, జరిగిపోయిన వాటిని బేరీజు వేసుకొనవలసి ఉంటుంది.

1926లో ఆంధ్ర విశ్వవిద్యాలయ కేంద్రం అనంతపురంలో నెలకొల్పుతామని చెప్పి చివరకు మోసం చేసి, వాల్తేరులో నెలకొల్పిన విషయం; 1951లో రాయలసీమకు నీటినందించే క్రిష్ణా - పెన్నార్ ప్రాజెక్టును నిలువరించిన విషయము; ఇందుకు ప్రత్యామ్నాయంగా ఖోస్లా కమిటీ సూచించిన కేసి కెనాల్ సామర్థ పెంపకం, రెండవ దశలో చేపట్టాల్సి ఉండిన సిద్ధేశ్వరం ప్రాజెక్టు పథకాన్ని అమలు కాకుండా చేసిన విధానము; కర్నూలు రాజధాని కాకుండా, విజయవాడలోనే నెలకొల్పాలని చివరి వరకు అడ్డుకున్న విషయం; రాయలసీమ ప్రాజెక్టులకు నీటినందించే ప్రాణప్రదమైన పోతిరెడ్డిపాడు కాల్వల సామర్థ్యాన్ని పెంచరాదని చేస్తున్న దుష్ప్రచారము; సముద్రం పాలవుతున్న గోదావరి నీటిని క్రిష్ణా నది ఆయకట్టుకు తరలించి, అందుమీదట ఆదా అయ్యే నిఖర జలాలను రాయలసీమకు అందించే పోలవరంలాంటి ప్రాజెక్టులను అడ్డుకుంటూ అనవసర రాద్ధాంతం చేయడం; 1937లోనే క్రిష్ణా జలాల వాడకం, ఇతర విషయాలలోనూ రాయలసీమకు ప్రాధాన్యత ఇవ్వాలనే శ్రీబాగ్ ఒప్పందాన్ని రాయలసీమ పెద్దలు, కోస్తా ప్రాంత పెద్దలు ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందాన్ని ఆంధ్ర మహాసభ, ఆనాటి ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ ఆమోదించింది. అయినా ఆ ఒప్పందాన్ని కాలరాయడం; ఇలా అనేక విషయాలలో అన్యాయం చేసిన వారిగా నిరూపితమయ్యారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికి రాయలసీమవాసి

ముఖ్యమంత్రి అయినా, అసెంబ్లీలో జనబలం వుండినందున, ఆయన కోస్తా ప్రాంత సేవలో తరించవలసి వుంటుంది. అందుకు తోడు క్రిష్ణా డెల్టాకు నీరుకట్టుగా పనిచేయవలసి ఉంటుందేగాని, రాయలసీమను పట్టించుకొనే వీలుండదు. ఒకవేళ విడిపోయి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు చేసుకొంటే, అది చిన్న రాష్ట్రమైనందున మనుగడ కష్టతరమేమో అనే అనుమానము కొందరిలో ఉన్నది. కావున అన్నిరకాల అనుమానాలు నివృత్తి చేసుకొనవలసిన అవసరమెంతైనా వున్నది.

శ్రీకృష్ణదేవరాయలు 1509 నుండి 1929 వరకు పరిపాలించారు. ఆ కాలంలో రాయలసీమ భోగభాగ్యాలతో, సస్యశ్యామలమై, రత్నాలను రాసులుగా పోసి అమ్మిన రత్నగర్భ. అనంతరం ఈ సీమ రాజకీయ సంక్షోభాలలో చిక్కుకుని, ముక్కలై, పాలకుల నిర్లక్ష్యానికి గురై, రానురాను కరువుసీమగా మారింది. ఆ విషయాన్నే విద్వాన్ విశ్వంగారు తన 'పెన్నేటి పాట'లో ఇలా తెలియజేశారు.

"అచటనొకప్పుడు పండె ముత్యాల చాలు
అటనొకప్పుడు నిండె కావ్యాలజాలు
అచటనొకప్పుడు కురిసె భాష్యాల జల్లు
అదే పెన్న, అదే పెన్న నిదానించి నడు
విచారించునెదన్, వట్టి ఎడారి తమ్ముడు"

1792లో జరిగిన రెండవ మైసూరు యుద్ధంలో టిప్పుసుల్తాన్ ఓడిపోగా, శ్రీరంగపట్నం సంధి మేరకు, కడప జిల్లా, అనంతపురం జిల్లాలో కొంతమేరకు, చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, వాయల్పాడు, చంద్రగిరి తాలూకాలు నైజాంకు దక్కాయి. 1799లో జరిగిన 3వ మైసూరు యుద్ధంలో టిప్పుసుల్తాన్ మరణించాడు. ఆపై జరిగిన పంపకాలలో సీమ అంతా నైజాంలో చేరిపోయినది. నిజాం నవాబుకు రక్షణ కలిగించేందులకు, హైదరాబాద్‌లో ఇంగ్లీషు వారుసైనిక శిబిరం నెలకొల్పేందుకుగాను, ఆ ఖర్చుల నిమిత్తం రాయలసీమను బ్రిటిష్ వారికి, నైజాం నవాబు 15.6.1800 సంధి మేరకు ధారాదత్తం చేశాడు. ఇంగ్లీషు వారు దానిని సీడెడ్ డిస్ట్రిక్ట్స్‌గా నామకరణం చేశారు. తెలుగులో వాటినే దత్తమండలం అని పిలవసాగారు. నంద్యాలలో జరిగిన దత్తమండలాల ప్రథమ మహాసభలో, దత్తమండలాల పేరును రాయలసీమగా మార్చారు. చరిత్రలోకి వెళితే ఈ ప్రాంతాన్ని రేనాడుగా పిలువబడేది. అది గతము. ఇప్పుడు రాయలసీమ వైశాల్యం, దాని స్థితిగతులను తెలుసుకొనవలసి వున్నది. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలు మరియు మునుపటి కర్నూలు జిల్లాలో ఉండి, ఇప్పుడు 1970 ఫిబ్రవరి 2వ తారీఖు నుండి ఏర్పడిన ప్రకాశం జిల్లాలో ఉంటున్న గిద్దలూరు, మార్కాపురం తాలూకాలు వెరశి రాయలసీమ. ఇలా ఉంటున్న రాయలసీమ వైశాల్యం 72,538 చదరపు కిలోమీటర్లు.

రాష్ట్ర వైశాల్యం 275.1 వేల చ.కి.మీ. కోస్తా ప్రాంతంలో ఇప్పుడున్న జిల్లాలకు అదనంగా, గుంటూరు జిల్లా నుండి 1970లో విడిపోయి, ప్రకాశం జిల్లాలో చేరిన ఒంగోలు తాలూకా పూర్తిగా, బాపట్ల, నరసరావుపేట, వినుకొండ తాలూకాలలోని కొన్ని ప్రాంతాలను పరిగణలోనికి తీసుకొంటే, కోస్తా ప్రాంత విస్తీర్ణము 65,864 చ.కి.మీ. వీటిలో చేర్చకుండా ఉంటున్న నెల్లూరు జిల్లా విస్తీర్ణం అందుకు తోడు అదనంగా 1970లో ఈ జిల్లా నుండి విడదీసి, ప్రకాశం జిల్లాలో చేర్చిన కనిగిరి, పొదలి, దర్శి, కందుకూరు తాలూకాలతో వెరశి నెల్లూరు వైశాల్యం 22,033 చ.కి.మీ. రాష్ట్ర వైశాల్యంలో తెలంగాణా 41.80%, రాయలసీమ 26.36%, ఇక కోస్తా ప్రాంతం 23.94 శాతము.

ఒక వేళ నెల్లూరును ఏ ప్రాంతములోనైనా కలపవలసి వస్తే అది రాయలసీమలో చేరవలసి ఉంటుంది. ఇప్పటికే నెల్లూరు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ పరిధిలో ఉన్నది. నెల్లూరు జిల్లాకు జీవనాధారమైన పెన్న, కుందూ, తెలుగుగంగలు రాయలసీమలో ఉన్నవి. కావున ఎట్టి పరిస్థితుల్లోను నెల్లూరు రాయలసీమలో చేరవలసి ఉంటుంది. భారతదేశంలో భౌగోళికంగా గుర్తింపు పొందిన భాగాలలో రాయలసీమ ఒకటి. భారతదేశపు జనాభా లెక్కలు తయారుచేసే రిజిస్ట్రార్ జనరల్ దేశములోని వివిధ ప్రాంతాలను గుర్తించవలసి ఉన్నది. ఆ మేరకు రాయలసీమను ఒక విభాగముగా రిజిస్ట్రార్ జనరల్‌చే గుర్తించబడింది. భారతదేశపు పల్లెల, పట్టణాల ప్లానింగ్ విభాగము, దేశములోని వివిధ ప్రాంతాల, విభాగాల కొరకు తయారు చేసే ప్రణాళిక కొరకు గుర్తించిన విభాగాలలో, రాయలసీమ, నెల్లూరు జిల్లాను కలిపి ఒక సమగ్రమైన ప్రాంతంగా గుర్తింపు పొందియున్నది.

భారతదేశపు ఆర్థిక విభాగాలు అనే అంశంపై విశ్లేషణ జరిపిన కుమార్‌సేన్‌గుప్తా, గలినాసీడీసస్సెక్‌లు, "దేశ ప్లానింగ్ తయారీలో రాయలసీమ సూక్ష్మపరిశీలనకు అనువైనది" అని తేల్చి చెప్పారు. ఇక పోలికల విషయానికొస్తే రాయలసీమ (నెల్లూరును కలపకుండా) కోస్తా ప్రాంతానికన్నా పెద్దది. దేశములోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాయలసీమ కేరళకన్నా 1 3/4 పెద్దది, హర్యానా, పంజాబ్‌లకన్నా 1 1/2 పెద్దది, ఉత్తరాంచల్, హిమాచల్‌ప్రదేశ్‌ల కన్నా 1 1/4 పెద్దది. ఇలా దేశంలోగల గోవా (3702 చ.కి.మీ.), హర్యానా (44,212 చ.కి.మీ.), హిమాచల్‌ప్రదేశ్ (55,673 చ.కి.మీ.), కేరళ (38,863 చ.కి.మీ.), మణిపూర్ (22,327 చ.కి.మీ.), మేఘాలయ (22,429 చ.కి.మీ.), మిజోరాం (25,081 చ.కి.మీ.), నాగాలాండ్(16,579 చ.కి.మీ.), పంజాబ్ (50,362 చ.కి.మీ.), సిక్కిం (7096 చ.కి.మీ.), త్రిపుర (10,492 చ.కి.మీ.), ఉత్తరాంచల్ (55,845 చ.కి.మీ.) వంటి రాష్ట్రాల కన్నా రాయలసీమ వైశాల్యంలో పెద్దది. ఇదేకాకుండా ప్రపంచంలో ఐక్యరాజ్యసమితి సభ్యులుగా ఉండే దేశాల వైశాల్యంతో పోల్చి చూసినపుడు వైశాల్యంలో ఆల్బేనియా, డెన్మార్క్, నెదర్లాండ్స్, బెల్జియం, స్విట్జర్లాండ్, ఇజ్రాయిల్, భూటాన్, శ్రీలంక, కువైట్, లెబనాన్, కోస్టారికా, డొనిమియన్ రిపబ్లిక్, పెరుగ్వే, టోగో,

రువాండా, తైవాన్‌లాంటి 43 దేశాలకన్నా రాయలసీమ పెద్దది. ఇండియాటుడే దేశవ్యాప్త సర్వే జరిపి దేశంలో అత్యుత్తమ, అధ్వాన్న రాష్ట్రాల పట్టికను, దేశవ్యాప్తంగా జీవన నాణ్యతపై ర్యాంకుల నిర్ధారణ చేసి, 2007 సెప్టెంబరు 25న ప్రచురించింది. ఆ పట్టిక ప్రకారం చిన్న రాష్ట్రాలైన పంజాబ్ గత 4 సంవత్సరాలుగా ప్రథమ స్థానంలో ఉన్నది. అలాగే కేరళ రెండవ స్థానంలో వున్నది, హిమాచల్ ప్రదేశ్ 3వ స్థానంలో ఉన్నది. ఇక పెద్ద రాష్ట్రాలైన బీహార్ 20వ స్థానంలోను, ఉత్తరప్రదేశ్ 17వ స్థానంలోను, మధ్యప్రదేశ్ 14వ స్థానంలో ఉన్నవి.

ఈ నివేదికకు శాంతిభద్రతలు, వ్యవసాయం, ప్రాథమిక విద్య, ప్రాథమిక ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, వినిమయ విపణి, పెట్టుబడి వాతావరణం, బడ్జెట్ సౌభాగ్యము అనే ఎనిమిది గుణగణాల మీద ఆధారపడి స్థూల పనితనానికి సంబంధించిన మదింపులు. ఈ విశ్లేషణ మేరకు చిన్న రాష్ట్రాలు ముందంజలో ఉండగా, పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌లు వెనుకబడినతనములో తలమునకగా ఉన్నవి. రాష్ట్రము చిన్నదా, పెద్దదా అనేది కాకుండా అవసరమైన వనరులు రాయలసీమలో ఉన్నవా లేవా అని తెలుసుకొనవలసి వున్నది. రాయలసీమలో జిల్లాలు తక్కువగా ఉన్నవి. కానీ వైశాల్యాన్ని పరిగణలోనికి తీసుకొని రాయలసీమలో కనీసం అదనముగా మరో మూడు జిల్లాలను ఏర్పాటు చేయవచ్చు.

వ్యవసాయానికి నీరు అత్యవసరము. తుంగభద్ర, క్రిష్ణా, కుందూ, పెన్నా నదులు ఈ ప్రాంతము గుండా ప్రవహిస్తున్నవి. క్రిష్ణా నది నీటిని నిల్వరించే శ్రీశైలం రిజర్వాయర్ ఈ సీమలో ఉన్నది. నీటి హక్కుల విషయమై అడిగేవారు ఈ సీమలో లేకపోవడంతో, మనకు న్యాయముగా రావాల్సిన వాటా మనకు రావడం లేదు. నీటి కేటాయింపులో, కరువు సీమలకు ప్రాధాన్యత ఇవ్వాలని, బేసిన్ సిద్ధాంతానికి, రైపేరియన్ హక్కులకు ప్రాధాన్యత ఇవ్వరాదని బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చి వున్నది.

క్రిష్ణానది నీటి కేటాయింపు కొరకు ఆయా రాష్ట్రాలలో వున్న ప్రాజెక్టులను పరిగణలోనికి తీసుకున్నా, వాడకము విషయానికొచ్చినపుడు, ఆయా రాష్ట్రాలకు కేటాయించిన నీటిని ప్రాజెక్టుల పరంగా కాకుండా, ఆ రాష్ట్రానికి కేటాయించిన మొత్తం నీటిని, ఏకమొత్తంగా పరిగణలోనికి తీసుకొని, రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా వాడుకొనవచ్చునని తమ తుది తీర్పులో బచావత్ ట్రిబ్యునల్ పేర్కొన్నది. ఇదే విషయాన్ని సుప్రీం కోర్టు కూడా 0.3.1./972/97లో 25.4.2000న బలపరచింది. అయినా కోస్తా వారికి భయపడి ఈ వివరణను రాష్ట్రప్రభుత్వం పరిగణలోనికి తీసుకోవడం లేదు. పరిపాలన సక్రమంగా ఉన్న రాయల కాలంలో ఎక్కడ వీలున్నదో అక్కడ చెరువులు, కుంటలు, బావులు, ఏటి కాలవలు, ఊటకాలువల నిర్మాణం చేపట్టడంతో నీరు సమృద్ధిగా లభించి పంటలు పండి సీమ సస్యశ్యామలంగా వెలుగొందింది. కావున నీటి వనరులను

సక్రమంగా వాడితే గత వైభవం తిరిగి పొందే సదవకాశమున్నది. రాయలసీమ ఖనిజాల పుట్ట. అమెరికా అభ్యుదయానికి తోడ్పడిన యురేనియం నిల్వలు ఈ సీమలో భారీగా ఉన్నాయి. కడప జిల్లా ముద్దనూరు, పులివెందుల, కమలాపురం, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ, నంద్యాలలో ఈ ఖణిజం లభిస్తుంది. దాదాపు 60 మిలియన్ల మెట్రిక్ టన్నుల నిక్షేపాలున్నవి. యురేనియం ఖనిజానికి అనుసంధానంగా బంగారు నిల్వలు 60 మిలియన్ మెట్రిక్ టన్నుల నిల్వలున్నవి. కడప జిల్లాలోని పులివెందుల ప్రాంతంలో 27,000 టన్నుల రాతినార లభ్యమవుతుంది. అనంతపురం, చిత్తూరు జిల్లాలలో గ్రానైట్ లభిస్తుంది.

నూనెగనుల త్రవ్వకము, పెయింట్లు, బట్టలు, కాగితము, రబ్బరు, లితోఫోస్, బేరియం రసాయినాలు మొదలగు పరిశ్రమలలో ఉపయోగపడే ముగ్గురాయికి కడప జిల్లా ప్రధాన కేంద్రం. కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం జిల్లాలలో తెల్ల మరియు గోధుమ వన్నె ముగ్గురాయి దొరుకుతుంది. ఆసియా ఖండంలో మరెక్కడా లభించనంత ముగ్గురాయి కడప జిల్లాలో లభిస్తుంది. ఇచ్చట లభించే గోధుమవన్నె ముగ్గురాయి, దేశంలో లభించే వాటికన్నా నాణ్యమైన సిమెంట్ పరిశ్రమకు ముఖ్యమైన ముడిపదార్థం సున్నపురాయి, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలలో లభిస్తుంది. సిమెంట్ పరిశ్రమకు మూలమైన సున్నపురాయి నిక్షేపాలు దేశం మొత్తం 3వ వంతు ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా, అందులో 60 శాతం రాయలసీమలో, ప్రధానంగా కడప జిల్లాలో వున్నవి. ఇండియాలో ఉత్పత్తి చేసే పలకరాళ్లలో 80 శాతం మార్కాపురంలో లభ్యమవుతాయి.

చిత్తూరు జిల్లాలోని చికరగుంట, నందిమడుగు, మల్లప్పకొండ ప్రాంతములో సుమారు 30 కి.మీ. పొడవున బంగారు నిక్షేపాలున్నవి. అనంతపురం జిల్లాలోని వజ్రకరూరు వజ్రాలకు ప్రసిద్ధి. వర్షం పడితే నేలపైనే వజ్రాలు లభ్యమవుతాయి. గతంలో చెన్నూరు మండలం కనుపర్తిలో వజ్రాల గనులుండేవి. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలలో ఇనుప ఖనిజం లభ్యమవుతుంది. ప్రపంచ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉన్న ఎర్రచందనం కడప జిల్లాలో మాత్రమే లభిస్తుంది. ఆహారధాన్యాలలో ఈ సీమ స్వయం సమృద్ధి సాధించింది. అన్నిరకాల నూనెగింజల పంటలు, పప్పుధాన్యాల పంటలు ఇక్కడ సాగవుతున్నవి. వీటికితోడు ప్రసిద్ధ క్షేత్రాలైన తిరుపతి, శ్రీశైలం, పుట్టపర్తిల అండదండలున్నవి. వీటన్నిటిని మించి ఆత్మగౌరవమున్నది. కావున అన్ని విషయాలను కూలంకుషంగా చర్చించి, పరిగణలోనికి తీసుకొని, మన సంగతేమిటో తేల్చుకోవలసిన అవసరమెంతైనా వున్నది.

# ఇందులో...


| | | |
|---|---|---|
| సీమ నేలపై నెత్తుటి సంతకం | ... | 2 |
| హిరణ్యరాజ్యం | ... | 4 |
| విజయనగర చరిత్రలో పాలెగాళ్లు | ... | 6 |
| మరో ఉక్కుపాదం | ... | 20 |
| చిత్తూరు జిల్లా పాలెగాళ్లు | ... | 31 |
| 'హింస' ధ్వని | ... | 38 |
| పాలెగాళ్ల పరిణామక్రమం | ... | 40 |
| రాయలసీమ రావణకాష్ఠం | ... | 52 |
| ఫ్యాక్షన్‌తో ప్రారంభం – ఫ్యాక్షన్‌తో అంతం | ... | 80 |
| ఫ్యాక్షన్‌ను ద్వేషిస్తూ | ... | 87 |
| ఫ్యాక్షన్ సమస్యకు పరిష్కారాలు | ... | 90 |
| ఆటవిక హింసా సంస్కృతి | ... | 93 |
| రాయలసీమ జిల్లాల భౌగోళిక స్వరూపం | ... | 98 |

# సీమ నేలపై నెత్తుటి సంతకం

మన నాగరికతలోకి నీళ్లే సరిగ్గా ప్రవేశించవు. మరి ఇంత హింస ఎలా ప్రవహిస్తోంది? వేటకొడవళ్లకు రక్తదాహాన్ని ఎవరు నేర్పారు? మన మధ్య, మన చుట్టూ వున్న మన వాళ్ల మధ్య, మన నేల మధ్య తరాలుగా, తరతరాలుగా ఆరిపోకుండా నిరంతరంగా కక్షల రావణ కాష్ఠాన్ని రగిలిస్తున్నదెవరు? ఖూనీలు చేసుకొని పగలు చల్లార్చుకోవడానికే 'మనిషి జన్మ' ఎత్తినట్లు, నరుక్కోవడం ఒక్కటే మనకొచ్చిన ఏకైక విద్య అయినట్లు, నాటుబాంబుల్ని చుట్టడమే మన చేతులకు వచ్చిన పని అయినట్లు, మన ముందూ, మన వెనుకా, మన చుట్టూ వలయాలు వలయాలుగా ఆవరించి, మన బంగారు కలల్ని కూడా కల్లోల విలయం చేస్తూ వలగా బిగిసిన ఈ కక్షల ఉచ్చును ఎవరు బిగించారు? మనమెందుకు ఈ పగల పంజరంలో వున్నాం? మన పల్లెలు... పచ్చని పల్లెలు యింత వెచ్చగా ఎందుకు ఉడికిపోతున్నాయి? బీడుపడిన పొలాలు, పాడుబడిన గృహాలు, పల్లె విడిచి పరారై ఎంత దూరం పరుగు... ఆకాశమంత అందమైన పల్లె శరీరానికి అడుగడుగునా గాయాల గాట్లు పెట్టి రూపాన్ని, స్వరూపాన్ని మార్చుతున్నదెవరు?

జీవితంకంటే అందమైనదీ, చావుకన్నా భయంకరమైందీ ఈ సృష్టిలో మరేదీ లేదని తెల్సినా... అందమైన జీవితాన్ని అర్ధాంతరంగా అంతం చేసుకొని భయంకరమైన చావును తమ జీవితాల్లోకి ఆహ్వానిస్తున్నదెవరు?



"మనం రోజూ... రోజూ ఏం ఖర్మ... ప్రతి నిమిషం... ప్రతి క్షణం ఊపిరి పీలుస్తూనే ఉంటాం. ఇన్నేళ్ల నుంచి ఈ పని చేస్తూనే ఉన్నాం కదాని ఒక్కసారి ఆపేస్తే ఏమౌతుంది? ప్రాణమే పోతుంది. ఈ ఫ్యాక్షన్ కూడా అంతే! మన చుట్టూ నిరంతరం మనల్ని రక్షిస్తూ అనుచరులు వుండాల్సిందే. నాటు తుపాకులు, నాటుబాంబులు, వేటకొడవళ్లు, ప్రత్యర్థిపై నిఘా, వ్యూహ ప్రతివ్యూహాలు అన్నీ మనం ఉన్నన్నాళ్లూ మనతో పాటూ సాగుతుండాల్సిందే. మన జీవితం మన చేతుల్లో లేదు" అని చెప్పే ఫ్యాక్షన్ నేతలు దారుణమైన కక్షల్ని పెంచుకుంటూనే వున్నారు. కులం, ధనం, బలం, ప్రాంతం, హోదా, అధికారం అంటూ పరిభ్రమిస్తూనే వున్నారు. కులం, ధనం, బలం, ప్రాంతం, హోదా, అధికారం అంటూ పరిభ్రమిస్తూనే వున్నారు.

"ఫ్యాక్షన్‌లో జాలి, సానుభూతి అనే మాటలకు స్థానమే లేదు. మనిషి మానసికంగా కుంగిపోవడం మొదలుపెడితే చీమా, దోమా కూడా మన మీద ఆధిపత్యాన్ని చెలాయించాలని చూస్తాయి. మనల్ని నిర్వీర్యుడుగా మార్చేస్తాయి. ఫ్యాక్షన్‌లో ఉండేది రెండే కేటగిరీల మనుషులు. ఒకరు చంపేవాళ్లు, మరొకరు చచ్చేవాళ్లు. బలాన్ని బట్టి, బలగాన్ని బట్టి ఏదో ఒక కేటగిరీలో చేరుతుంటారు" అని ఫ్యాక్షనిస్టులు తాము మృత్యువు అంచున ఎలా జీవిస్తున్నామో వివరిస్తారు. "ఫ్యాక్షన్‌లో అదృష్టం, దురదృష్టం అనేవి మన చేతుల్లోనూ, చేతల్లోనే" వున్నాయంటారు వీళ్లు. ఫ్యాక్షనిస్టుల జీవితాలు రక్తాక్షరాలతో లిఖించిన మృత్యుపత్రాలు... కసాయి అస్త్రాలు. "మళ్లీ పల్లెకు తిరిగి పోవాలని ఉంది. పోలేని పరిస్థితి. మాకు నలభై ఎకరాల పొలం ఉంది. వదిలేసి వచ్చేసినాం. ఫ్యాక్షన్ ద్వారా ఎంత నష్టపోయామో మాకు తెలుసు. పగవాడికి కూడా ఇట్లాంటి పరిస్థితి వద్దని" లింగందిన్నెపల్లె చిన్నమునిరెడ్డి ఎందుకు శోకిస్తున్నాడు? ఎందుకు విధి ఒకటి తలిస్తే, మనిషి మరొకటి తలుస్తున్నాడు?

తన చుట్టూ వున్న తలుపుల్ని తానే మూసేసుకొని తన గొలుసులతో తానే బంధించుకొని యింత నరకయాతన ఎందుకు పడ్తున్నాడు? ఎవర్ని చూసినా కళ్లకి శత్రువుల్లాగా ఎందుకు కన్పిస్తున్నారు? చావంటే ఏముంది... 'బొందిలోంచి ప్రాణం పోవడం. ఎప్పుడోసారి చావాల్సిందేననే' నైరాశ్యం... కళ్లెదుటే కట్టెలాగా మారిపోతున్న నిర్లిప్తత మన జీవితాల్లోకి ఎలా వచ్చింది? భయంకరమైన చావును కూడా అతిమామూలుగా తీసుకుంటున్న కర్మజీవుల్ని చూస్తే ఏమనిపిస్తుంది?

మానవ సంబంధాల మధ్య అంతర్వాహినిలా ప్రవహిస్తూ, దేహాల్లోంచి దేహాల్లోకి, తరాల్లోంచి తరాల్లోకి నెత్తుటితో పాటూ సరఫరా అవుతున్న సంఘర్షణను నిరోధించేందుకు కొత్తగా వాక్సిన్ ఏదైనా వస్తే ఎంత బాగుంటుంది కదా!

కక్షలు, కరువు లేకుంటే రాయలసీమ ఎంత బావుండేది!

కల్లోలంగా కన్నీళ్లతో కాలం కరిగిపోవడం ఫ్యాక్షన్ నెత్తుటి అధ్యాయంలోనే కన్పిస్తుంది.



# హిరణ్య రాజ్యం

హిరణ్యమంటే బంగారమని అర్థం. ఎప్పుడూ పచ్చని పంటలతో, వర్షాలతో సస్యశ్యామలంగా వుంటూ ఈ నేల మీద ఏ పంట వేసినా బంగారం పండినట్లు పండుతుంది కాబట్టి దీనికి హిరణ్య రాజ్యమనే పేరు పెట్టారు. రాయలసీమ ప్రాంతానికి 'హిరణ్య రాజ్య'మనే పేరు రావడం వెనుక ఘన 'చరిత్ర' కూడా ఎంతో వుంది.

క్రీ.శ. 3వ శతాబ్దిలో ఇక్ష్వాకులు హిరణ్యకులతో వివాహసంబంధాలు ఏర్పరచుకున్నారు. ఇక్ష్వాకు రాజైన పురీషదత్తుడు నాగార్జున కొండలో వేయించిన బ్రాహ్మీలిపిలోని ప్రాకృత శాసనంలో హిరణ్మక వంశ ప్రస్తావన వుంది. హిరణ్మక – హిరణ్యక శబ్దానికి ప్రాకృత రూపం. ఇక్ష్వాకుల సైనిక వ్యవహారాల్లో హిరణ్యకులు సమర్థవంతమైన పాత్ర నిర్వహించారు. క్రీ.శ. 5వ శతాబ్దిలో తొలి పల్లవులకు చెందిన రెండవ నరసింహవర్మ వేయించిన శాసనాల్లో హిరణ్యరాష్ట్రం వారి సామ్రాజ్యంలో భాగమని చెప్పబడింది. పుణ్యకుమారుడు హిరణ్య రాష్ట్రాన్ని ఆక్రమించుకోవడం ఒక ముఖ్య సంఘటన. వీరి మాలేపాడు తామ్ర శాసనంలోని 'హిరణ్య రాష్ట్ర సహిత స్వరాష్ట్ర నివాసిన' అనే మాటల వల్ల హిరణ్య రాష్ట్రం అతని రాజ్యంలో భాగమని గుర్తించవచ్చు. దొమ్మరి నంద్యాల తామ్ర శాసనంలో ఇతడు 'హిరణ్య రాష్ట్రాధిపతి'గా పేర్కొనబడ్డాడు. రాయలసీమకు ములికినాడు, రేనాడు అనే పేర్లు వున్నాయి. సీమను చరిత్రలో మునకనాడు ప్రాంతంగా చెప్పారు. నాసిక్ శాసనంలో గౌతమీపుత్ర శాతకర్ణి 'ములక' ప్రభువుగా పేర్కొనబడ్డాడు.

## రేనాడు

కడప జిల్లా కమలాపురం తాలూకాలోని ఎర్రగుడిపాడు గ్రామంలో చెన్నకేశవస్వామి దేవాలయం పక్క రాతిపై క్రీ.శ. 575 సంవత్సరమున రేనాటి చోళరాజు ఎరికల్ ముత్తురాజు ధనుంజయుడు వేయించిన శాసనం తొలి తెలుగు

శాసనంగా గుర్తించబడింది. తరువాత రేనాటి చోళరాజు సత్యాశ్రయుడు పోట్లదుర్తి, మాలేపాడు గ్రామంలో వేయించిన తెలుగు శాసనం రెండవది. రేనాటి చోళులు తమ శాసనాన్ని వేంగీ- చాళుక్య లిపిలో వేయించారు. క్రీ.శ. 6వ శతాబ్ది నాటికి కర్నూలు జిల్లానందలి దక్షిణ భాగమైన కోయిలకుంట్ల, సిరివెళ్ల తాలూకాలు, కడప జిల్లానందలి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, కమలాపురం తాలూకాలు, అనంతపురం జిల్లానందలి హిందూపురం తాలూకా ప్రాంతం, చిత్తూరు జిల్లా నందలి మదనపల్లె తాలూకా ప్రాంతాలను 'రేనాడు' అని పిలిచేవారు. ఇది ఏడువేల గ్రామాల మండలం. దీనిని కరికాళచోళ సంతతికి చెంది బాదామి చాళుక్యరాజుల మూలపురుషుడైన చలికి రెమ్మణకుని వంశస్థులైన చోళరాజులు పాలించేవారు. కాబట్టి వీరికి రేనాటి చోళులని పేరు వచ్చింది.

## పొత్తపినాడు

నేటి కడప జిల్లాలోని రాజంపేట, నందలూరు, చిట్వేలు, కోడూరు మండలాలను ఆనాడు పొత్తపినాడుగా పిలిచారు. కరికాళ చోళుడు 'పొత్తపినాడు'ను ప్రత్యేకంగా శ్రద్ధ వహించి పెంపొందించిన ప్రదేశం. తరువాత చోళ సంతతికి చెందిన కులుత్తుంగ చోళుని కాలంలో నందలూరు గ్రామంలో సౌమ్యనాథాలయం నిర్మించారు. రేనాటి చోళరాజు పుణ్యకుమారుడు రాజంపేట సమీపంలోని అత్తిరాలలో పరశురామేశ్వర దేవాలయం నిర్మించాడు. రేనాటి చోళరాజులలో మొదటివాడైన కాశ్యపగోత్రుడు నందివర్మ కరికాళ చోళ సంతతికి చెందిన తొండమాను (క్రీ.శ. 535-560) చక్రవర్తికి సమకాలికుడు.

## 'రాయలసీమ'కు పేరు పెట్టిన చిలుకూరి!

కడప జిల్లా రాయచోటి తాలూకాలోని మాండవ్య నదీ తీరంలోగల మట్లిరాజుల మూలపురుషుడు (క్రీ.శ. 1543-79)కు కృష్ణదేవరాయలు తన కుమార్తె కృష్ణమాంబను యిచ్చి వివాహం చేశాడు. మట్లి ప్రభువుల కాలంలోనే రాయబడిన 'అభిషిక్త రాఘవము' అనే ప్రబంధంలో రాయలసీమ అనే పేరు మొదటిసారిగా కన్పిస్తుంది. మట్లి అనంతరాజు కాలంలో ఈ కావ్యం వచ్చింది. 1800లో సీడెడ్ జిల్లాలు, దత్తమండలం అనే పేర్లు ఈ ప్రాంతానికి వుండేవి. కళాప్రపూర్ణ చిలుకూరి నారాయణరావు 'దత్త' అనే మాటను వ్యతిరేకిస్తూ అదే పేరుతోనే 128 పంక్తుల్లో మంజరీ ద్విపద రాశారు. 1928 నవంబరు 18వ తేదీన నంద్యాలలో కడప కోటిరెడ్డిగారి అధ్యక్షతన ప్రథమ దత్త మండల సమావేశం జరిగింది. ఈ సభలో చిలుకూరిగారు మాట్లాడుతూ 'రాయలసీమ' అనే పదాన్ని అన్నారు. దానిని పప్పూరి రామాచార్యుల చేత తీర్మానం చేయించి ప్రతిపాదింప చేశారు. ఆ విధంగా రాయలసీమ పేరు నిశ్చయమైంది.

# విజయనగర చరిత్రలో పాలెగాళ్లు



*నమస్తుంగ శిరశ్చుంబి చంద్రచామర చారవే*
*త్రైలోక్య నగరారంభ మూలస్తంభాయ శంభవే*

(విజయనగర పాలకులకు ముందు చాళుక్యులకు, కాకతీయులకు రాజశిఖాముద్రగా ఉన్న ఆదివరహాన్ని విజయనగర పాలకులు తమ రాజశిఖాముద్రగా గ్రహించారు. చాళుక్యుల, కాకతీయుల శాసనాల్లో ప్రారంభ శ్లోకంగా ఉన్న శివస్తుతి శ్లోకాన్ని తమ శాసనాల్లో కూడా ప్రారంభ శ్లోకంగా విజయనగర పాలకులు స్వీకరించారు. తాము హిందూ ధర్మరక్షణకు అంకితమయ్యామని, ధర్మరక్షణ చేస్తామని చెప్పడానికే వరాహముద్ర, శివస్తుతిని స్వీకరించినట్లు చరిత్రకారుల భావన. విజయనగర కాలంలోని బంగారునాణెంను 'వరాహ' అనేవారు. ఇదే 'వరహా'గా మారిందంటారు.)

విజయనగర సామ్రాజ్యాన్ని నాలుగు వంశాలు పాలించాయి. అవి సంగమ వంశం (1336–1485); సాళువ వంశం (1485–1506); తుళువ వంశం (1506–1570); ఆరవీటి వంశం (1570–1649).

విజయనగర సామ్రాజ్య స్థాపకుడైన హరిహరరాయలు రాజ్యం 1339 నాటికే తూర్పున బంగాళాఖాతం నుంచి పడమర అరేబియా సముద్రం వరకు వ్యాప్తి చెందినట్లు కర్నూలు జిల్లా అటకలగుండు శాసనం చెబుతుంది. తర్వాత ఉదయగిరి దుర్గానికి విరూపాక్షరాయలు అధిపతి అయినట్లు, క్రీ.శ. 1343 నాటి కడప జిల్లా మోపూరు శాసనం చెప్తుంది. వీరి తర్వాత ఈ ప్రాంతాలు కంపరాయలు పాలన కిందకు చేరాయి. క్రీ.శ. 1371లో మధురా విజయం జరిగింది. మాలిక్ కాఫూర్, హజార్ దినారి దండయాత్ర కాలంలో శ్రీరంగం నుంచి రక్షణకు తిరుమల తిరుపతికి

తీసుకుపోయిన శ్రీరంగనాథస్వామిని ఈ మధురా విజయం తర్వాత యధాస్థానానికి చేర్చారు. క్రీ.శ. 1410లో కర్నూలు జిల్లాలోని మహానంది వద్ద విజయనగర నాయకుడైన వెలుగోటి తిప్పనాయుడు వేసిన శాసనం కొచ్చెర్ల కోట వద్ద జరిగిన యుద్ధాన్ని గురించి చెప్తుంది.

క్రీ.శ. 1382 – 83 సంవత్సరంలో అనవేమారెడ్డి చివరికాలంలో, కొండవీడు రాజ్యంలో ఏర్పడిన అంతఃకలహాలు విజయనగర రాజులకు లాభించాయి. రెండో హరిహర రాయల కుమారుడు దేవరాయలు శ్రీశైల ప్రాంతాన్ని ఆక్రమించాడు.

మొదటి దేవరాయలు బహ్మనీలతో పోరాడుతున్న కాలంలో కందుకూరి శాఖ రెడ్డిరాజులు దండెత్తి కడప జిల్లాలోని పొత్తపినాటిని, దానికి ఆగ్నేయంగా వున్న పులుగునాటిని ఆక్రమించినారు. క్రీ.శ. 1413–14లో దేవరాయలు వారిని ఓడించి తరిమేసే వరకు ఈ ప్రాంతాలు రెడ్డిరాజుల ఆధీనంలోనే వున్నాయి.

క్రీ.శ. 1460లో గజపతుల సేనలు కపిలేశ్వరుని నాయకత్వంలో కర్నూలు ప్రాంతాన్ని గెలిచాయి. విజయస్తంభాన్ని ప్రతిష్ఠించాయి. దీంతో పెనుగొండను సాళువ నరసింహరాయల ఆధీనంలోనూ, చంద్రగిరిని సాళువ రామచంద్రరాయల పర్యవేక్షణలోనూ వుంచారు. స్వయంగా మల్లికార్జున రాయలు, తిమ్మదన్నా నాయకుడితో కలిసి పెనుగొండలో రక్షణ ఏర్పాట్లు చేశాడు. కానీ హంవీరుడి నాయకత్వంలోని గజపతి సేనలు చంద్రగిరిని కూడా స్వాధీనం చేసుకున్నాయి.

క్రీ.శ. 1485కు ముందు రచించిన వరాహ పురాణ పీఠికలో సాళువ నరసింహుడి దండనాయకులైన ఈశ్వర నాయకుడు పెనుకొండ, గండికోటలను జయించాడని చెప్తుంది. రెండవ నరసింహరాయలు (1490–1506)ను నరసానాయుడు ఓడించి పెనుగొండ దుర్గంలో బంధించి పాలన చేసినట్లు చరిత్రకారుడు న్యూనిజ్ రచనలు చెప్తాయి. నరసా నాయకుడి మరణం తర్వాత అతని పెద్దకొడుకు ఇమ్మడి నరసానాయకుడు 1506లో పెనుగొండ కోటలో చెరలో వున్న రెండవ నరసింహులును చంపించి తాను వీరనరసింహరాయులు పేరుతో విజయనగర సింహాసనాన్ని అధిష్టించాడు. ఇక్కడ్నుంచి తుళువ వంశం మొదలవుతుంది. ఆదోని దుర్గ పాలకుడు కాచప్ప ఒడయలు వంటి సామంతులు ఎదురుతిరిగారు. ఉమ్మత్తూరు పాలకులతో తలపడిన వీరనరసింహరాయలు 1509లో మరణించాడు. తర్వాత అతడి తమ్ముడు శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1509 ఆగస్ట్ 8వ తేదీన పట్టాభిషేకం జరిగింది. దీనిని ఒప్పుకోని కొందరు పాలెగాళ్లు రాయల అధికారాన్ని ధిక్కరించారు. వీరిని అదుపు

చేయడం సాధ్యం కాని విషయమైంది. అమర నాయకులు కట్టవలసిన పన్నులకు బదులుగా వారి సైన్యాలను రాయలకు అప్పగించవలసిందిగా ప్రధాని సాళువ తిమ్మరుసు వ్యూహం చేశాడు.

వీరనరసింహరాయల కాలం నుంచి విజయనగరాన్ని ధిక్కరించి స్వతంత్రులుగా పాలిస్తున్న పాలెగాళ్లను అణిచివేయడానికి రాయలకు సైన్య సమీకరణ తప్పనిసరైంది. ఎగువ కావేరి ప్రాంతాన్ని పాలించే ఉమ్మత్తూరు, శివసముద్రం పాళెగాడు గంగరాజుపైకి రాయలు దండయాత్ర చేశాడు. ముందుగా గంగరాజు గుప్పిట్లోని పెనుగొండ దుర్గాన్ని వశం చేసుకున్నాడు. పెనుగొండకు రాయసల కొండమరుసయ్యను దుర్గాధిపతిగా నియమించాడు. తర్వాత గంగరాజును ఓడించి రెండు దుర్గాలను స్వాధీనం చేసుకున్నాడు రాయలు. తిరుమల శ్రీ వెంకటేశ్వరుడి దర్శనానికి ఏడు పర్యాయాలు వచ్చిన శ్రీకృష్ణదేవరాయలు అతని రాణులైన తిరుమలదేవి, చిన్నాదేవిల కాంస్య ప్రతిమలు తిరుమల దేవస్థాన ప్రాంగణంలో ఇప్పటికీ మనం చూడవచ్చు.

రాయల తర్వాత అచ్యుత దేవరాయలు పట్టాభిషేకం తిరుమల తిరుపతిలోనే జరిగింది. 1530లో సుల్తాన్ కులీకుద్బుల్ ముల్క్ కొండవీడును ముట్టడించాడు. అతనికి కర్నూలును పాలించే తిమ్మనాయుడు సహాయం అందించాడు. అచ్యుతరాయలు యుద్ధం చేసి గోల్కొండ సైన్యాలను ఓడించాడు. 1536లో గుత్తి దుర్గాధిపతి తిరుగుబాటు చేశాడు. అతడ్ని అణచివేసి అచ్యుతరాయలు 1537లో తిరుమల యాత్ర చేశాడు. ద్రావిడ దేశంలోని అమర నాయకులు అంతరామరాయల మీద తిరుగుబాటు చేశారు. వారిని అణిచివేయడానికి రామరాజు దండయాత్ర చేశాడు. పెనుగొండ, గుత్తి, గండికోటలను రామరాజు స్వాధీనపరచుకొన్నాడు. సదాశివరాయల్ని విజయనగర చక్రవర్తిగా చేశాడు.

సదాశివరాయల కాలంలో రామరాజు నేతృత్వంలో సామ్రాజ్య పాలనలో మార్పులు జరిగాయి. తమ విధేయులు, విశ్వాసపాత్రులైన వెలుగోటి, పెమ్మసాని, రావెల, కంటకం వంటి కుటుంబాల వారిని ఎక్కువగా నియమించుకున్నారు. రామరాజు ఆధిపత్యాన్ని సహించని సామంతులు తిరుగుబాటు చేశారు. వారిని అణిచివేయడం కోసం తన సైన్యాధ్యక్షులైన అవుకు చినతిమ్మరాజు, నితలరాజుల నాయకత్వంలో సైన్యాన్ని ఏర్పాటు చేసి పంపాడు రామరాజు. వారు చంద్రగిరి దుర్గాన్ని గెలిచారు.

ఆదిక్షా సుల్తానుల కూటమి 1564 డిసెంబర్ 25వ తేదీన కృష్ణానదికి ఉత్తర తీరాన 42 కి.మీ. దూరంలో వున్న రాక్షస తంగడి వద్ద విడిది చేశారు.

మూడులక్షల సుల్తాన్ సైన్యాలను ఆరులక్షల రామరాయల సైన్యాలు ఎదుర్కొన్నాయి. ఈ యుద్ధాన్నే 'తాళికోట యుద్ధ'మని కూడా చెప్తారు. యుద్ధంలో నెగ్గిన విజయనగర రాజులను సుల్తానులు సంధి సంప్రదింపులతో నమ్మించి హఠాత్తుగా దాడి చేశారు. 1965 జనవరి 23న యుద్ధం కీలక దశకు చేరుకుంది. ఎనభై సంవత్సరాల రామరాజు ధైర్యపోరాటం చేశాడు. కానీ ప్రయోజనం లేకపోయింది. తాము యుద్ధంలో ఓడిపోయామని తెలియగానే రామరాయల తమ్ముడు తిరుమల రాయలు బందీగా వున్న సదాశివరాయలతో సహా పెనుగొండ పారిపోయి అక్కడే 1571లో పట్టాభిషిక్తుడయ్యాడు. కానీ తర్వాత పరిస్థితులు చేదాటి పోయాయి. ఆరు సంవత్సరాల పాటూ రాజ్యంలో అరాచకం విచ్చలవిడిగా జరిగిందని గ్రామ కైఫియత్తులు చెప్తున్నాయి.

## చెలరేగిన పాలెగాళ్లు...

కేంద్రంలో అధికారం కోల్పోయిన ప్రభువులను చూసి సామంతులు ఎదురు తిరిగారు. స్వతంత్రంగా తమకు తామే స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుని వారి ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి, వారి రాజ్యాలను విస్తరింపచేసుకోవడానికి విధ్వంసాలకు పూనుకున్నారు. రామరాజు కాలంలో నమ్మకస్తులుగా, విధేయులుగా వున్న అమరనాయకులు, సీమల పాలకులు యిక తమదే రాజ్యమన్నట్లుగా జీవించారు. ముందుగా ఆదోని పాలకుడు కోనేటి కొండ్రాజు స్వతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడు. తర్వాత బంకాపూరు పాలకుడు వేల్పురాయుడు, మరికొంతమంది అమరనాయకులు ఎదురు తిరిగారు. మధుర ప్రాంతాన్ని కృష్ణప్పనాయుడు, తంజావూరు ప్రాంతాన్ని అచ్యుతప్పనాయకుడు, జింజీ పాలకుడు తుపాకి కృష్ణప్ప నాయకుడు, చుట్టుప్రక్క ప్రాంతాలను కూడా ఆక్రమించుకొని పోరాటాలు చేశారు.

యింతలో ఆదిక్షా పెనుగొండ పైకి ఖిజిర్‌ఖాన్‌ను పంపగా పెనుగొండ దుర్గాధిపతి సవరం చెన్నప్పనాయకుడు సైన్యాన్ని ఓడించాడు. తర్వాత ఆదోనిని పాలిస్తున్న కోనేటి కొండ్రాజును ఆదిక్షా సైన్యాలు ఓడించాయి. సామ్రాజ్యంలో వివిధ ప్రాంతాల్లో సీమలలో, స్వాతంత్ర్యం ప్రకటించుకున్న అమర నాయకులపై, సామంతులపై దండెత్తి, వారిని జయించే పరిస్థితి తిరుమల రాయలకు లేకపోయింది. స్వేచ్ఛగా మా ప్రాంతాలు మా ఇష్టం అన్నట్లు వ్యవహరించే వీరిని కట్టడి చేయడం సాధ్యంకాక, వారితో రాజీ పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వారిని స్వతంత్రులుగానే గుర్తించినట్లు వారి ఆధిపత్యాన్ని ఒప్పుకోవాల్సి వచ్చింది. దీంతో తిరుమల రాయల్ని

పేరుకు మాత్రమే చక్రవర్తిగా చెప్తూ, పాలనంతా పాలెగాళ్ల వశమైంది. ఫలితంగా ముక్కలు ముక్కలుగా మారిన రాజ్యం తన మౌలిక స్వభావాన్ని కోల్పోయింది. పాళెగాళ్లు సీమను దోచుకోవడం ప్రారంభించారు.

హండే తిమ్మనాయకుడి సహాయంతో 1576లో ఆలీ ఆదిల్‌షా పెనుగొండపైకి దండెత్తాడు. సవరం చెన్నప్పనాయకుడు దీన్ని తిప్పికొట్టాడు. హండే నాయకులైన మలకప్ప, కదంబరాయడు సహకారంతో నరహరిరావు కర్నూలులో అడుగుపెట్టి అహోబిల నరసింహస్వామి దేవాలయాన్ని దోచారు. ఇబ్రహీం కుతుబ్‌షాకు ఈ ప్రాంతాన్ని అప్పగించగా, వారినే ఆ ప్రాంతానికి పాలకులుగా నియమించారు. కొండ్రాజు వెంకట్రాజు పర్యవేక్షణలో నడిచిన శ్రీరంగ రాయలసైన్యాలు హండే నాయకులను 1579లో ఓడించాయి. హైదరుల్ ముల్క్ కొచ్చర్ల కోటను ముట్టడించినప్పుడు దుర్గాధిపతి కస్తూరి రంగప్ప కోటను విడిచి పారిపోయాడు. ఈ యుద్ధాలు ఇలా జరుగుతుండగా, ఇదే అదునుగా పాళెగాళ్లు సీమలలో దోపిడీలకు పాల్పడ్డారు.

రెండవ వెంకటపతిరాయలు కాలంలో అమీనుల్ ముల్క్ గండికోటను స్వాధీనం చేసుకున్నాడు. నంద్యాల పాలకుడైన బస్వంతరాయలను, నరసింగరాజును ఓడించి సామంతులుగా కప్పం కట్టేటట్లు చేశారు. కర్నూలు, గుత్తి దుర్గాలు కుతుబ్‌షాహీ సైన్యాలకు లొంగిపోయాయి. అదేరీతిలో పెనుగొండను ముట్టడించగా, వెంకటపతి రాయలు శాంతి సంధి కోరాడు. తన అమర నాయకుల సామంతులైన జగదేవరావు, మట్లి అనంతరాజు, వెలుగోటి కస్తూరి రంగప్ప, వెలుగోటి చెన్నా నాయకుడు, వెంకటపతి, తంజావూర్ రఘునాథ నాయకులను సమావేశపరిచి యుద్ధవ్యూహం చేసి సుల్తాన్‌ను ఓడించారు. మట్లి అనంతరాజు సిద్దవట శాసనం ఈ విషయాన్ని చెప్తుంది. నంద్యాల, గుత్తి, గండికోట దుర్గాలను కూడా వెంకటపతి రాయలు కైవసం చేసుకున్నాడు.

కుతుబ్‌షాహీల మీద విజయాలు సాధించిన తర్వాత రాజ్యంలోని అమర నాయకులను, పాలెగాళ్లను అణిచి దారిలోకి తెచ్చుకోవడానికి రెండవ వెంకటపతి రాయలు పూనుకున్నాడు. నంద్యాల పాలకుడైన నంద్యాల కృష్ణమరాజు తిరుగుబాటు చేయగా, అతణ్ణి అణిచివేశారు. కర్నూలు 1624లో ఆదిల్‌షాహి సైన్యానికి వశమైంది. కర్నూలు దుర్గాధిపతి గోపాలరాజు పారిపోయాడు. 1642లో కుతుబ్‌షాహీ సైన్యాలు తూర్పుతీరం వెంబడి వున్న అన్ని కోటలను ఆక్రమించుకుంటూ దామెర్ల వెలుగోటి వంశాల నాయకులను శేషాచలం కొండల వైపుకు తరిమారు. క్రీ.శ. 1639లో

వెంకటపతిరాయలు మద్రాసు పట్నం స్థలాన్ని ఇంగ్లీష్‌వారికి విక్రయించాడు. గోల్కొండ, బీజాపూర్ సుల్తానులు పెనుగొండ పైకి తరచూ దాడులు చేస్తుండడంతో క్రీ.శ. 1585లో పెనుగొండ నుంచి రాజధాని చంద్రగిరికి మారింది. ఆరవీటి వేంకటపతి దేవ మహారాయలు పాలన సాగించాడు. తిరుమల ఆలయంలో వీరి కాంస్య విగ్రహం కూడా వుంది. సుగుమంచి పల్లె కైఫియతు ప్రకారం క్రీ.శ. 1652 నాటికి విజయనగర సామ్రాజ్యం పూర్తిగా సుల్తానుల చేతికి చిక్కింది. క్రీ.శ. 1673లో మహారాష్ట్ర పాలకుడు శివాజీ సీమ ప్రాంతాన్ని హస్తగతం చేసుకున్నాడు. క్రీ.శ. 1710లో సదాతుల్లాఖాన్ నవాబు పాలనలో మంత్రి తోడరుమల్లు ఈ ప్రాంతానికి వచ్చిన గుర్తుగా తిరుమల ఆలయంలో వీరి విగ్రహాలు కూడా వున్నాయి. క్రీ.శ. 1799లో మైసూర్ సంధి ప్రకారం రాయలసీమ జిల్లాలో నైజాం ఆలీ వశమయ్యాయి. క్రీ.శ. 1800 సంవత్సరంలో నైజాం బ్రిటీషు వారికి దత్తమండలాలుగా సీమను అప్పగించాడు. క్రీ.శ. 1802 నాటికి దత్తమండలాలు మద్రాసు రాష్ట్రంలో భాగమైనాయి. 1807లో కడప, 1858లో కర్నూలు, 1882లో అనంతపూర్, 1911లో చిత్తూరు జిల్లాలు ఏర్పాటయ్యాయి.

## సరిహద్దు రక్షణలో పాలెగాళ్లు

13వ శతాబ్దంలో పండిన పంటలో 6వ వంతు రాజుకి శిస్తుగా చెల్లించాలనే నియమం ఉండేది. విజయనగర సామ్రాజ్యంలో కడప జిల్లా భాగమయ్యే వరకూ ఈ పద్ధతే దాదాపుగా కొనసాగింది. రాయల పాలన ప్రారంభమైన తరువాత కొత్త శిస్తు విధానం అమలులోకి వచ్చింది. పండిన పంటలో 6వ వంతు రాజుకి, 13వ వంతు బ్రాహ్మణులకి, 20వ వంతు దేవుడికి అని చెప్పి శిస్తు వసూలు చేసేవారు. ఈ మూడు రకాల శిస్తులను చక్రవర్తికే జమ చసేవారు. విజయనగర రాజుల కాలంలోనే మొట్టమొదటిసారిగా భూములను వర్గీకరించడం, కొలతలు కొలవడం, పంట ఎంత పండుతుందో అంచనా వేసి దాని ప్రకారం శిస్తు నిర్ణయించడం అనే పద్ధతులు అమలులోకి వచ్చాయి. అయితే ఇది అంత శాస్త్రీయ బద్ధంగా జరిగేది కాదు. రైతుల నుండి శిస్తు వసూలు చేసే బాధ్యతను పాలెగాళ్లే ఎక్కువ నిర్వహించేవారు.

## నాయక రాజుల కాలంలోనే!

విజయనగరం రాజుల పాలన ప్రారంభం కాక ముందు నుండే ఈ పాలెగాళ్ల వ్యవస్థ అమలులో ఉంది. నాయక రాజుల కాలంలో పాలెగాళ్ల వ్యవస్థ ప్రారంభమైనట్లు

ఇప్పటివరకూ లభించిన చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. కొన్ని గ్రామాలను ఒక సముదాయంగా చేసి దానికి ఒక పాలెగాణ్ణి నియమిస్తుండేవారు. రాజుకు యుద్ధ సమయాలలో సైనికంగాను, ఇతరత్రా సహాయం చేయడం, తన పరిధిలో ఉన్న గ్రామాలను శత్రువుల బారి నుండి కాపాడడం, అలజడులు, అశాంతి చెలరేగకుండా చూడడం పాలెగాళ్ల బాధ్యతలుగా ఉండేవి. ఇందుకు ప్రతిఫలంగా తమ పరిధిలో వున్న గ్రామాలలో శిస్తును పూర్తిగా కాని, కొంతగాని వసూలు చేసుకునే హక్కు పాలెగాళ్లు కలిగి వుండేవారు. రాజుకు కప్పం చెల్లించే పద్ధతి కూడా అమలులో ఉండేది. ఒకవిధంగా ఈ పాలెగాళ్లు రెవిన్యూ, పోలీసు విధులను నిర్వహించేవారు. విజయనగర ప్రభువుల కాలంలో యీ పాలెగాళ్ల వ్యవస్థ బాగా బలపడింది. అప్పట్లో వీరు రాజులకు విధేయులుగానే ఉండేవారు. బందరు నుంచి రోళ్లమడుగుకు వలస వచ్చిన యాకర్ల యర్రమనాయుడు చేసిన ఆగడం భరించలేక అగ్రహారీకులు ఊరు విడిచిపోయారు. ఆ ప్రాంతంలోని దోపిడీగాండ్రను అణచి వుంచేందుకు కృష్ణదేవరాయలు కావలేగారుగా ఆయనను నియమించారు. అతడు చెయ్యేరు ఒడ్డున ఒక కోట కట్టినాడు. దానిని రాయలు అతనికి జాగీరుగా ఇచ్చాడు.

సదాశివరాయల కాలంలో పుష్పగిరి బ్రాహ్మణులు పెరుగు బసివినాయుడుకు నెట్టూరు పట్టు ఇచ్చి ప్రాంత రక్షణకు నియమించారు. రాజ్యం శిథిలావస్థకు వచ్చిన కొద్దీ బందిపోట్లు విస్తరించారు. రెండవ వెంకటరాయల పాలన కాలంలో పులుగు నాడుకు అమర నాయకుడైన మట్లి ఎల్లమరాజు సిద్ధవటం, పోరుమామిళ్ల, బద్వేల్ ప్రాంతాలలో కల్లోలం సృష్టిస్తున్న పాలెగాళ్లతోను, బందిపోట్లతోను యుద్ధాలు చేశాడు.

కానీ విజయనగర సామ్రాజ్యం పతనమైన తరువాత ఏర్పడిన అస్తవ్యస్థ పరిస్థితులను ఆసరాగా తీసుకుని పాలెగాళ్లు తమ అధికారాలను బాగా విస్తృతపరచుకున్నారు. ఏ రాజ్యంలోనూ సీమ జిల్లాలు ఎక్కువ కాలం స్థిరంగా ఉండకపోవడం, రాజులు బలహీనపడడంతో వీరి అధికారాలకి, ఆగడాలకీ అడ్డులేకుండాపోయింది. స్వతంత్రంగా భూమి శిస్తును నిర్ణయించి రైతుల నుండి వసూలు చేయడం, రైతులను, సామాన్య ప్రజలను విచక్షణా రహితంగా దోపిడీ చేయడం వీరికి అలవాటైంది. గోల్కొండ నవాబులు, మైసూరు ప్రభువులు, మరాఠాలు, టిప్పుసుల్తాన్ మొదలైనవారు కూడా ఈ పాలెగాళ్లను అణచలేకపోయారు. ఒకరకంగా ఈ పాలెగాళ్లు చిన్నసైజు కర్కశ రాజులవలె వ్యవహరించేవారు. క్రీ.శ. 1800 సంవత్సరంలో కడప జిల్లా బ్రిటీషు వారి ఆధీనంలోకి వచ్చేసరికి జిల్లా మొత్తం మీద 80 మంది పాలెగాళ్లు ఉన్నారు. వీరి వెంట 30 వేల మంది సిబ్బంది వున్నారు.

# పాలెగాళ్ల వ్యవస్థ

విజయనగర రాజుల కాలంలో చెప్పుకోదగిన వ్యవస్థ పాలెగాళ్ల వ్యవస్థ. వీరు చక్రవర్తుల ఆధీనంలో వున్న చిన్న సైనికాధికారులు. తమిళ పదం పాళయం లేక పాలెం నుంచి పాలెగార్ అనే పదం వచ్చింది. ఒక ప్రత్యేక ప్రదేశం నుంచి వసూలయ్యే ఆదాయాన్ని దఖలుపరుస్తూ పాలెగాళ్లను ప్రభువే నియమించేవాడు. తిరుగుబాట్లను అణచివేసేందుకు, బందిపోట్లను రూపుమాపేందుకు, శిక్షించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు పాలెగాళ్లకు అత్యధికారాలు ఇవ్వబడ్డాయి. రాజు బలహీనుడుగా ఉన్నప్పుడు వీరు కలహాలు, తిరుగుబాట్లు, దోపిడీలు, రక్తపాతం సృష్టించారు.

వీర నరసింహరాయలు సాళువ వంశంలో చివరివాడు. 1509లో అతని సవతి తమ్ముడు శ్రీకృష్ణదేవరాయలు (1509–1529) సింహాసనం అధిష్టించడంతో తుళువ వంశ పాలన ప్రారంభమైంది. ప్రజలంతా కలకాలమూ గుర్తుంచుకునేలా జనరంజకంగా పాలించిన కృష్ణదేవరాయలు యీ ప్రాంతంలో కూడా అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాడు. గజపతులను అణచివేశాడు. పత్తూరు పాలెంను స్థాపించిన 'ముసలి నాయుడు' కడప జిల్లాలో ఒక తిరుగుబాటును లేవదీస్తాడు. రాయలు తన సైన్యాన్ని పంపితే, నాయుడు ఎదుర్కోలేక లంకమలకు పారిపోయి తలదాచుకున్నాడు. రాయలు పుష్పగిరిని సందర్శించడాన్ని అదనుగా తీసుకుని ముసలినాయుడు క్షమాభిక్ష కోరుకున్నాడు. రాయలు క్షమించి, పుష్పగిరి–పెర్నిపాడుల మధ్య వున్న అటవీప్రాంతాన్ని అతనికి జాగీరుగా ఇచ్చాడు. తన భువన విజయ మంటపంలో అష్టదిగ్గజ కవులను నియమించి, తెలుగు సాహిత్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశాడు.

శ్రీ కృష్ణదేవరాయల అనంతరం అతని సవతి తల్లి కుమారుడు అచ్యుత రాయలు (1530–42) పీఠమెక్కాడు. ఇతనిపై 'తాళ్లపాక' కుటుంబం వారి పలుకుబడి వుండేదని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఇతని తర్వాత యీయన కుమారుడు వెంకటపతి రాయలు–1 (క్రీ.శ. 1542) గద్దెనెక్కాడు. కృష్ణదేవరాయలు మేనల్లుడైన రామరాయలు రాజప్రతినిధిగా సదాశివరాయని గద్దెనెక్కించాడు. నంద్యాల పెన్నసాని కుటుంబం వారు వీరికి సేనానాయకులుగా పనిచేశారు. 1542లో అచ్యుతరాయలు చనిపోయిన తరువాత పెమ్మసాని తిమ్మనాయుడు గండికోటను పాలించాడు. దక్కను సుల్తానులంతా ఒక్కటై 1565లో కృష్ణానది ఒడ్డున 'రాక్షసతంగడి' (తళ్లికోట)లో

రామరాయలను సమైక్యంగా ఎదుర్కొన్నారు. ఈ యుద్ధంలో రామరాయలు మరణించాడు. రాయలసీమకు రాజకీయ, సాంస్కృతిక, వాణిజ్య కేంద్రంగా వున్న విజయనగర పతనం, తదనంతరం ప్రబలిన అరాజకం – రాయలసీమకు గొడ్డలి పెట్టు అయ్యింది. ఐనప్పటికీ విజయనగర రాజులతో మరో వంద సంవత్సరాలు సన్నిహితంగానే వుంటూ వచ్చింది.

రాక్షస తంగడి యుద్ధం తర్వాత రాయలసీమ ఎన్నో వొడిదుడుకులకు లోనైంది. విజయనగరం అనేకమార్లు కొల్లగొట్టబడింది. పాలెగాళ్ల స్వతంత్ర విజృంభణ – తర్వాత విజయనగర రాజుల్లో పొటమరించిన బేధాభిప్రాయాలూ ఈ మండలాన్ని మరింత దెబ్బతీశాయి. ఆదోని కోట కూడా బీజాపూర్ సుల్తానుల వశమైంది. రెండవ వెంకటరాయల్ని మహమ్మద్ ఖులీఖుతుబ్‌షా తిప్పికొట్టి, కడప – అనంతపురం జిల్లాల్లో కొంతమేర ఆక్రమించి, చివరకు పెనుగొండను పట్టుకున్నాడు. వెంకటరాయలు తిరిగి వారి దాడిని తిప్పికొట్టి, యీ పరిస్థితుల్లో దెబ్బతిన్న గ్రామాలను చక్కదిద్దడానికి, బంజరు భూముల్ని ఉచితంగా సాగు చేసుకునేందుకు పంటలపై ప్రభుత్వ కిస్తుల్ని బాగా తగ్గించి వేశాడు. (ఇందుకూరు కైఫీయత్‌లో).

విజయనగర సామ్రాజ్య కాలంలో రాష్ట్రాలను రాజ్యాలని పిలిచేవారు. రాజ్యంలోని ప్రధాన దుర్గం పేరే రాజ్యానికి వుండేది. ఉదాహరణకు – చంద్రగిరి, ఘనగిరి (పెనుగొండ), గుత్తి, కందనవోలు (కర్నూలు) మొదలైన రాజ్యాలు శాసనాల్లో కన్పిస్తాయి. కృష్ణదేవరాయల రాజ్య ప్రారంభ కాలంలో గుత్తిని ప్రత్యేక రాజ్యంగా పేర్కొన్నప్పటికీ 1529లో పెనుగొండ రాజ్యంలో అంతర్భాగం చేశారు. అచ్యుత, సదాశివదేవ రాయల కాలాల్లో మళ్లీ ప్రత్యేక రాజ్యంగానే చెప్పారు.

రాజ్యం నుంచి వచ్చే ఆదాయాన్ని గురించి, ఆదాయానికి అనుకూలంగా వారు పోషించాల్సిన సైన్యం, విజయనగర సామ్రాజ్యానికి ప్రతి సంవత్సరం పంపాల్సిన ఆదాయాన్ని గురించి న్యూనిజ్ రచనలు వివరిస్తాయి. ఒక్కో దుర్గానికి ఒక్కో అధిపతి వుండేవాడు. అతడిని దుర్గాధిపతి అని పిలిచేవారు. సీమ వ్యవహారాలు చూడడానికి పారుపత్యదారులుండేవారు. శాంతిభద్రతల పరిరక్షణకు కావలివారు, తలారులు వుండేవారు. సరిహద్దుల్లో శాంతిభద్రతలకు బాధ్యత వహిస్తూ పాళెగాళ్లుండేవారు. పది, పన్నెండు గ్రామాలకు కావలివారు వుండేవారు. సాధారణంగా చెంచు, కోయ, బోయ జాతుల్లోని వారినే కావలిగార్లుగా నియమించేవారు. వీరికి మాన్యాలు ఇచ్చేవారు. సరిహద్దుల్లో రక్షణకు పాళెగాళ్లుండేవారు. ప్రతి పాళెగానికి రెండు గ్రామాలు 'జాగీరు' ఇచ్చి కోటలు, బురుజులు కట్టుకునే హక్కు ఇవ్వడం జరిగింది. క్రమంగా వీరే బలవంతులైపోయారు.

అమర నాయకుడు ప్రతి సంవత్సరం రాయలకు 'కప్పం' చెల్లించేవాడు. విజయనగర రాజధాని హంపిలో ప్రతి ఏడాది దసరా వేడుకలు ఘనంగా జరిగేవి. ఆ సందర్భంగా అన్ని రాజ్యాల నుంచి తండోపతండాలుగా జనం పాల్గొనేవారు. విజయనగర రాజుల కాలంలో సైన్య నిర్వహణార్థం రాజ్యాన్ని అమరాలు (మండలాలు, జాగీర్లు)గా విభజించారు. ఇవి అమర నాయకుల ఆధీనంలో వుండేవి. వీరి కింద పనిచేసే పారుపత్యదార్లు (హవల్దార్లు) క్రమక్రమంగా గ్రామ ప్రజలపై ప్రత్యక్ష అధికారులయ్యారు. గ్రామాల్లో రెడ్లు, కరణాలు, గౌడలు, శ్యాభోగ్‌లు వంశపారంపర్యంగా రెడ్డెరికాలు, కరణీకాలు మొదలుగా గ్రామాధికారాలు నిర్వహిస్తూ వచ్చారు. వీరు గ్రామ ప్రజల నుంచి రావలసిన పన్ను పర్యాయాలను వసూలు చేసి, వాటిని అమర నాయకులకు వారి పారుపత్యదారుల ద్వారా అందజేసే బాధ్యతను స్వీకరించారు.

## మట్లి రాజులు

**రా**క్షసి తంగడి యుద్ధం తర్వాత దశాబ్దాలలో, విజయనగర సామ్రాజ్య సంప్రదాయాలను అన్ని రంగాల్లో కొనసాగించి కృషి చేసిన వంశం – మట్లిరాజులది. రాయచోటి తాలూకా మట్లి నుండి వచ్చిన వీరు – దేవచౌడ వంశానికి చెందినవారు. మూడు శతాబ్దాలు యీ జిల్లాతో సంబంధాలు కలిగినవారు, యీ కుటుంబానికి మూలపురుషుడు బొమ్మరాజు. బొమ్మరాజు మనుమల్లో పెద్దవాడు వరదరాజు (క్రీస్తు శకం 1543–79). ఇతడు కృష్ణదేవరాయల కుమార్తెల్లో ఒకరైన కృష్ణమాంబను పెళ్లాడాడు. "కాకుత్ విజయం' గ్రంథకర్త మట్లి అనంతరాజు కూడా ఈ కుటుంబం వాడే! సదాశివరాయల కాలంలో – వరదరాజుకు వున్న పలుకుబడిరీత్యా, కడప జిల్లాలో ఇతని పాత్ర ప్రముఖమైంది. పొత్తపి దగ్గరున్న ఒక నదీమార్గాన్ని (అంతర్గత) తవ్వించి, ఆయన తల్లి చిన్నమ్మా పేరుతో 'చిన్నమ్మ కాలువ' అని నామకరణం చేశాడు.

మరో ప్రముఖుడు – ఎల్లమరాజు. రెండవ వెంకటరాయలకు బాసటగా నిలిచి, సిద్ధవటంలోని కొండ్రాజును, నంద్యాల నాయకుడైన కృష్ణమరాజును అణచివేసి, సిద్ధవటం సీమను లోబరచుకున్నాడు. అందుకు ప్రత్యుపకారంగా వెంకటరాయలు ఎల్లమరాజుకు చంద్రగిరి రాజ్యంలోని 'పులుగలనాడు' సీమనూ, ఉదయగిరి రాజ్యంలోని పొత్తపినాడు, సిద్ధవటం సీమలనూ 'అమర నాయంకరం'గా అతనికి ఇచ్చారు. చెన్నూరు, దువ్వూరు, కమలాపురం, పోరుమామిళ్ల, బద్వేలు మండలాల పరిపాలనా బాధ్యతను కూడా ఎల్లమరాజుకు అప్పగించాడు. ఎల్లమరాజు మనుమడు మట్లి కుమార

అనంతరాజు, కుముద్వతీ కల్యాణ గ్రంథకర్త. వెంకటరాయలకు అండగా ఉంటూ కుతుబ్‌షా ఆధీనంలో వున్న గండికోటలనూ, ఉదయగిరి గవర్నరుగా వున్న కంపనయప్పను (మధురనాయకుడు) లొంగదీసుకొన్నాడు. సాహసోపేతంగా యుద్ధం చేసి గుర్రం కొండను స్వాధీనం చేసుకున్నాడు. ఇతని కాలంలోనే మధ్య ఓగూరు కోట కోసం యుద్ధాలు జరిగాయి.

మరో రాజైన తిరువేంగళనాథుడు – పాలగిరి, అనిమెల, చెప్పలి, వేంపల్లె, గుండ్లూరు ప్రాంతాల్లోని పాలెగాండ్లతో భీకరయుద్ధాలు చేసి అణచివేశాడు. తిరుపతి – అహోబిల కొండల మధ్య ప్రాంతంపై తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకున్నాడు. తిరువెంగళనాథుని మరణానంతరం గోల్కొండ సుల్తానులతో తరచూ యుద్ధాలు చేసి ఆటుపోట్లకు గురౌతారు. గోల్కొండను మొగల్ చక్రవర్తులు స్వాధీనం చేసుకోవడానికి ముందు, యీ మట్లిరాజులు రాజంపేట తాలూకాలోని కొన్ని భాగాలను పరిపాలించారు. ఇతని తర్వాత వచ్చిన వెంకటరామరాజు కొంతకాలం టిప్పు సుల్తాన్‌తో, నిజాం నవాబుతో స్నేహంగానూ, మరికొంతం కాలం కప్పం చెల్లించడానికి వ్యతిరేకిస్తూ వచ్చారు. నిజాం వెంకటరామరాజును ఖైదు చేసి, అతని తమ్ముడైన రామరాజును తొలగించాడు. ఈస్టిండియా కంపెనీకి యీ జిల్లాను బదలాయించకముందే యివన్నీ జరిగిపోయాయి. మట్లి వంశంలో చివరివాడే – తిరువేంగళ దేవచోడ మహారాజు. ఈ వంశంవారు ఎప్పుడూ బ్రిటిష్ వారితో చేతులు కలపలేదు.

విజయనగర పతనానంతరం, మట్లి రాజుల అనంతరం యీ ప్రాంతాన్ని ఆక్రమించుకోవడానికి యిటు కూలీ కుతుబ్‌షాలు, గోల్కొండ మొగల్ చక్రవర్తులూ తలపడినారు. 1672 నుండీ 1687 వరకూ అబుల్ హసన్ కుతుబ్‌షా (తానాషాగా ప్రసిద్ధి చెందినవాడు) యీ ప్రాంతంపై కొంతవరకూ పట్టు సంపాదించాడు. 1687లో గోల్కొండ రాజ్యాన్ని మగల్ చక్రవర్తులు అణచివేసి, తమ సామ్రాజ్యంలో కలిపేసుకున్నారు.

## మొగలుల పాలన

మొగలుల పాలనలో ఔరంగజేబు సేనలకూ మరాటీ సేనలకూ – హైదరాబాద్, కర్నాటకల మధ్యగల ప్రాంతంపై ఆధిపత్యం కోసం జరిగిన యుద్ధాల్లో కడప 'మజిలీ కేంద్రం'గా సైనికులకు తిండి సరుకులు, నూనె సరఫరా చేసే కేంద్రంగా మాత్రమే వుండిపోయింది. వ్యాపారులపై స్థానిక అధికారుల దాడి, రుణాల కోసం

జరుగుతూండేది. 1688లో ఔరంగజేబు హైదరాబాద్ – కర్నాటక ప్రాంత పరిపాలనలో కొన్ని మార్పులు తీసుకొచ్చాడు. ఈ ప్రాంతంలో భాగంగా సిద్దవటం, గండికోట, గుత్తి, గుర్రంకొండ, కడప వున్నాయి.

## మయా నవాబులు

మయా నవాబులు ఆ తర్వాత యీ సీమను పాలించినారు. ఔరంగజేబు మరణానంతరం కడపకు పంపబడిన పఠాన్ దళాధిపతి – అబ్దుల్ నబీఖాన్ – మయా నవాబుల్లో మొదటివాడు. అప్పుడు సిద్దవటం ఆర్కాడు నవాబు క్రింది ఉద్యోగి అయిన కేసరి సింగ్ కుమారుడు ఫతేసింగ్ – ఉదయగిరి సుబేదారుగా వున్నాడు. సిద్దవటం అప్పుడు ఉదయగిరి సుబాలో వుంది. నబీఖాన్ మరాట్ సైనికుల దాడి నుండి తన జనానాలోని స్త్రీలకు రక్షణ కల్పించాలని ఫతేసింగ్‌ను కోరాడు. ఫతేసింగ్ అంగీకరించాడు. కానీ నబీఖాన్ డోలాలలో స్త్రీలకు బదులుగా సైనికుల్ని పంపి సిద్ధవటం కోటను 1717లో వశం చేసుకున్నాడు. గండికోటను కూడా మహమ్మద్ నబీఖాన్ నుండి వశం చేసుకున్నాడు. తన పాతిక సంవత్సరాల పానలో, సిద్ధవటం, గండికోట, కంభం, గుర్రంకొండ, పుంగనూరు ప్రాంతాల్ని లోబరుచుకున్నాడు.

పాలెగాళ్లను అదుపు చేసి వారి నుండి కప్పాలను వసూలు చేసినాడు. మసీదులను కట్టించి, వాటి నిర్వహణకు భూముల్ని ఈనాముగా ఇచ్చాడు. ఇతని పాలనలో మయానా అధికారం ఉచ్ఛస్థాయికి చేరుకుంది. తర్వాత ప్రముఖుల్లో మజీద్ మోచామియాను ఖైదు చేసి గద్దెనెక్కాడు. చివర్లో తనకు మద్దతునిచ్చిన వారే మజీద్‌ఖాన్‌పైన తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటును అణచడానికి మరాటా సైనికుల సహాయం కోరి, కోటి రూపాయలు ఇస్తానని వాగ్దానం చేసి, తప్పుకున్నాడు.

వారు సహాయం చేయకుండా ముందుకు పోతూ వుంటే మరాఠా సైన్యాలనే కడపకు రెండు మైళ్ల దూరంలో వున్న 'బండి కనుమ' వద్ద తన సైన్యాలతో ఢీకొన్నాడు. ఆ యుద్ధంలో ఆయన మరణించాడు. మరాటా సైనికులు ఆ ప్రాంతాన్ని దోచుకుని, జైల్లో వున్న మోచామియాను విడిపించారు. ప్రత్యుపకారంగా మరాటులకు గుర్రంకొండ, రాయచోటి, పులివెందుల, వేంపల్లి, పార్నపల్లి, జమ్మలమడుగు తాలూకాలను ఇచ్చాడు. తిరిగి మదీనా బీబీ – మరాటాల మధ్య కొన్ని యుద్ధాలు జరిగాయి. మజీద్‌ఖాన్ కుమారుడు హలీంఖాన్ తర్వాత అధికారానికి వచ్చి హలీంఖాన్‌ను దువ్వూరు దగ్గర ఓడించి, అతణ్ణి బందీ చేసి శ్రీరంగపట్టణం పంపాడు. హలీంఖాన్ బందీగానే మరణించినాడు. మయానా నవాబుల పాలన అంతమైంది.

# హైదరాలి మరియు టిప్పు

హైదర్ - టిప్పుల కాలంలో యీ ప్రాంతంలో మరాటాలకు - హైదర్ సైన్యాలకు, హైదర్ సైన్యాలకూ - నవాబులకూ యుద్ధాలు జరిగాయి. బ్రిటిష్ వారితో మరాటాలు కలిసిపోకుండా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించారు. అపుడు కడప జిల్లాలో కొంతభాగం, గుర్రంకొండ ప్రాంతంలో కలిసి వుండింది. చివరకు, మరాటాలకు మద్దతునిచ్చి కడప నవాబును ఖైదు చేసి శ్రీరంగపట్టణం పంపారు. హైదర్ మరణానంతరం, టిప్పు- ఇంగ్లీషు వారి మధ్య శత్రుత్వం పుంజుకొనింది. గవర్నర్ జనరల్ లార్డ్ కారన్ వాలెస్ - తానే సైన్యానికి నాయకుడైనాడు. నిజాం మరాటా సేనలు బ్రిటిష్ వారికి సహాయంగా వచ్చాయి.

టిప్పు ఓడింపబడినాడు. సంధి కుదిరింది. 1792లో కుదుర్చుకున్న ఈ సంధి ప్రకారం, సగం ప్రాంతాన్ని టిప్పు కోల్పోయాడు. ఆ సగభాగాన్ని బ్రిటిషు, నిజాం, పేష్వాలు పంచుకున్నారు. నిజాంకు యిచ్చినవి 61 తాలూకాలు - కడప, సిద్ధవటం యింకా ఇప్పటి కడప జిల్లాలో వున్న ప్రాంతాలకు చెందినవి. అదను కోసం కాచుకుని వున్న టిప్పు 1799లో పెద్దయెత్తున సైన్యాలను సమకూర్చుకుని, పోగొట్టుకున్న ప్రాంతాల కోసం ప్రయత్నాలు చేశాడు. ఈ సమయంలో నిజాం - బ్రిటిషు సేనలు కలిసి టిప్పును శ్రీరంగపట్టణం దగ్గర ఎదుర్కొన్నాయి. ఈ యుద్ధంలో టిప్పు మరణించాడు. మైసూరు విభజన సంధిని అదే సంవత్సరంలో కుదుర్చుకున్నారు. దీని ప్రకారంగా నిజాం ఎల్లలకు అనంతపురం జిల్లాలోని విశాలమైన ప్రాంతాన్ని, కడప జిల్లాలోని కొన్ని భాగాలను కలిగిన గుర్రంకొండ తాలూకాలను కలిపారు. తిరిగి 1800లో మరాటా దాడులను ఎదుర్కోవడానికి నిజాం-బ్రిటీష్ వారు మరో ఒప్పందం చేసుకున్నారు. దీని ప్రకారం నిజాం రక్షణకు బ్రిటిష్ సైన్య సహాయాన్ని పెంచేటట్లు, అందుకు బదులుగా నిజాం యితర దత్త మండలాలతో పాటు, కడప జిల్లాను కూడా బ్రిటిష్ వారికి ఇచ్చివేసేట్లు ఒప్పందం కుదిరింది. దీనితో కడప మీద నిజాం పెత్తనం అంతమైంది.

ఈ సందర్భంగా యీ జిల్లాలోని పాలెగాళ్ల వల్ల ఉత్పన్నమైన పరిస్థితుల్ని పరిశీలించవలసి వుంది. నిజాం పాలనలోకి పోయిన కడప జిల్లాలో తిరిగి పాలెగాళ్లు విజృంభించారు. నిజాం క్రింది ఉద్యోగులు మొత్తాల్లో తీసుకుంటూ వారిని ఉదాసీనంగా వదిలివేసేవారు. పాలెగాళ్ల తప్పుడు పనుల్లో వీరికీ భాగముండేది. అప్పుడప్పుడు పాలెగాళ్ల మీద చేసే దాడులు అనేక దుష్ఫలితాలనిచ్చేవి. సువిశాల ప్రాంతాల ప్రజలు వూళ్లు వదిలి వెళ్లేవారు. భూమి నిరుపయోగంగా పడి వుండేది. నివాస ప్రజలు

కరువు కోరల్లో ఇరుక్కుపోయేవారు. సిపాయిలు లైసెన్సు పొందిన దోపిడీదారులుగా తయారయ్యారు. తరచుగా సుంకాలు, పన్నులు పెంచబడేవి. ప్రజలు అనేక కష్టనష్టాల్లో కూరుకుపోయారు.

## బ్రిటిష్ పాలన

పై పరిస్థితుల్లో 1800 సం॥లో సర్ థామస్ మన్రో దత్త మండలాలకు ప్రిన్సిపల్ కలెక్టర్‌గా నియమించబడ్డాడు. అతనికి సహాయంగా నలుగురు సబ్ కలెక్టర్లను నియమించారు. వారి ప్రధాన కేంద్రాలుగా – హర్పనహళ్ళి, కడప, ఆదోని, కంభం వున్నాయి. ఈ కేంద్రాల్లో మిలటరీ దళాల్ని కూడా ఏర్పాటు చేసేవారు. ఒక పద్ధతి ప్రకారం శిస్తులు వసూలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఏ కోటలోనైనా అనధికార సైన్యాన్ని వుంచుకున్నా, ప్రజల నుండి అక్రమ పన్నులు వసూలు చేసినా, అట్టివారిని ప్రభుత్వ తిరుగుబాటుదారులుగా పరిగణిస్తుందని మన్రో ప్రకటించాడు. సర్వే చేయించి, దత్త మండలాల్లో యనభై మంది పాలెగాళ్లున్నారని నిర్ధారించారు. అందులో ఎక్కువమంది కడప జిల్లాలోనే వున్నట్లు గుర్తించి రెండేళ్లలో వారిని పూర్తిగా అణచివేశాడు. కొన్ని సంవత్సరాల తర్వాత అతడు సెలవు మీద యీ ప్రాంతాన్ని వదిలి వెళ్లాడు.

**గ్రామీణ ప్రాంతాల్లో కక్షల నేపథ్యాన్ని వివరించే జానపద గీతం**

నల్లఛత్రిబట్టుకోని
కోరసెప్పులేసుకోని
కట్టమీద బోతా వుంటే కోడుకా మానిందారెడ్డి
నువు కలకటేరనుకుంటిరా కొడకా...
మల్లు పంచె కట్టుకొని,
నల్లకోటు వేసుకొని, పాలెగాడిలాగానూ
నున్నంగ తలదువ్వి, మట్టంగ తలదువ్వి
చుక్కబొట్టు పెట్టుకొని కొడుకా మానిందారెడ్డి
సందమామ అనుకుంటిరా కొడకా...
కడప జిల్లా జంబలమడుగు జంగసునా కొట్టుపల్లి
వచ్చిపోయే దారిలోన, దానిమ్మ సెట్టుకాడ
ఎండికుచ్చు నేలబడితే మహనీయుడా మానిందరెడ్డి
నా కొడకా మానిందారెడ్డి ఏటుకే నీ తలాగొట్టిరా
రాజా మానిందరెడ్డి ఒక ఏటుకే తలానిరికిరో
కొడకా మానిందరెడ్డీ నీ కిలలో బత్తెము తీరెనా

## 'మన్రో' ఉక్కుపాదం!



కడప, బళ్లారి జిల్లాలతో సహా దత్తమండలం ప్రాంతం తమ ఆధీనంలోకి రాగానే బ్రిటీషు ప్రభుత్వం క్రీ.శ. 1800 సంవత్సరంలో మేజర్ థామస్ మన్రోను దత్తమండలం జిల్లాలకు ప్రధాన కలెక్టర్‌గా నియమించింది. మన్రో కలెక్టరుగా రాగానే అస్తవ్యస్థంగా వున్న పాలనా వ్యవస్థను చక్కదిద్దడం, ఈస్ట్ ఇండియా కంపెనీవారి ఆదాయాన్ని పెంచడం ప్రధాన కర్తవ్యాలుగా ఎంచుకున్నాడు. అస్తవ్యస్థంగా వున్న పాలనా వ్యవస్థను చక్కదిద్దడానికి, కంపెనీ పాలనను సుస్థిరపరచడానికి పాలెగాళ్లు పెద్ద అవరోధమని మన్రో భావించాడు. వీరి అడ్డు తొలగించుకోనిదే దత్తమండలం ప్రాంతంలో కంపెనీ అధికారం స్థిరపడదని గ్రహించాడు. అయితే నేరుగా పాలెగాళ్లని తొలగించడానికి మద్రాస్ గవర్నర్‌గాని, కంపెనీ బోర్డు డైరెక్టర్లుగాని సుముఖంగా లేరని గ్రహించాడు. స్థానిక పెత్తందార్లతో నేరుగా కయ్యానికి దిగకుండా తమ అధికారాన్ని సుస్థిరపరచుకోవాలనేది కంపెనీ వారి ఆలోచన. కానీ, పాలెగాళ్లను తొలగించందే కంపెనీ పాలనను సుస్థిరపరచుకోవడం అసాధ్యమనేది మన్రో ఆలోచన. పాలెగాళ్లు తిరగబడేటట్లు చేయగలిగితే, అప్పుడు వారిని క్రూరంగా అణచివేసినా మద్రాసు కంపెనీ కానీ, కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగాని తననేమి అనరని మన్రో భావించాడు. అందుకు పథకం సిద్ధం చేసుకున్నాడు.

ముందుగా పాలెగాళ్లు కంపెనీకి చెల్లించాల్సిన కప్పాన్ని భూమిశిస్తుగా మార్చాడు. ఆ తర్వాత భూమి శిస్తును హఠాత్తుగా పెంచాడు. ఎంతగా పెంచాడంటే మంచి ఆదాయ వనరులున్న పాలెగాళ్లు సైతం చెల్లించలేనంత స్థాయికి వారు చెల్లించాల్సిన భూమి శిస్తును పెంచాడు. దాంతో పాలెగాళ్లలో కలవరం బయలుదేరింది. అదే సమయంలో మన్రో ఒక ఫర్మానా జారీ చేశాడు. కంపెనీకి తెలియకుండా రైతుల నుండి ఎవరూ శిస్తులు వసూలు చేసినా, కంపెనీ తరపున శిస్తు వసూలు చేసే వారిని ఎవరు అడ్డగించినా, ప్రైవేటుగా సైన్యాలు ఎవరు తయారు

చేసుకున్నా వారిని తిరుగుబాటుదారులుగా పరిగణిస్తామనేది ఆ ఫర్మానా సారాంశం. వాస్తవానికి ఇవన్నీ పాలెగాళ్లు చేసే పనులే. కంపెనీ ఆజ్ఞలను ధిక్కరించటానికి ప్రయత్నించిన పాలెగాళ్లను క్రూరంగా అణచివేశాడు. 1802 నాటికల్లా మొత్తంగా దత్తమండలం ప్రాంతంలోని పాలెగాళ్ల వ్యవస్థను తుడిచిపెట్టి వేయగలిగాడు. 1802 ప్రారంభంలో కంపెనీకి పంపిన ఒక నివేదికలో దాదాపుగా పాలెగాళ్ల సమస్యను పరిష్కారం చేసినట్లు, ఒకరిద్దరు పాలెగాళ్లు అడపాదడపా తిరుగుబాటు చేసి అణచివేతకు అందకుండా తప్పించుకుంటున్నా వారొక పెద్ద సమస్య కాదన్నట్లు పేర్కొన్నాడు. పాలెగాళ్ల నుండి భూములను, భూమి శిస్తు వసూలు హక్కును రద్దు చేసి వాటిని కంపెనీకి దాఖలుపరిచాడు. దానికి బదులుగా పాలెగాళ్లకు పింఛను ఏర్పాటు చేశాడు. కంపెనీ వ్యవహరిస్తున్న తీరు నచ్చక కొంతమంది పాలెగాళ్లు తరువాత కాలంలో కూడా తిరుగుబాటు చేశారు. అటువంటి వారిలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రముఖులు. పాలెగాళ్ల పట్ల మన్రో అనుసరిస్తున్న దమన వైఖరిని కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు కూడా నిరసించారు. ముఖ్యంగా వేముల పాలెగాళ్ల పట్ల మన్రో దురుసు వైఖరిని కంపెనీ డైరెక్టర్లు తప్పు పట్టారు. అయితే మన్రో తన దమననీతిని గట్టిగా సమర్థించుకున్నాడు. పాలెగాళ్లకు అనుకూలంగా మాట్లాడుతున్న వారికి, పాలెగాళ్ల వ్యవస్థను కొనసాగించాలని వాదిస్తున్న వారికి పాలెగాళ్ల గురించి సరిగా తెలియదని వాదించాడు. వారు ఇతర ప్రాంతాలలోని జమీందార్లు వంటివారు కాదనీ, చిన్నసైజు రాజులు వంటివారని వాదించాడు. పాలెగాళ్లు ఉన్నంతవరకు కంపెనీ పాలన సుస్థిరమవడం కాని, కంపెనీ ఆదాయం పెంచుకోవడం కానీ, దత్త మండలమును వ్యవసాయకంగా అభివృద్ధి చేయడం కానీ సాధ్యం కాదని వాదించాడు.

## రైత్వారీ శిస్తు విధానం

ఒక ప్రక్క పాలెగాళ్లను క్రమంగా అడ్డు తొలగించుకుంటూనే మరోపక్క రైత్వారీ భూమిశిస్తు విధానాన్ని ప్రవేశపెట్టడానికి ఏర్పాట్లు ప్రారంభించాడు. 1802లో జిల్లాలోని భూములన్నిటినీ సర్వే చేయమని ఆజ్ఞలు జారీ చేశాడు. సేలం జిల్లాలో కల్నల్ రీడ్ నాయకత్వంలో పనిచేసినప్పుడు రైత్వారీ శిస్తు విధానాన్ని అమలు చేయడంలో మన్రో అప్పటికే కొంత అనుభవాన్ని గడించాడు. ఆ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకునే దత్త మండలంలో కూడా రైత్వారీ పద్ధతిని అమలు చేసే ప్రయత్నాలు ప్రారంభించాడు. మొట్టమొదటిసారిగా శాస్త్రీయ పద్ధతిలో కడప జిల్లాలో భూమి సర్వే ప్రారంభమైంది. అప్పుడే ఆ సర్వేని అప్పట్లో 'పైమైష్' అని పిలిచేవారు. భూమిని కొలవడానికి 33 అడుగులు వున్న గొలుసును ఉపయోగించేవారు. 40 చదరపు గొలుసుల ప్రాంతాన్ని

ఒక ఎకరంగా పరిగణించారు. పర్వతాలు, గుట్టలు తప్పించి మొత్తం జిల్లాలోని భూములన్నిటినీ కొలిచారు. పొలాలన్నిటికీ సర్వే నెంబర్లు కేటాయించారు. ఏ సర్వే నెంబరు గల పొలం ఎవరు సాగు చేస్తున్నారో తెలిసే విధంగా ఒక జాబితాను తయారు చేశారు. భూమి కొలతలు పూర్తవగానే భూములను వర్గీకరించే పనిని చేపట్టారు. సాగు లాయికీ అయిన భూమెంత, అందులో సాగవుతున్నదెంతో కూడా లెక్కగట్టారు. 1806 నాటికి పూర్తయిన లెక్కల ప్రకారం దత్తమండల జిల్లాలలో 120 లక్షల ఎకరాల సాగు లాయికీ భూమి ఉండగా, అందులో కేవలం 32 లక్షల ఎకరాల భూమి మాత్రమే సాగు అవుతున్నట్లు తెలిసింది.

మొత్తంగా సాగవుతున్న భూములను ఆయా గ్రామ కరణాల సహాయంతో మెట్ట, మాగాణి భూములుగా వర్గీకరించారు. పంట దిగుబడులను బట్టి మెట్ట భూములను 8–10 తరగతులుగాను, మాగాణి భూములను 5–6 తరగతులుగాను వర్గీకరించారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఒక్కో జిల్లా నుండి ఎంత ఆదాయం వస్తుందో ముందుగా అంచనా వేసి, అప్పుడు జిల్లా శిస్తును నిర్ణయించేవారు. అంతకు ముందు సంవత్సరాలలో వసూలైన శిస్తును దృష్టిలో ఉంచుకుని, ఆ ఏడాది పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని జిల్లా శిస్తును నిర్ణయించేవారు. ఆ శిస్తును గ్రామాలవారీగా పంపకం చేసి, ఒక్కో గ్రామంలో ఏ రైతు ఎంత చెల్లించాలో నిర్ణయించేవారు. గ్రామాలకు శిస్తు రెమిషన్ కూడా ఇచ్చారు. అయితే ఆ రెమిషన్‌ను పంటలు బాగా పండిన రైతుల నుండి, గ్రామాల నుండి వసూలు చేసేవారు. మాగాణి భూములలో పండిన పంటలో 50 వంతులు, మెట్ట భూములలో 35 వంతుల పంటను ప్రభుత్వం వాటాగా గుర్తించి శిస్తు నిర్ణయించారు.

ఇలా రైత్వారీ పద్ధతిని అమలు జరిపిన తర్వాత 1806 – 1807లో కడప జిల్లా నుండి (కంభం, మార్కాపురం, కోయిలకుంట్ల తాలూకాలు మినహా) వసూలైన భూమి శిస్తు మొత్తం 17 లక్షల రూపాయలు. కంభం, మార్కాపురం, కోయిలకుంట్ల తాలూకాల నుండి సగటున నాలుగున్నర లక్షల రూపాయలు భూమి శిస్తు రూపంలో కంపెనీకి ఆదాయంగా లభించింది. 1800–1802 సంవత్సరాలలో కడప జిల్లా నుండి భూమి శిస్తుగా కంపెనీకి దక్కింది 5 లక్షల రూపాయలు మాత్రమే. రైత్వారీ పద్ధతిని అమలు చేయడం ద్వారా కంపెనీ తన ఆదాయాన్ని 5 లక్షల రూపాయలు అదనంగా పెంచుకోగలిగింది. ఆర్థికంగా కంపెనీకి లాభదాయకమైన ఈ అంశాన్ని చూపెట్టే మన్రో రైత్వారీ పద్ధతికి అనుకూలంగా తన వాదనలను బలపరచుకున్నాడు.

# రైత్వారీ పద్ధతిపై కంపెనీ విముఖత

రైత్వారీ పద్ధతిని అమలు చేయడానికి కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు మొదటి నుండీ సుముఖంగా లేరు. రైత్వారీ పద్ధతిలో పన్నులు వసూలు చేసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించుకోవాల్సి వస్తుందని, దాని వల్ల కంపెనీకి అదనంగా ఖర్చులవుతాయని, దానికి బదులుగా జమీందార్లను, పాలెగాళ్లను ఏజంట్లుగా పెట్టుకుని భూమిశిస్తు వసూలు చేసుకోవడం సులభమని కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో కొందరు భావించారు. రైత్వారీ పద్ధతికన్నా గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని శిస్తు వసూలు చేసే పద్ధతి లాభదాయకమా కాదా అని పరిశీలించమని 1805లో జిల్లా కలెక్టర్లందర్నీ ఆదేశించారు.

అప్పటికే రైత్వారీ పద్ధతిని అమలు చేయడంలో మంచి అనుభవం గడించిన మన్రో కంపెనీ సూచించిన ప్రత్యామ్నాయ గ్రామశిస్తు పద్ధతిని పూర్తిగా వ్యతిరేకించాడు. గ్రామశిస్తు విధానం వల్ల వసూలు ఖర్చులు కంపెనీకి తగ్గే మాట నిజమే. అయితే రైత్వారీ పద్ధతిలో అలా తగ్గే మొత్తాన్ని సంపాదించవచ్చునని వాదించాడు. జమీందారో, పాలెగాళ్లో, గ్రామశిస్తు చెల్లింపు బాధ్యతను తీసుకున్న పెద్ద రైతో శిస్తు చెల్లించలేనప్పుడు కంపెనీకి విపరీతమైన నష్టాలు వస్తాయని, పైపెచ్చు వారెవరూ వ్యవసాయాభివృద్ధికి పాటుపడేవారు కాదని, రైతులను దోపిడీ చేసి పరోక్షంగా కంపెనీకి చెడ్డపేరు తెచ్చిపెట్టే వారవుతారని వాదించాడు. అలాకాకుండా రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టినట్లయితే శిస్తు చెల్లింపు బాధ్యత నేరుగా రైతుదే అవుతుందని, ఎన్ని కష్టాలు పడైనా సరే రైతు పన్ను చెల్లించి తీరుతాడని, అలా చేయలేని పక్షంలో ఆ భూములను వేరొకరికి ఇచ్చి శిస్తు వసూలు చేసుకోవచ్చుని, ఈ పద్ధతిలో బకాయిల భారం ఎక్కువగా వుండదని మన్రో వాదించాడు. పైపెచ్చు రైత్వారీ పద్ధతిలో భూమిపై రైతుకు కొన్ని హక్కులుండడం వల్ల వ్యవసాయాభివృద్ధికి పాటుపడతాడని మన్రో అభిప్రాయపడ్డాడు.

బెంగాల్ గవర్నర్‌గా పనిచేసిన విలియం బెంటింక్ కూడా మన్రోకు రైత్వారీ పద్ధతి అమలు విషయంలో గట్టి మద్దతు ఇచ్చాడు. 1807లో దత్తమండలంలో పర్యటించిన కంపెనీ రెవిన్యూ బోర్డు సభ్యుడు థాకరే కూడా మన్రో వాదనలను బలపరిచాడు. అయితే బోర్డులో ప్రముఖుడైన హెడ్గాసన్ మాత్రం గ్రామశిస్తు విధానానికే మొగ్గు చూపాడు. లండన్‌లోని హౌస్ ఆఫ్ కామర్స్ నివేదిక కూడా రైత్వారీ పద్ధతిని ప్రశంసించింది. కాని, హెడ్గాసన్ వంటి సభ్యుల కారణంగా రెవిన్యూ బోర్డు రైత్వారీ పద్ధతికన్నా గ్రామశిస్తు విధానమే మెరుగని భావించింది. లండన్‌లోని తమ కేంద్ర

కార్యాలయాన్ని ఒప్పించి గ్రామశిస్తు విధానాన్ని ప్రవేశపెట్టడానికి అనుమతి పొందారు. 1807లో మన్రో దత్తమండలం జిల్లాల కలెక్టర్ పదవి నుండి వైదొలగడం, కంపెనీ గ్రామశిస్తు విధానాన్ని ప్రవేశపెట్టడం ఒకేసారి జరిగింది. అయితే మన్రో తన వాదనలు కొనసాగిస్తూనే వచ్చాడు. రైత్వారీ పద్ధతి వల్ల కంపెనీకి ఎంత మేలు కలుగుతుందో లండన్‌లోని తమ కంపెనీ డైరెక్టర్లకు వివరించి ఒప్పించే ప్రయత్నాన్ని 1920 వరకూ కొనసాగిస్తూనే ఉన్నాడు.

## రైత్వారీకి స్వస్తి - గ్రామశిస్తు విధానం అమలు

1807లో మన్రో దత్తమండల కలెక్టర్ పదవి నుండి వైదొలగిన వెంటనే రైత్వారీ పద్ధతికి స్వస్తి చెప్పారు. మొత్తం గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, ఎంత పన్ను చెల్లించాలో నిర్ణయించి, అంత పన్ను చెల్లించడానికి సిద్ధపడి ముందుకు వచ్చిన వ్యక్తికి ఆ గ్రామంలోని భూములను మూడేళ్లకు కౌలుకిచ్చే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతి వలన శిస్తు వసూలు సులభమవుతుందని, శాశ్వత కౌలు పద్ధతిని ప్రవేశపెట్టడానికి ఇది ప్రథమ సోపాన మవగలదని పేర్కొన్నారు. తరువాత రెండు మూడు సంవత్సరాలకే ఈ పద్ధతిని కొద్దిగా మార్పు చేసి మూడేళ్ల కాలపరిమితి స్థానంలో పదేళ్ల కాలపరిమితిని, తొమ్మిదేళ్ల కాలపరిమితి పద్ధతిని ప్రవేశపెట్టారు.

## దివిటీ దొంగలు

విజయనగర సామ్రాజ్యం పతనం తర్వాత పన్నులు వసూలు చేస్తూ, రక్షణ కాపలాదార్లుగా వుంటూ వచ్చిన పాలెగాళ్లు విజృంభించారు. 18వ శతాబ్దంలో పాలెగాళ్లు నిజాం అధికారాన్ని మన్నించారు. కానీ కప్పం చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వుండేవారు. ఒకేసారి 80 మంది పాలెగాళ్లు నిజాం అధికారాన్ని వ్యతిరేకించారు. మొదట ఆదోనిలో తిరుగుబాటు మొదలైంది. కంపెనీ సైన్యం దానిని అణిచివేసింది. 1803లో కడపలో సుల్తాన్‌ఖాన్, చిత్తూరులో నాగేటి పాలెగాళ్ల తిరుగుబాట్లు జరిగాయి. వీరిని నిర్దాక్షిణ్యంగా ప్రభుత్వం అణిచివేసింది. పాలెగాళ్ల చర్యల వల్ల ప్రజలు అనేక విధాలుగా నష్టపోయారు. రక్షణ లేకుండా పోయింది. పాలెగాళ్లే దోపిడీ దొంగలై ప్రజల్ని దోచుకున్నారు. వీళ్లనే దివిటీ దొంగలు అని కూడా పిలిచేవారు. 'కుమ్మరి గుండోళ్ల'నే పేరుతో మరికొన్ని చోట్ల పిలిచేవారు. తర్వాత కలెక్టర్‌గా వచ్చిన థామస్ మన్రో వీరిని లొంగదీసుకొని అణచివేశాడు.

# పాలెగాళ్ల బంధీఖానా

మన్రో సీమలో ముఖ్యమైన 80 మంది పాలెగాళ్లను వెతికి బంధించి తీసుకొచ్చి గుత్తికోటలో నిర్బంధించినట్లు కథనం. మేజర్ జనరల్ కాంప్‌బెల్ నాయకత్వంలో గండికోట, దబ్బాడపల్లికోట, ఊరుచింతల, తలారి చెరువు, తూములపెంట, బూరుగుల ఉప్పలపాడు, రాయచెర్ల, మునిమడుగు కోటల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. గండికోటలో రెండువేల మణుగుల మందుగుండు సామాగ్రి, రెండువేల గుండ్లు, ఒక ఫిరంగి పట్టుకున్నారు. 1845లో పాలెగాళ్లు మరణించిన తర్వాత ఆ కుటుంబానికి ఫించను ఇవ్వకుండా నిషేధించారు. వారసులు లేరు అనే కారణం చూపి కోవెలకుంట్ల తాలూకాలో 60 పాళెములు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత 23 మాన్యాలను ప్రభుత్వం వశం చేసుకుంది. ఇలాగే ఉయ్యాలవాడ, నోసమ్ పాలెగాళ్లు తమ భూముల్ని పోగొట్టుకున్నారు. చంద్రగిరి ఇలాకాలో 82 మంది పాలెగాళ్లను మన్రో అదుపులోకి తీసుకున్నాడు.

# కర్నూలు పాలెగాళ్లు



ఆళియ రామరాజుకు కర్నూలు కోటను పాలిస్తున్న వెంకటాద్రి సహాయం చేశాడని చరిత్ర పేర్కొంటోంది. అతని దాయాదులు తిమ్మరాజు అవుకుకు, కొండరామరాజు ఆదోనికి, తొలిశిపాటి రెడ్డి ఆలూరుకు, బేదాగళు బేతంచర్లకు పాలకులుగా వుండేవారు. 17వ శతాబ్ది మధ్యకాలంలో విజయనగర రాజుల పాలన అంతమైంది. ఈ సమయంలో వెలుగోడు, నంద్యాల, అవుకు, గని వంటి ప్రాంతాలను పెద్దరాయుడు, ఆరవీడు వంశస్థుడైన గని తిమ్మప్ప వంటి వారు పాలకులయ్యారు.

క్రీ.శ. 1800 మద్రాసు ప్రభుత్వం సర్ థామస్ మన్రోను సీడెడ్ జిల్లాల ప్రిన్సిపాల్ కలెక్టరుగా నియమించడంతో జిల్లాలో ఆంగ్లేయుల పాలన ఆరంభమైంది. ఇదే సమయంలో జిల్లాలో 150 మంది పాలెగాళ్లు తమ తమ ప్రాంతాల్లో తిరుగులేని పాలకులుగా ఉండేవారు. మన్రో కొందరు పాలెగాళ్లకు నచ్చజెప్పి, మరికొందరిని భయపెట్టి ఆ ప్రాంతాలను తమ స్వాధీనంలోనికి తెచ్చుకున్నారు. కోటకొండ, కప్పట్రాళ్ల, దూదేకొండ, పందికోన, దేవనకొండ, బసవాపురం, అవుకు, నల్లగట్ల, కోవెలకుంట్ల,

ముత్యాలపాడు, ప్యాపిలి, మద్దికెర వంటివి ఆనాటి పాలెగాళ్ల ముఖ్యకేంద్రాలు. 1807 వరకు మన్రో కలెక్టరుగా వున్నారు. 1846 వరకు బ్రిటీషు పాలన కొనసాగింది. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా తొలి తిరుగుబాటు తెర్నెకల్లు గ్రామంలో జరిగింది. 1801 ముత్తుకూరు గౌడప్ప, 1823లో కర్నూలు చివరి నవాబు గులాం రసూల్‌ఖాన్ ఆంగ్లేయులపై తిరుగుబాటు చేశారు. 1847లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 9 వేల మంది సైనికులను వెంటబెట్టుకొని కోవెలకుంట్ల, రుద్రవరం, శిరివెళ్ల, ముండ్లపాడు, క్రిష్ణంశెట్టిపల్లె వంటి ప్రాంతాలలో ఆధిపత్యాన్ని నెలకొల్పి బ్రిటీషువారికి సవాలుగా నిలిచారు. కలెక్టర్ కాక్రెయిన్ ఆధ్వర్యంలో బ్రిటిషు సైన్యం ఆయనను పట్టి బంధించింది. 1847 ఫిబ్రవరి 22వ తేదీన కోవెలకుంట్ల సమీపంలోని జుర్రేరు నది ఒడ్డున ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని ఉరితీసి అతని తలను కోవెలకుంట్ల కోట గుమ్మానికి వేలాడదీశారు.

## తొలి సీమ వీరుడు ఉయ్యాలవాడ

దత్తమండలం ప్రాంతంలో పాలెగాళ్లంటే స్వాతంత్ర్య వీరులు. ఆయా పరిసర ప్రాంతాల రక్షణకు నాటి కుంఫిణీ సర్కారును తరిమి తరిమి కొట్టేందుకు, తమ వెన్నంటి నడిచిన పాలెగాళ్లు, ప్రజల్లో విప్లవజ్వాలలనే రగిలించారు. తెల్లదొరల పాలనకు చరమగీతం పాడేందుకు ఉద్యమించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డిలాంటి విప్లవయోధుడు, చెంచులను, బోయలను, యానాదులను, బ్రాహ్మణులను చేరదీసి స్వాతంత్ర్య సమరానికి సమాయత్తం చేసిన తొలి పాలెగాడు. "సైరా... నరసింహారెడ్డీ..." అంటూ, ఆ పాలెగాడిని కీర్తిస్తూ ప్రజలు ఇవాల్టికీ పాటలు పాడుకుంటూ కనిపిస్తారు. ఆ స్వాతంత్ర్య సమరవీరుడిని, కుంఫిణీ సర్కారు కుందూ నదీతీరంలో ఉరి తీసింది.

> "అమితోద్దండ దురంత పీడనకు లోనై, భారతీయ ప్రజా
> సముదాయం బొనరించినట్టి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ
> రంగము కన్నం బది ఏండ్లకున్ మునుపె, యాంగ్లప్రాజ్య సామ్రాజ్య సై
> న్యముపై 'గత్తిని దూసినట్టి' నరసింహారెడ్డి సామాన్యుడే?"

– అంటూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఔన్నత్యాన్ని, ప్రముఖ కవి పాణ్యం నరసరామయ్య చాటాడు.

1800 సంవత్సరంలో నైజాం నవాబు దత్త మండలాలను ఆంగ్లేయుల పరం చేసినాడు. అందువల్ల దత్తమండలాల్లో భాగమైన నొస్సం కోట కూడా ఆంగ్లేయుల వశం అయింది. నొస్సం కోటను చెంచుమల్ల జయరామిరెడ్డి అనే పాలెగాడు

పాలించేవాడు. ఈయన తన మనమడు నరసింహారెడ్డినే దత్తత తెచ్చుకున్నాడు. ఉయ్యాలవాడలో పెరిగినందున అతనికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని పేరు వచ్చింది.

బ్రిటీష్ వారు పాలెగాళ్ల వంశపారంపర్య హక్కులను రద్దు చేసి నెలసరి పింఛన్ ఏర్పాటు చేశారు. ఉయ్యాలవాడ జాగీర్‌ను వశపరచుకున్న కలెక్టర్, నరసింహారెడ్డి కుటుంబానికి నెలకు రూ. 35/- పింఛను ఏర్పాటు చేశారు. ముగ్గురన్నదమ్ముల భాగంలో నరసింహారెడ్డికి పదకొండు రూపాయల చిల్లర వచ్చేది. నొస్సంకోట పాలెగాడు జయరామిరెడ్డి చనిపోయినందున అతనికి రావలసిన పింఛను దత్తపుత్రుడు నరసింహారెడ్డికి ఇవ్వలేదు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వీరుడు, గొప్ప బలవంతుడు, కండపుష్టి కలవాడు. ఆయన చెట్టు క్రింద పడుకొని నోటిలో గులకరాళ్లు పోసుకుని వాటిని ఉఫ్ అని ఊదితే చెట్టుపైనున్న పిట్టలు చచ్చిపడేవని చెప్తారు. ఈయన ప్రజలకు ప్రీతిపాత్రుడు. ప్రజోపయోగకరములైన పనులను చేశాడు. కరవు కాటకాలలో ప్రజలను బాగా ఆదరించాడు.

1845 వరకు నరసింహారెడ్డికి రావలసిన తనర్జీ (భరణం, పింఛను) క్రమంగానే వచ్చేది. 1845లో తనకు రావలసిన పింఛనుకై కోయిలకుంట్ల తహసీల్దారు దగ్గరకు తన మనిషిని పంపాడు. తహసీల్దారు నరసింహారెడ్డికి పింఛను ఇవ్వకపోగా, "దాసరికి మరొక దాసరా! పెద్ద దాసరినే రమ్మనుపో!" అని ఆత్మగౌరవాన్ని ఘోరంగా దెబ్బతీసే విధంగా తిట్టి పంపినాడు. నరసింహారెడ్డి ఈ అవమానాన్ని భరించలేక పోయినాడు. మరుసటిరోజే 500 మంది బోయసైన్యంతో కోయిలకుంట్ల ట్రెజరీపై దాడి చేసి కచ్చేరిని ధ్వంసం చేసి, తహసీల్దారు తలను నరికేసినాడు. ఈ విషయమై నరసింహారెడ్డిని బంధించడానికి వచ్చిన కొద్దిమంది పోలీసులు తిట్లు, తన్నులు తిని ప్రాణాలతో బయటపడినారు.

ఆ పైన నరసింహారెడ్డి సైన్య సమీకరణ చేసినాడు. కరువు కాటకాల్లో ఆదుకున్నందుకు ఆ కృతజ్ఞతతో పిలిచిన వెంటనే ఆనందంతో బోయవారంతా సైన్యంగా వచ్చారు. ఈ సైన్యానికి 'ఇల్లావులరాణువా' అని పేరు. అలాగే మాన్యాలు పోగొట్టుకున్న పాలెగాళ్లు, కొండజాతుల వారు సైన్యంగా చేరారు. ఈ సైన్యంలో బోయలు, చెంచులు, బ్రాహ్మణులు, ముస్లీములు అందరూ వేల సంఖ్యలో వున్నారు.

1846 జులైలో ఈ వేలాది సైన్యంతో రెండుసార్లు బ్రిటీష్ సైన్యంతో పోరాడి

గెలిచాడు. ఆ తరువాత సౌన్యంతో నొస్సంకోట వదలి దండయాత్ర మొదలుపెట్టి ట్రెజరీలు దోచుకున్నాడు. నరసింహారెడ్డిని పట్టుకుంటే వెయ్యి రూపాయల బహుమానం ప్రకటించింది ప్రభుత్వం. లెఫ్టినెంట్ వాట్సన్ అనే సేనాని పెద్ద సైన్యంతో నరసింహారెడ్డి పైకి వచ్చినాడు. కర్నూలు నుండి గుర్రపు దళం కూడా వచ్చింది.

నరసింహారెడ్డి వేల సైన్యంతో గిద్దలూరు దగ్గర బ్రిటీష్ వారిని ఎదుర్కొన్నాడు. నరసింహారెడ్డి సైన్యం అంతా నష్టమైపోయింది. అందువల్ల నరసింహారెడ్డి ఎర్రముల, నల్లముల కొండల్లోకి తప్పించుకుపోయాడు. అతన్ని పట్టుకోవడానికి ఎంత ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. అందువల్ల నరసింహారెడ్డిపై ఒత్తిడి తేవడానికి ఆయన కుటుంబాన్ని కడపలో నిర్బంధంలో వుంచింది ప్రభుత్వం.

1846లో అక్టోబర్‌లో పేరుసోములలో వున్న జగన్నాథ ఆలయంలో నరసింహారెడ్డి వున్నాడని తెలిసింది. వంటమనిషి డబ్బుకు ఆశపడి నమ్మకద్రోహం చేసి ఈ వార్త బ్రిటీష్ వారికి అందజేసిందని అంటారు. కడప కలెక్టరు చుట్టుముట్టి మనుషులను కాల్చి చంపినారు. కాలికి గుండుదెబ్బ తగలడంతో నరసింహారెడ్డి పట్టుబడినాడు. ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడమే కాక, దోపిడీలకు పాల్పడినట్లు తీర్పు చెబుతూ, ఉరిశిక్ష విధించినారు. 1847 ఫిబ్రవరి 22 ఉదయం 7 గంటలకు కోయిలకుంట్లలో వీరుడు నరసింహారెడ్డిని బహిరంగంగా ఉరి తీయడమే కాక, 1877 వరకు నొస్సం కోటలోని ఉరికంభానికి తలను వేలాడదీసి కిరాతకంగా చంపారు.

## 'రేనాటి సూర్యచంద్రులు' నుంచి ఒక సంఘటన

నరసింహారెడ్డి రాత్రి పూటనే యుద్ధం చేయాలనే వ్యూహంతో ఉన్నట్లు బ్రిటీషువారికి అర్థమైంది. ఆ రోజు పగటిపూట వందల గుండ్లను కోటగోడల మీద కుమ్మరించింది బ్రిటీషు సైన్యం. కోట అక్కడక్కడ పగుళ్లువారింది. దాదాపు నెల రోజుల యుద్ధానంతరం ఏర్పడిన పరిస్థితి ఇది. కోటకు ఒకవైపు నుండి అడవిలో దారి ఏర్పడింది. అది బ్రిటీషు సైనికుల చేతుల్లో ఉంది. వారికి కావాల్సిన ఆహారపదార్థాలు, మందుగుండు సామాగ్రి ఆ దారిగుండానే అందుతున్నాయి. అడవుల్లోకెళ్లిన రెడ్డిసైన్యం దానిని నిరోధించలేకపోయింది. కోటగోడలు కూలటం ఖాయమని తేలింది.

ఆ రోజు రాత్రి మిగిలిన సైన్య బలగాలతో కోటను పూర్తిగా వదిలిపెట్టి నరసింహారెడ్డి దట్టమైన అడవుల్లోకి వెళ్లిపోతూ ఆంగ్లసైన్యంపై దాడి చేశాడు. దాడి తర్వాత కొద్దిపాటి బలగంతో దట్టమైన అడవుల్లోకి వెళ్లిపోయారు నరసింహారెడ్డి. ఆ

మరుసటి రోజు కోటగోడ కూలింది. ఓబన్న, వెంకన్న ఇద్దరూ ఆంగ్ల సైన్యం చేతిలో చనిపోయారు. 1843లో ప్రారంభమైన పోరు మూడు సంవత్సరాలు జరిగింది. నర్సింహారెడ్డి సైన్యం చెల్లాచెదురైంది. వెయ్యిమంది పట్టుబడ్డారు. దాదాపు మూడువేల మంది చనిపోయారు. మిగిలినవారు తమతమ గ్రామాలకు వెళ్లి వివిధ వృత్తుల్లో చేరిపోయారు.

## ఎర్రమలలో...

నరసింహారెడ్డికి నమ్మిన బంటు కిష్టప్ప మాత్రమే రెడ్డిగారి వెంట ఉన్నారు. వీరు మాత్రం బ్రిటీషు సైన్యం కంటపడలేదు. నరసింహారెడ్డి అడవిలో ఎక్కడున్నాడో ఎవరికీ తెలీదు. వెతకడానికి వెళ్లిన అయిదారుగురిలో నలుగురైదుగురు చస్తున్నారు. చావు కబురు చెప్పడానికన్నట్లు ఒకరిద్దరు మిగిలి వస్తున్నారు. ఈ విధంగా నెలలకు నెలలు గడిచిపోయాయి. అయినా నరసింహారెడ్డి శత్రుసైన్యానికి చిక్కలేదు. తన పూర్వీకులు ఎర్రమలలో జగన్నాథమనే ప్రదేశంలో కట్టించిన నరసింహ దేవాలయాన్ని తన స్థావరంగా చేసుకున్నాడు. అడవికి కొద్దిదూరంలో అల్వకొండ అనే ఊరుంది. నరసింహారెడ్డి నొసం కోటలో ఉన్నప్పుడు తనను ఆటపాటలతో సంతోషపెట్టిన జానకమ్మ ఇప్పుడు ఆ ఊరిలో ఉంటోంది. కిష్టప్ప రోజూ జానకమ్మ వద్దకెళ్లి అన్నం తీసుకొచ్చేవాడు.

పదిమంది సభ్యులున్న ఐదారు దళాలు మాత్రమే గాలింపుల్లో ఉన్నాయి. కిష్టప్ప ఒకరోజు అడవిదాటి అల్వకొండ వైపు పోవడాన్ని ఒక దళం గమనించింది. అందులో ఒకడు కిష్టప్పను అనుసరించాడు. కిష్టప్ప జానకమ్మ ఇంటికెళ్లి చీకటిపడ్డాక అన్నం తీసుకురావడాన్ని గమనించాడా దళ సభ్యుడు. వ్యూహం ప్రకారం కిష్టప్పను పట్టుకుని బ్రిటీషు సైన్యాధిపతి నార్టన్‌కు అప్పగించారు. లెక్కలేనంత ధనం ఆశచూపి కిష్టప్ప దగ్గర నుండి రహస్యం రాబట్టారు. అతన్ని వెంటనే ఆహారం ఇవ్వడానికి వెళ్లమన్నారు. కిష్టప్ప ఆ రోజు ఆలస్యంగా వెళ్లి మరుసటిరోజు కూడా అక్కడే ఉన్నాడు. కానీ తనను బ్రిటీషువారు పట్టుకుని రహస్యాన్ని అడిగిన విషయం నరసింహారెడ్డికి చెప్పలేదు. తర్వాత రోజు కిష్టప్ప ఏమీ ఎరుగనట్టే జానకమ్మ ఇంటికెళ్లాడు. అన్నం తీసుకుని బయలుదేరాడు. బ్రిటీషు సైనికులు ఆ అన్నంలో విషం కలిపారు.

విషం కలిపిన అన్నంను తీసుకెళ్లమని కిష్టప్పకు చెప్పి ఒక మైలు దూరంలో ఆగారు బ్రిటీష్ సైనికులు. తెల్లవారేసరికి కిష్టప్ప నరసింహారెడ్డి ఉన్న చోటుకు చేరుకున్నాడు. ఆలయం పక్కనే ఉన్న కొలనులో నరసింహారెడ్డి స్నానసంధ్యలు ముగించుకుని బయటికొచ్చిన తర్వాత కిష్టప్ప తెచ్చిన రాగిరొట్టెలు, అన్నం తిన్నాడు.

'ఆయాసంగా ఉందిరా' కిష్టప్ప అంటూ నిద్రలోకి వెళ్లిపోయాడు. వెంటనే కిష్టప్ప పరుగులు తీశాడు. మైలు దూరంలో ఉన్న ఆంగ్ల సైనికులకు ఈ విషయాన్ని తెలిపాడు. నిద్రలో ఉన్న నరసింహారెడ్డిని ఆంగ్ల సైనికులు బంధించి తీసుకెళ్లారు. 1846 అక్టోబర్ ఆరోతేదీ జరిగిన సంఘటన అది.

## అస్తమించిన వీరుడు..

1847 జనవరి 9వ తేదీన ఫౌజుదారీ అదాలత్ (మిలటరీ కోర్టు) నరసింహారెడ్డికి ఉరిశిక్ష విధించింది. ఆ తర్వాత 1847 ఫిబ్రవరి 22వ తేదీన కలెక్టర్ కాక్రేన్ పర్యవేక్షణలో కోవెలకుంట్ల సమీపంలోని జుర్రేటి నది ఒడ్డున రెండువేల మంది సమక్షంలో రెడ్డిగారిని ఉరి తీశారు. ఆంగ్లేయులను తరిమికొట్టేందుకు మళ్లీ ఈ లోకంలోకొస్తానంటూ ఆ వీరుని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిశాయి. అందరూ చూస్తుండగానే రెడ్డిగారి శవం తల నరికి కోవెలకుంట్ల ద్వారా దగ్గర తూకుమానుకు కట్టి "బ్రిటీషువారిని ఎదిరించిన ద్రోహులందరికీ ఇదే గతి పడుతుంది" అని ప్రజల్ని హెచ్చరించి వెళ్లిపోయారు బ్రిటీషువారు. వారు వెళ్లిపోయిన తర్వాత ప్రజలు తూకుమాను వద్దకెళ్లి బోరున విలపించారు. అక్కడి మట్టిని తమ ఒంటికి పూసుకుని వెళ్లిపోయారు. ఇప్పటికీ ఈ తూకుమాను కింది మట్టిని (మృత్తంధాన్ని) తమ ఫాలతలంపై ప్రజలు పూసుకుంటారు.

### గ్రామకక్షల కత

'కుంటి పుల్లారెడ్డి' కత గ్రామకక్షలకు చెందింది. ఈ కథ దాదాపుగా అర్ధశతాబ్ది నాటిది. కడప మండలంలోని పెద్దపసుపుల చిన్నపసుపులకు చెందినవారి గొడవ. పెద్దపసుపుల నందిరెడ్డి తమ్ముడు పుల్లారెడ్డి. వారి చేనుకు కావలి నరసింహుడు. చిన్నపసుపుల రెడ్డి శివారెడ్డి. శివారెడ్డి పెంపుడు దుప్పి ఒకసారి పుల్లారెడ్డి చేలో పడి మేస్తుంది. నరసింహుడు దాన్ని కొట్టి తోలుతాడు. అది చూసి శివారెడ్డి పంతానికి రెండోసారి ఆ దుప్పిని పుల్లారెడ్డి చేనులోకి తోలుతాడు. పుల్లారెడ్డి దాన్ని కాల్చి చంపేస్తాడు. అంతటితో ఆగకుండా చిన్నపసుపుల గ్రామానికి తన మందీ మార్బలంతో వెళ్లి శివారెడ్డి లేని సమయంలో అతని ఇల్లు కూలగొట్టి, తగులబెట్టి బీభత్సం చేసి వెళ్లిపోతాడు. అది తెలిసి శివారెడ్డి తన పటాలంతో పుల్లారెడ్డి మీదికి కొట్లాడను పోతాడు. ఉయ్యాలవాడ నారాయణరెడ్డి పెద్దమనిషిగా వుండి ఇరువర్గాల వారికి తాత్కాలికంగా రాజీ కుదుర్చుతాడు. ఇలా కొంతకాలం జరుగుతుంది. శివారెడ్డి తన అనుచరులతో ఉలవలపల్లె మిట్ట దగ్గర కాపుగాచి పుల్లారెడ్డిని చంపుతాడు. తమ్ముడిని చంపినారని శివారెడ్డి మీద నందిరెడ్డి పెట్టిన కేసు వీగిపోతుంది. గ్రామ కక్షలకు మూలం చిన్న విషయాలే అయినా పంతాలు, పట్టింపులే గొడవలకు కారణం అవుతాయి.

# చిత్తూరు జిల్లా పాలయగాళ్ల స్వాతంత్ర్య పోరాటం

**– డా॥ డి.సుబ్రమణ్యంరెడ్డి**

చిత్తూరు జిల్లాలో తొలి స్వాతంత్ర్య పోరాటం క్రీ.శ. 1801 నుంచి 1805 దాకా సాగింది. జమిందారీ, రైత్వారీ, గ్రామవార్, ఇనాందారీ సంస్కరణల ద్వారా వ్యావసాయక ఉత్పత్తి సంబంధాల్లో కొత్త పద్ధతులు ప్రవేశిస్తున్న కాలంలో, విదేశ సిద్ధాంతాల ద్వారా మొరటు రూపంలో పెట్టుబడిదారీ వ్యవస్థ దేశీయ స్వయం సమృద్ధి గ్రామీణ వ్యవస్థను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు జరుగుతున్న కాలంలో ఈ ఉద్యమం జరిగింది. అప్పటికే ఆంగ్ల పాలన మీద విసుగు చెంది దక్షిణ ప్రాంతీయులు చేపట్టిన ఉద్యమాల ప్రభావం కూడా ఈ ఉద్యమం మీద పడింది.

దీనికి చిత్తూరు పాలయగాళ్లని పేరుగాంచిన పదిమందిలో తొమ్మిదిమంది నాయకత్వం వహించారు. 1801 నాటికి పాకాలకు శేషహనాయుడు, మొగరాలకు పుల్లూరుకు కుమార రఘునాథనాయుడు, కల్లూరుకు రంగపతిరాజు, పులిచెర్లకు తిమ్మానాయుడు, ఎదురుకొండకు ముద్దురామప్ప నాయుడు, నర్గంతికి అనంతప్పనాయుడు, గుడిపాటికి శేషమనాయుడు, తుంబకు మల్లప్పనాయుడు, బంగారుపాళేనికి చంద్రశేఖరనాయుడు పాలెగయాళ్లుగా ఉన్నారు. వాళ్లలో గుడిపాటి పాలయగాడు తప్ప తక్కినవాళ్లు ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో పాలెగాళ్లకు మద్దతుగా అనేకమంది ఇనాందార్లు, గ్రామాధికార్లు, మిరాసిదార్లు, కులపెద్దలు, బ్రాహ్మణులు, రైతులు, వృత్తి పనులవాళ్లు పాల్గొన్నారు. ఆంగ్లేయులపై పాలయగాళ్లు పోరాటానికి సిద్ధపడ్డారు. అలాంటి బాధితుల్లో కెప్టెన్ సుథ్థల్ ఒకడు.

ఆ తర్వాత ఆంగ్లేయుల ఆధీనంలోని అంబూర్ వంటి సర్కారు జిల్లాలను (ప్రాంతాలను) ముట్టడించసాగారు. దీనితో ఆంగ్లేయులు సర్గంతి పాలయగాణ్ణి బంధించారు. కాని తమ వద్ద తగిన సైన్యం లేనందున (మరాఠా యుద్ధాల కారణంగా) అతన్ని విడుదల చేశారు. బంధించినందుకు ప్రతీకారంగా సర్గంతి పాళేగాడు అతని మిత్రులు కలిసి సర్కారు జిల్లాలను ధ్వంసం చేయసాగారు. కడకు చిత్తూరులోని సర్కారు ఖజానాలు కొల్లగొట్ట ప్రయత్నించారు. సైన్యం లేనందున ఆంగ్లేయులు సామరస్య విధానాన్ని అనుసరించాల్సి వచ్చింది. కాని సైనిక కవాతులతో పాలయగాళ్లను భయపెట్టడానికి ప్రయత్నించారు. దీనితో పాలయగాళ్లు మరింత రెచ్చిపోయి సర్కారు జిల్లాలను మరల ముట్టడించసాగారు. ఇంతలో లెఫ్టినెంట్ కల్నల్ డార్లీ పెద్ద సైన్యంతో చిత్తూరు పాళేల్లో ప్రవేశించాడు. ఇతడు కూడా తొలుత

శాంతియుత పరిష్కారానికి ప్రయత్నించాడు. కాని ఇతని ప్రతిపాదనలు పాలేగాళ్లను తృప్తిపరచలేదు. దీనితో డార్లీ పెనుమూరు వైపు సైన్యంతో పయనించి మొగరాలను ముట్టడించి ఆ పాళేన్ని స్వాధీనపరచుకొన్నాడు.

దీనితో భయపడి మొగరాల – పాకాల పాళేగాడయిన చెన్నప్పనాయుడు ఆంగ్లేయులకు లొంగిపోయాడు. వీటి పాలెగాళ్లు తొలుత నెల్లూరులో, ఆ తరువాత చెంగల్పట్టులో బందీగా ఉంచబడ్డారు. ఆ తరువాత సముద్రం ద్వారాగాని, భూమి మీద నుండి గాని పాళేగాళ్లకు సహాయం రాకుండా నిరోధించడానికి ఆంగ్లేయులు చర్య తీసుకున్నారు. నెల్లూరు, ఒంగోలు, చెంగల్పట్టు సముద్ర తీరాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆనాటి ఫ్రెంచి వారి భయం ఉన్నందున ఆంగ్లేయులు ఇట్టి చర్యలను తీసుకొన్నట్లు భావించవచ్చు. ఈ చర్యల తరువాత పాళేగాళ్లతో ఒక అంగీకారం కుదుర్చుకుని ఉద్యమాన్ని బలహీనపరచడానికి ఆంగ్లేయులు ప్రయత్నించారు. కాని పాలెగాళ్లు సమ్మతించలేదు. దీంతో ఆంగ్ల సైన్యం కల్లూరు, పులిచెర్ల కోటలను ముట్టడించింది. కాని చిత్తూరు పాలేగాళ్లు సమైక్యంగా పుల్లూరుకోట వద్ద ఆంగ్ల సైన్యాన్ని ఎదుర్కొన్నారు. డార్లి, ఆర్మ్‌స్ట్రాంగ్, బ్రూస్, మూర్‌లు వీరోచితంగా పోరాడినప్పటికీ కోటను స్వాధీనం చేసుకోలేకపోయారు. క్రమంగా కోట ఆంగ్లేయుల స్వాధీనమయింది గాని పాలేగాళ్లు దొరకలేదు. ఈ విజయం తరువాత పాలేగాళ్లు బంగారుపాళేన్ని రక్షించుకోడానికి ప్రయత్నించారు. కాని విఫలమయ్యారు. కాని మొగరాలలోని ఆంగ్ల సైన్యాన్ని ముట్టడించి ఆయుధాలు స్వాధీనపరచుకొన్నారు. గుడియాత్తంలోని కలెక్టర్ రక్షక భటులపై దాడి చేశారు. ఇంతలో ఆంగ్ల సైన్యం తుంబపాలేన్ని ముట్టడించింది.

దీనితో కోపోద్రిక్తులైన పాలయగాళ్లు, తిరుమలకు వెళ్లే ప్రయాణికులను ముట్టడించి, సుంకాలు వసూలు చేసి ప్రభుత్వానికి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుండి వచ్చే ఆదాయం లేకుండా చేశారు. ఈ స్థితిలో ఆంగ్లేయులు మరలా సామరస్య పరిష్కారానికై ప్రయత్నించారు గాని ఫలితం లేకపోయింది. దీనితో ఆంగ్ల సైన్యం బంగారుపాలెం కోటను ముట్టడించింది. ఆ తరువాత దీని పాళేగాడికి చెందిన ఎదురుకొండ పాళేన్ని ఆక్రమించారు. తరువాత సర్గంతిపాళేన్ని స్వాధీనపరచుకొన్నారు. ఆ తరువాత పాళేగాళ్లను బంధించడానికి ప్రయత్నించారు. ఈ దశలోనే నాగపేట వద్ద ఆంగ్ల సైనిక నాయకుడు కెప్టెన్ బ్రూస్‌కి కల్లూరు, పుల్లూరు, పులిచెర్ల పాలయగాళ్లకు మధ్య తీవ్రపోరాటం జరిగింది. కాని పాలెగాళ్లు ఓడి పారిపోయారు. మరోవైపు కెప్టెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ వరదరామి వద్దగల బంగారిపాళేగాడి అనుచరులను బంధించడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తరువాత ఆంగ్ల సైన్యం సందూరు కొండను (చందూరు కొండ) ముట్టడించింది.

బంగారి పాలెగాడి అనుచరులను పట్టుకోవడానికి ప్రయత్నించింది కానీ విఫలమయింది. ఆ తరువాత ఆంగ్ల సైన్యం పాలేగాళ్ల కోసం గాలించసాగింది. అదే తరుణంలో సర్కారు ప్రాంతాలైన పల్లికొండ, కీలేశ్వర్, కలకనూరు, కళత్తూరులను పాలేగాళ్లు ముట్టడించారు. ఇట్టి పరిస్థితుల్లో శాంతియుత మార్గాల ద్వారా పాలయగాళ్లు ఉద్యమాన్ని ఆపుదల చేయడానికి మద్రాసు ప్రభుత్వం హోర్డిన్, వెట్ స్వాటన్‌లతో కూడిన స్పెషల్ కమీషన్‌ను సెప్టెంబర్ 22, 1804లో నియమించింది. కానీ, దీని కృషి కూడా ఫలించలేదు. పాలేగాళ్లు గెరిల్లా పోరాటాన్ని ఆపలేదు. దీనితో ఆంగ్లేయులు కఠిన సైనిక చర్యల ద్వారా పాలేగాళ్ల ఉద్యమాన్ని అణచివేయాలని నిర్ణయించుకున్నారు. అందుకై సైనిక చట్టాన్ని ప్రకటించి, పెద్ద సైన్యాన్ని సమీకరించి దాని నాయకుడిగా మినీ వెన్నీని నియమించారు. ఇతడు కూడా తొలుత శాంతియుతంగా సమస్య పరిష్కారానికి ప్రయత్నించాడు గాని తమకు తృప్తికరంగా లేనందున పాలేగాళ్లు అంగీకరించలేదు. తిరుగుబాటు కొనసాగించడానికి నిర్ణయించుకొన్నారు. కాని సైనిక చట్టం ప్రకటించగానే సర్గంతి పాలేగాడు ఆంగ్లేయులకు లొంగిపోయాడు.

ఇతరులు లొంగలేదు. అందువల్లే అన్ని వైపుల నుండి పాలేగాళ్లను ముట్టడించి అరణ్యాల్లో బంధించాలని భావించి మైసూరు నుండి కూడా మహారాజు సైన్యాలను, ఆంగ్ల సైన్యాలను బాలాజీరావ్, కెప్టెన్ లిటిల్‌ల నాయకత్వాన రప్పించారు. మైసూరు సైన్యానికి, ఎదురుకొండ, బంగారి పాలయగాళ్లకు మధ్య మొగిలిఘాట్ వద్ద పెద్ద పోరాటం జరిగింది. దీనితో భయపడి బంగారి పాళయగాడు లొంగిపోయాడు. ఎదురుకొండ పాలయగాడు పారిపోయాడు. కాని గుడియాత్తం వద్ద చిత్రదుర్గం నుండి వస్తుండిన ఆంగ్ల సైన్యాన్ని ఇతడు ఎదుర్కొని ముప్పుతిప్పలు పెట్టాడు. కాని ఫలితం లేక తప్పించుకొన్నాడు. ఈలోపు మనవెన్నీ కూడా పెనుమూరు వైపు సైన్యంతో బాటు పయనించసాగాడు. ఇంతలో మొగరాల – పాకాల్లకు చెందిన పెనుమూరు వద్దగల గానిగబండ రక్షణకై పాలయుగాళ్లు పెనుమూరు వద్ద ఆయుధాలతో సిద్ధమౌతున్నారని తెలిసి సైన్యంతో పెనుమూరు చేరాడు. ఇక్కడ పెద్ద పోరాటం జరిగింది. అటు ఆంగ్లేయులకు, ఇటు పాలయగాళ్లకు పెద్ద నష్టం జరిగింది. ఇది జరిగాక పాలయగాళ్లు అరణ్యాల్లోకి వెళ్లి రక్షణ పొందారు. దీని తరువాత గానిగబండ, పులిచెర్ల కొండల ఆక్రమణకై ఆంగ్ల సైన్యం ప్రయత్నించింది. ఆ తరువాత మనీషెన్నే నాగభట్లకు వెళ్లాడు.

దీని దాపున చామకొండలో పుల్లూరు, మొగరాల, పాకాల పాళేగాళ్లు ఉన్నారని తలచి చామకొండలో ప్రవేశించగా, అచటి పాళేగాళ్లు ఇతనితో పోరాటం సాగించారు. కాని విజయం పొందలేకపోయారు. ఈ లోపున పోరాటంతో విసుగు చెందిన కల్లూరు, పులిచెర్ల, తుంబ పాలయగాళ్లు సీడెడ్ జిల్లాల కలెక్టర్ మన్రో వద్ద లొంగిపోయారు.

దీని తరువాత మొగరాల కొండ వద్ద ఆంగ్ల సైన్యానికి మొగరాల, పాకాల పాళేగాళ్లకు మధ్య పోరాటం జరిగింది. ఆంగ్లేయుల ధాటికి తట్టుకోలేక ఈ పాళేగాళ్లు తప్పించుకుని శెట్టిగుంట, తిరుపతి, కరకంబాడి, కాళహస్తి, కార్యేటినగర్ కొండల్లో పయనించి కడకు మద్రాస్ వద్ద లొంగిపోయారు. తరువాత పుల్లూరు పాళేగాడు కూడా వీరిని అనుసరించాడు. చివరికి ఎదురుకొండ పాళేగాడు ముద్దురామప్ప నాయుడు మాత్రం మిగిలాడు. ఇతడొక్కడే చివరి వరకు ఆంగ్లేయులతో పోరాటిన ఘనుడు, వీరుడు, ఆంగ్లేయులకు లొంగనివాడు. చార్లిల్ పాళేగడి సహాయంతో సాత్‌ఘర్ వద్ద మైసూరు సైన్యాన్ని కూడా దెబ్బతీశాడు. చివరకు మైసూరు సైన్యం చేతిలో కల్లెయ్యబండ అడవుల్లో బంధీయై ఉరిశిక్షకు గురయ్యాడు. దీనితో ఫిబ్రవరి 20, 1805 నాటికి పాలయగాళ్ల ఉద్యమం అణిచివేయబడింది.

కొందరు పాళేగాళ్ల పాలేలు శాశ్వతంగా ఆంగ్లేయుల స్వాధీనం చేయబడగా, మరికొందరి పాలేలు తాత్కాలికంగా ప్రభుత్వ స్వాధీనం కాబడి ఆ తరువాత జమిందార్ శాశ్వత శిస్తు నిర్ణయ విధానం ప్రకారం సక్రమంగా శిస్తు చెల్లించే నియమంపై వీటి పాలయగాళ్లు పునః అధికార స్థాపితులయ్యారు. వీరి అప్పులు పరిష్కరించబడ్డాయి. తిరుగుబాటు ముగిశాక పాలయగాళ్లు దూరప్రాంతాల్లో బందీలుగా ఉంచబడ్డారు. వారి జీవనభృతి చెల్లించబడింది. సివిల్ అధికారం ఏర్పరచబడింది. సైనిక చట్టం రద్దు చేయబడింది. పాలనాపరమైన మార్పులు చేయబడ్డాయి. కొందరు పాలయగాళ్లు, వారి అనుచరులు సైనిక చట్టం ప్రకారం ఉరితీయబడ్డారు. కొందరు దేశ బహిష్కరణ గావించబడ్డారు. మరికొందరు బందీలో ఉంచబడ్డాయి. ఉరితీయబడ్డ వారిలో ఎదురుకొండ పాలేగాడు ముద్దురామప్పనాయుడు ముఖ్యుడు. ఈ ప్రాంత ప్రజలను శాంతపరచడానికి కొన్ని సంస్కరణలు చేయబడ్డాయి. గ్రామ పెద్దలు, కట్టుబడి ప్యూన్లు, మిరాసిదార్ల భూములు చాలావరకు తిరిగి ఇచ్చివేయబడ్డాయి. నూతన భూసంస్కరణలు చేపట్టబడ్డాయి.

చిత్తూరు పాలయగాళ్లు ప్రారంభించిన స్వాతంత్ర్యోద్యమంలో చిత్తూరు పాళేల్లోని పలువర్గాల ప్రజలు కూడా పాల్గొన్నారు. ప్రాచీన కాలం నుండి స్వయం పోషకత్వంతో, సాంప్రదాయ పాలనా వ్యవస్థలో ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన మార్పుల కారణంగా గ్రామ పెద్దలు లేక మిరాసిదార్లు, కుల పెద్దలు, ఆయగాళ్లు లేక బారబల్లూటి అని పిలువబడుతుండిన పన్నెండు మంది గ్రామాధికారుల విషయంలో తీవ్రమైన మార్పులు తేవడం వలన ఒకవైపు వీరి ప్రాముఖ్యం, అధికారం, మరోవైపు గ్రామ వ్యవస్థ దెబ్బతినడం వలన ఈ వర్గాలన్నీ ఆంగ్లేయుల పట్ల తీవ్ర అసంతృప్తి చెందారు.

అంతేగాక వంశపారంపర్యంగా అనుభవంలో ఉండిన అమరం, చిల్లూరు ఇనాంలు, గ్రామ మాన్యాలు, కట్టుబడి ఇనాంలు నాటి కలెక్టర్ కాక్‌బర్న్‌చే రద్దు

చేయబడ్డాయి. ఈ చర్య రాజకీయ, సాంఘిక వర్గాలను అసంతృప్తి పరచింది. గ్రామాధికారుల తారపడి ఇనాంలు, దామాషే ఇనాంలు రద్దయ్యాయి. కరణాలు, మణేగార్లు పొందుపరచుండిన మేరలు, స్వసుంత్రం అనే సుంకాలు, ఇతర రుసుములు రద్దుకాబడ్డాయి. ఇతర గ్రామోద్యోగులకు చెందిన ఇట్టి హక్కులూ రద్దయ్యాయి. అలాగే గ్రామ కట్టుబడి, పాళెం కట్టుబడి, ప్యూన్ల ఇనాంలు రద్దయి సాధారణ శిస్తు వసూలు చేయబడింది. ఇక ఆలయాలు, మఠాల నిర్వహణకు ఇవ్వబడ్డ దేవాదాయ ఇనాంలు, బ్రాహ్మణులకు ఇవ్వబడ్డ అగ్రహారాలు, బ్రాహ్మణాదాయాలు శ్రోత్రియాలు, భటవృత్తి ఇనాంలు రద్దయి సాధారణ శిస్తు వసూళ్లు జరిగాయి. పలు వర్గాలకు చెందిన మిరాసీ భూములు (కనియాట్చి భూములు) స్వాధీనం చేసుకోబడ్డాయి. సాధారణ శిస్తు వసూళ్లు చేయబడ్డాయి.

సత్రాలు, పాఠశాలలు మొదలగు వాటి నిర్వహణకు ఇవ్వబడ్డ ధర్మాదాయ ఇనాంలు రద్దయ్యాయి. చెరువుల నిర్మాణం, చెరువుల మరమ్మతు, నీటి కాలువల త్రవ్వకం, తటాకాల నిర్వహణ, ఆనకట్టల నిర్మాణం మొదలగు నీటిపారుదల ఏర్పాట్లకు, రోడ్ల నిర్మాణాలకు ఇవ్వబడ్డ ఇనాంలు రద్దయ్యాయి. అసలు నీటిపారుదలకు ప్రాధాన్యతే లేకుండింది. రోడ్ల నిర్మాణం కేవలం సైనిక అవసరాలకే జరిగేది. ఈ చర్యలన్నీ రైత్వారీ విధానాన్ని విశాల ప్రాంతాలకు వ్యాప్తి చేసి అధిక ఆదాయాన్ని పొందుటకే తీసుకోబడినాయి. కానీ దీనివలన రైతు వర్గాలన్నీ తీవ్ర అసంతృప్తికి గురైనాయి. ఇంతేగాక వ్యాపార వాణిజ్య వర్గం కూడా అసంతృప్తి చెందింది. వీరిపై సయర్, మోతుర్ఫా పన్నులను అధికంగా విధించారు. సాలివారిపై పన్ను విధించబడింది. ఇండోగోపై పన్ను వేయబడింది. పలు వృత్తి పన్నులు విధించబడ్డాయి. ఇదంతా ఈ వర్గాలను అసంతృప్తిపరచింది. ఆధునికత ముసుగులో దోపిడీ సాధనంగా ఉపయోగపడిన రైత్వారీ విధానం ద్వారా రైతులు పీల్చిపిప్పి చేయబడ్డారు. ఈ విధానంలో మానవత్వానికి స్థానం లేదు. క్రమం తప్పకుండా శిస్తు వసూళ్లు చేయబడ్డాయి. శారీరక హింస పెట్టి కూడా డబ్బు వసూలు చేయబడేది. అంతేగాక డబ్బు రూపంలో మాత్రమే శిస్తు చెల్లింపు అంగీకరించబడేది. ఈ పద్ధతి రైతులకు నష్టాన్ని, కష్టాన్ని తెచ్చిపెట్టింది. దీనితో రైత్వారీ విధానానికి వ్యతిరేకంగా రైతులు తొలుత పన్నుల నిరాకరణోద్యమాన్ని చేపట్టారు. ఏరి, పహోటవారి, కాణిపాకం, పట్నం, కట్టమంచి, ముదిగొలం, కొత్త కోటే గ్రామీణులు గ్రామాలు వదిలి వలసవెళ్లి తమ నిరసనను ప్రదర్శించారు.

అట్టివారిలో నేటి చిత్తూరు జిల్లాకు కూడి ఉండిన ఉత్తర ఆర్కాట్ డివిజన్‌లోని ఏరి, పహోట్‌వేరి గ్రామాల రైతులు 34 మంది, చిత్తూరు ప్రాంతంలోని పట్నం గ్రామ రైతులు వెంకటరెడ్డి, నాచంరెడ్డి, చిననారాయణరెడ్డి, కట్టమంచి రైతు చిన్నప్పరెడ్డి,

ముదిగులం రైతు వెంకటరెడ్డి, కొత్తకోట రైతు వెంకటరెడ్డి ముఖ్యులు. ఇలా వెళ్లిన రైతుల్ని రప్పించి పొలాలు సాగు చేయించాలని, ప్రభుత్వానికి రెవెన్యూ నష్టం లేకుండా చేయాలని నాటి కలెక్టర్ కాక్‌బర్న్ ప్రయత్నించాడు. అందుకై పలు అభయాలిచ్చాడు. కాని వారు రాలేదు. దీంతో వీరిపై “చట్టవ్యతిరేకంగా పొలాల సాగు ఆపేశారని” నేరం మోపాడు. అంతేగాక వీరిని బంధించడానికి గంగారం, వెంకట్రామయ్య, షేక్‌సుత్తేడ్‌లను నియమించాడు. కాని ఈ చర్య రైతుల ఉద్యమానికి దారి తీసింది. వీరితో మిరాశిదార్లు, గ్రామ పెద్దలు, పాటిళ్లు, బ్రాహ్మణులు, రెడ్లు కూడా చేరి రైత్వారీ విధాన రద్దుకై ప్రయత్నించారు.

ఒక ఒత్తూరు, డెన్‌కెంకోట రైతులు సుమారు 1500 మంది తిరుగుబాటుకై ధర్మపురిలో సమావేశమయ్యారు. కానీ వారి ప్రయత్నాన్ని ఆంగ్లేయుల సైన్యం వమ్ము చేసింది. అంతేగాక రాయకోట దగ్గరి గ్రామాల్లో పెద్ద తిరుగుబాటు కూడా జరిగింది. ఇందులో సుమారు 800 నుండి 900 మంది రైతులు పాల్గొన్నారు. వీరిని అణచడానికై శంకరిదుర్గం నుండి 80 మంది సిపాయిలు, ఆఫీసర్లు, నెల్లూరు, ఈరోడ్ల నుండి రెండు కంపెనీల సైన్యం వచ్చింది. ఆంగ్లేయులు సైన్యంతో దీన్ని అణచాల్సి వచ్చింది. తింగెరికోట, పాల్‌కోడు, కృష్ణగిరి, వీరబిడ్డ దుర్గం రైతులు సుమారు 1500 మంది కూడా ఇందులో చేరారు.

బ్రాహ్మణులు, రెడ్లు, పాటిళ్లు ఇతరులు రైత్వారీ విధాన రద్దుకు కృషి చేశారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించిన పలు రైతు వర్గాలు సాంఘికంగా, ఆర్థికంగా తమ అండలో ఉండే పాయకార్లు, పోల్‌కుడి, పరయార్, పల్లివర్గా అండను కూడా పొందిన పాలయగాళ్లతో బాటు ఆంగ్ల వ్యతిరేక పోరాటాన్ని సాగించారు. పాళేగాళ్ల బంధువులు, మిత్రులు, గ్రామాధికార్ల బంధువులు, వ్యాపారులు కూడా ఇందులో పాల్గొన్నారు. తిరుగుబాటు కాలంలో ఆంగ్లేయులు గ్రామాలను తగులబెట్టడం, దోచుకోవడం, గ్రామీణులను బంధించడం వంటి చర్యలు చేపట్టడం కూడా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ప్రజలంతా సమైక్యంగా పోరాడేట్లు చేసింది. తమిళ ప్రాంత పాళేగాళ్లు, సీడెడ్ జిల్లాల (రాయలసీమ) పాళేగాళ్లు, కడకు కోలార్ వంటి ప్రాంతపు మైసూరు ప్రాంతపు పాళేగాళ్లు కూడా ఈ తిరుగుబాటుకు మద్దతునిచ్చారు.

ఈ ఉద్యమాన్ని పరిశీలిస్తే ప్రాంతీయ స్థాయిలో జరిగిన జాతీయోద్యమంగా అనిపిస్తుంది. కాని నాటికి జాతీయభావం భారతీయుల్లో ఏర్పడలేదు. స్వాతంత్ర్య లేక ప్రాంతీయ భావం మాత్రమే వుండేది. కాని ఆంగ్ల వ్యతిరేక భావం అన్ని ప్రాంతాల ప్రజల్లోనూ దేశమంతటా వ్యాపించి ఉండేది. స్వాతంత్ర్యం కోసం (స్వేచ్ఛ) చిత్తూరు పాలయగాళ్లు జరిపిన ఉద్యమం ఆ కాలపు ఇతర ఉద్యమాల వలె భావితరాలకు

స్ఫూర్తినిచ్చి జాతీయోద్యమాన్ని చేపట్టి ఆంగ్లేయుల నుండి మొత్తం దేశాన్నే విముక్తిపరచి స్వాతంత్ర్యాన్ని సంపాదించేటట్లు చేసిందనడంలో సందేహం లేదు.

చిత్తూరు పాళేల్లో సాగిన పోరాటాన్ని స్వాతంత్ర్య (స్వేచ్ఛ) పోరాటమనీ, రైతు ఉద్యమమనీ, గిరిజనోద్యమమని పిలవడంలో తప్పు లేదు. ఆంగ్లేయుల నుండి విముక్తికై జరిగిన ఉద్యమం గావున స్వాతంత్ర్య పోరాటమని, రైతు వర్గంగా పిలువదగిన రీతిలో తమ వ్యక్తిగత భూముల్లోని వ్యావసాయిక ఉత్పత్తి దశలన్నింట్లో పాళేగాళ్లు శ్రద్ధ చూపేవారు. గావున వీరిని రైతులుగాను, వీరుచేపట్టిన ఉద్యమాన్ని రైతు ఉద్యమంగాను పిలువచ్చు. అంతేగాక ఈ ఉద్యమంలో రైతువర్గంలో ఉన్నత వర్గంగా చెప్పదగిన పాళేగాళ్లతో బాటు ఇతర రైతు వర్గాలన్నీ పాల్గొనడం వలన కూడా దీన్ని రైతు ఉద్యమంగా చెప్పడంలో తప్పులేదు. ఈ ఉద్యమ నాయకులైన పాలెగాళ్లు ఆటవిక లేక గిరిజన జాతుల నాయకులుగా ఉండినవారు గావున దీన్ని గిరిజనుల తిరుగుబాటని పిలువవచ్చు.

కడపలోని కోయిలకుంట్లలో 1846లో జరిగిన పాళేగార్ నరసింహారెడ్డి తిరుగుబాటు కాలం, చిత్తూరు పాలేగాళ్ల తిరుగుబాటు కాలాల్లోనే (ఆంగ్ల వ్యతిరేక తిరుగుబాట్లలో) పలువురు రైతులు, ఇతర గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఐనప్పటికీ ఈ రెండు ఉద్యమాలూ విఫలమయ్యాయి. అందుకు పాళేగాళ్లకు తగిన ఆర్థిక శక్తి, సైనిక శక్తి, ఆధునిక ఆయుధాలు, దేశ ప్రజలు, నాయకుల మద్దతు, సహాయ సహకారాలు లేకుండుటే ప్రధాన కారణాలు. అంతేగాక గుడిపాటి, కాళహస్తి, కార్వేటినగర్, వెంకటగిరిల పాళేగాళ్లు ఆంగ్లేయులకు సహకరించారు. ఇవన్నీగాక నాటి ఆంగ్లేయులకు కావలసిన ఆర్థిక, సైనిక శక్తులు ఉండేవి. సమర్థులైన సైనికాధికారులు ఉండేవారు. వీటికి తోడు శైశవ దశలోని రాజ్యాన్ని పరిరక్షించుకొని, పటిష్టపరచుకొని వ్యాపారాభివృద్ధి, ఆర్థిక వనరుల సేకరణ చేసుకోవడానికి ఆంగ్లేయులు కంకణం కట్టుకొని వున్నారు. ఫ్రెంచి వారిని సైతం వెడలగొట్టి దేశాన్నంతా ఆక్రమించాలని, తమ అవసరాలకు దేశాన్ని రాజకీయంగా, ఆర్థికంగా వాడుకోవాలని నిర్ణయించుకొని ఉన్నారు. ఇట్టి వాతావరణంలో సాంప్రదాయ రీతి ఆయుధాలతో పోరాడే పాళేగాళ్ల స్వాతంత్ర్య పోరాటం విఫలం కాకతప్పదు. కాని వీరి తిరుగుబాటు, ఇతర తిరుగుబాట్ల వలె భావితరాలకు స్ఫూర్తినిచ్చి, వారిని సమైక్యపరచి, జాతీయోద్యమం ద్వారా ఆంగ్లేయులను తరిమికొట్టి దేశానికి విముక్తిని, స్వాతంత్ర్యాన్ని సాధించునట్లు చేసింది. అనగా తాత్కాలికంగా వీరి ఉద్యమం దెబ్బతిన్నా, దీర్ఘకాలిక ప్రయోజనాన్ని చేకూర్చిందని చెప్పవచ్చు.

●



# 'హింస' ధ్వని

పగలు... ప్రతీకారాలూ..; పంతాలూ... పట్టింపులూ...; హింస - ప్రతిహింసలూ... కంటే కూడా జీవితం ఇంకా విలువైందన్న చిన్న విషయం వీళ్లకెందుకు స్ఫురించదో?

ప్రాణాలు సైతం పణంగా పెట్టేది దేనికోసమో... కట్టుకున్న వాళ్లకైనా ఆనందం మిగల్చని వీళ్ల హింస ఎవరికోసం?

తమ వాళ్ల మీద, తమ రక్తసంబంధీకుల మీద, తమ బంధువుల మీద, తమ స్నేహితుల మీద తమ వూరి జనం మీద ఈ కత్తులు చేతపట్టి కుత్తుకలు తెంచే పైశాచిక పౌరుషాన్ని ఏమని పిలవాలి?

ఇంతదూరం వచ్చినాం. యింగ వాళ్లో మేమో తేల్చుకోవాల్సిందేనని మొండిపట్టు పట్టే ఆవేశానికి ఎలా కళ్లెం వేయగలం?

ఆయన్ను చంపినోళ్లను మీరు వెంటపడి నరికేంత వరకు నేను ఈ గాజులు పగలకొట్టుకోను ఈ బొట్టు చెదరనీను అని పంతం పట్టి ప్రతిజ్ఞ చేసే ఆడవారికి ఎలా నచ్చచెప్పగలం?

నేను బయటికి కదలాలంటే నా చుట్టూ ఎప్పుడూ పదిమంది మనుషులుండాలి. ఎవరు ఎప్పుడు ఏ వైపు నుంచి ఎలా దాడి చేస్తారో తెలియదు చంపడానికైనా, చావడానికైనా సిద్ధపడే వుండాలని వాదించే వారిది అజ్ఞానమో... అర్థంలేని ఆవేశమో...

వీళ్లు ఎలా చెప్తే దారికొస్తారు? జీవితం తల్లకిందులు కావడానికి ఎంతసేపు పడుతుంది? ఒక్క నిముషం చాలు! పొద్దుటి నుంచి సాయంత్రం లోపల ఎన్ని సంఘటనలైనా జరగొచ్చు. జరగరానివెన్నో జరిగిపోవచ్చు.

## నెత్తుటి సీమ

రాయలసీమకు ఫ్యాక్షనిజం కొత్త కాదు. తలలు తెగడం, వెంటాడి... వేటాడి... నరుక్కోవడం, బాంబులు రువ్వుకోవడం... ప్రాణాలు తీసుకోవడం సీమలో సాధారణ దృశ్యాలు. ఆ వార్తలు దినపత్రికలకు కూడా రెగ్యులర్ వార్తలు. మరి ఈ హత్యల విధ్వంసానికి అంతం లేదా? ఈ హింస గురించి ఎవరు ఆలోచించాలి? నిరంతరంగా, తరంతరంగా జరుగుతూ వస్తున్న ఫ్యాక్షన్ హత్యల నిర్మూలనకు ఎవరు కృషి చేయాలి? పచ్చని రాయలసీమ పల్లెలు కక్షల ఫ్యాక్షన్ చిచ్చుకు ఇలా ఎంతకాలం విలవిలలాడిపోవాలి? ఈ ఫ్యాక్షన్ అధ్యాయానికి ముగింపు ఎప్పుడు? ఇవన్నీ ప్రశ్నలు మాత్రమే. ఇప్పుడు వీటికి సమాధానాలు కావాలి! ప్రభుత్వం నిరాసక్తంగా, నిర్లక్ష్యంగా ఉన్న ప్రతీసారి ఫ్యాక్షన్ తన పంజాను విసురుతూనే ఉంది. అదును చూసి కోరలు చాపి బలి కోరుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఫ్యాక్షన్ పడగనీడలో బతుకులు బలి చేసుకుంటున్న విషాదానికి ముగింపు అన్వేషించాల్సి ఉంది.

## ఫ్యాక్షన్ ఎవరు కోరుకుంటున్నారు?

సీమపల్లెల్లోని ప్రజలు నిజానికి ఎంతో సహృదయులు. ఆత్మాభిమానం కలవారు. ఎంత అభిమానం చూపిస్తారో, తమకు కీడు తలపెడితే అంతటి ఆగ్రహమే చూపిస్తారు. సీమలో కఠినమైన జీవనపోరాటమే కనిపిస్తుంది. భాష, యాస, వ్యవహార సరళి, జీవనశైలి అంశాలు సీమను భిన్నంగా చూపిస్తాయి. సాగు నీరుకానీ, తాగునీరు కానీ లభ్యంకాని నేలపై జీవనం ఎంతటి కష్టతరమో ఇతర ప్రాంతల వారు ఊహించలేరు. పారిశ్రామిక అభివృద్ధి కానరాని ప్రాంతంలో నిరుద్యోగ సమస్య కూడా ప్రధాన అవరోధం. కానీ ఫ్యాక్షనిస్టులకు అదే వరం. బలహీనవర్గాలకు చెందిన యువతను తమ పంచన చేర్చుకొని తమ కార్యకలాపాలకు ఉపయోగించుకోవడంలో ఫ్యాక్షనిస్టులు సిద్ధహస్తులు. సీమలోని నిరుద్యోగాన్ని ఫ్యాక్షనిస్టులు తమ పెట్టుబడిగా వాడుకుంటున్నారు. రక్షణగా ఎప్పుడూ వెన్నంటి ఉండే యువత ఏదైనా విపత్తు జరిగినప్పుడు తమ ప్రాణాలను కోల్పోతున్నారు. కుటుంబాలకు ఆధారం లేకుండా చేస్తున్నారు. తమ వర్గాల ఆధిపత్య పోరు కోసం, రాజకీయ ఎదుగుదల కోసం ఫ్యాక్షన్ నాయకులు ఈ కక్షల చిచ్చును రగిలిస్తూనే ఉన్నారు.

*ఈ నెత్తుటి అడుగులు చూడండి...*

# పరిణామక్రమం

## కావలిగాళ్లు... పాలయగాళ్లు... పాలెగాళ్లు... ఫ్యాక్షనిస్టులు...

***పాలెగాళ్ల వ్యవస్థ దశలు***

1. క్రీ.శ. 1336కు పూర్వం వున్న పాలెగాళ్లు
2. విజయనగర సామ్రాజ్యం నాటి పాలెగాళ్లు
3. క్రీ.శ. 1509 నాటి పాలెగాళ్లు (శ్రీకృష్ణదేవరాయల పాలనా కాలం)
4. క్రీ.శ. 1564 నాటి పాలెగాళ్లు (రాక్షస తంగడి యుద్ధం తర్వాత)
5. క్రీ.శ. 1800 నాటి పాలెగాళ్లు (మన్రో రాక)
6. క్రీ.శ. 1975 నుంచి పొలిటికల్ ఫ్యాక్షనిజం మొదలు

విజయనగర రాజులు క్రీ.శ. 15వ శతాబ్దంలో గ్రామాలు, రహదార్లు, అడవి మార్గాల్లో ప్రజల ధన ప్రాణాలను రక్షించి శాంతిభద్రతలను పరిరక్షించడానికి 'కావలిగాళ్లు' అనే హోదాలో నిర్ణీత విస్తీర్ణంగల ప్రాంతాలకు నియమించారు. వాళ్ల జీవనం కోసం నామమాత్రపు శిస్తు చెల్లించే పద్ధతి మీద 'కావలి ఇనాం' భూములను ఇచ్చారు. తల్లికోట యుద్ధం తర్వాత ఈ కావలివాళ్లు స్వతంత్రం ప్రకటించుకొని పాలయగాళ్లు అయ్యారు. విజయనగర రాజులు విధించిన కావలి ఇనాంల మీద శిస్తు కట్టడం నిలిపేశారు. 18వ శతాబ్దం నాటి కర్ణాటక నవాబులకు కూడా పేష్కస్‌ను చెల్లించేవారు కాదు. 1801లో చిత్తూరు ఆంగ్లేయుల స్వాధీనమైంది. అప్పటి ఉత్తర ఆర్కాట్ డివిజన్‌కు తొలి కలెక్టర్ జార్జిస్ట్రాటన్, రెండవ కలెక్టర్ డేవిడ్ కాక్‌బర్న్‌లు వాళ్ల నుంచి పేష్కస్‌ను ముక్కుపిండి వసూలు చేశారు.

నవాబుల కాలంలో నవాబుకు అవసరమైన సమయాల్లో సైనిక సహాయం చేసి, పేష్కస్ చెల్లించే నియమంపై పాలయగాళ్లు తమ పాళేలను స్వేచ్ఛగా పాలించుకొనేవారు. రాజుల్లాగా దర్జాలు, దర్బారులు, రెవెన్యూ, పోలీసు, సైనిక వ్యవస్థలు కలిగి ఉండేవారు. ఈ పాలయగాళ్లు మీద 1801లో ఆంగ్లేయులు తమ పెత్తనాన్ని ఏర్పరుచుకున్నారు. పీడన దోపిడి ప్రారంభమయ్యాయి. పేష్కస్ భారం ఎక్కువ చేశారు. అది మొదట రెండింతలై, తర్వాత 53, ఆ తర్వాత 67 అయ్యింది. వాయిదా పద్ధతి రద్దయింది. శతాబ్దాలుగా అనుభవిస్తూ ఉండిన స్వాతంత్ర్యం రద్దయింది. కావలి అధికారం ప్రభుత్వపరమైంది. భూములు లాక్కోబడ్డాయి. పాలయగాళ్ల అనుచరులు

అనుభవిస్తూ ఉండిన ఇనాంలు, మిరాసీలు పోయాయి. పేష్కస్ చెల్లింపు బాకీ పడితే బంధించేవాళ్లు. బాకీకి బదులు పాలేలను లాక్కునేవాళ్లు. అంతేకాక 'ప్యూన్'లనే సైనికులను ఆంగ్లేయులు తొలగించమన్నారు.

పాళేల్లోని కోటల్ని కూల్చేయమన్నారు. ఆంగ్ల సైన్యములు నడవడానికి రోడ్లను నిర్మించమని పాలయగాళ్లను ఆజ్ఞాపించారు. ఆంగ్లాధికార్లు పాలయగాళ్లతో కరుకుగా ప్రవర్తించేవాళ్లు. వాళ్ల సైనికులను దొంగలని, దోపిడీదారులని భావించి హింసించేవారు, అవమానించేవారు. ఇవన్నీ పాలయగాళ్ల తిరుగుబాటుకు దారితీశాయి. ఇంకొకవైపు గ్రామవారీ రైత్వారీ లాంటి విధానాలు ప్రవేశపెట్టడం ద్వారా పన్ను భారం పెంచి హింసాత్మకంగా కఠినంగా పన్ను వసూళ్లు చెయ్యడం వల్ల రైతుల బాధలు పెరిగాయి. ఇలా పాలయగాళ్లు రైతులు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఏకమయ్యారు. ఇలాంటి కారణాల వలన కోపోద్రిక్తులైన పాలయగాళ్లు తొలుత తమ పేష్కస్ చెల్లింపును ఆపేశారు. అనగా పన్నుల నిరాకరణోద్యమాన్ని ప్రారంభించారు. దీనితో ఆంగ్లేయులు వీరిని బంధించడం, హింసించడం ప్రారంభించగా పాలయగాళ్లు పోరాటానికి సిద్ధమయ్యారు. తొలుత తమ ప్రాంతాల్లో పయనించే ఆంగ్లేయులను ముట్టడించి బాధించడం మొదలుపెట్టారు.

## దత్త మండలాలు

18వ శతాబ్దం మధ్యలో మైసూరు నవాబు హైదరాలీ గోల్కొండ నవాబును ఓడించాడు. కర్నూలు, బళ్ళారి మండలాలు కైవశమైనాయి. తర్వాత కడప కూడా హైదరాలీ వశమైంది. దీనితో మయానా నవాబుల పాలన ముగిసింది. కడప హైదరాలీ, టిప్పుసుల్తాన్‌తో చేసిన యుద్ధాలలో గోల్కొండ నవాబు ఆంగ్లేయులకు మద్దతిచ్చాడు. ఫలితంగా టిప్పుసుల్తాన్ పతనం తర్వాత 1792లో సంధి షరతుల ప్రకారం ఈ ప్రాంతాలు గోల్కొండ నవాబుల ఆధీనంలోకి వచ్చాయి. 1800లో ఆంగ్లేయుల సైన్య సహకార పద్ధతి కారణంగా ఆంగ్ల సైన్య పోషణకు కడప, కర్నూలు, బళ్లారి, అనంతపురం నాలుగు జిల్లాలను బ్రిటీష్ వారికి ధారాదత్తం చేశారు. అప్పటి నుంచి ఇవి దత్తమండలాలు (CEDED DISTRICTS)గా పిలుబడుతున్నాయి. వీటికి కడప జిల్లా కేంద్రంగా వుండేది. 1800 సంవత్సరంలో కడప కలెక్టర్‌గా వచ్చిన మన్రో మేజర్ జనరల్ జి.క్యాంప్‌బెల్ అనే సేనాని సహకారంతో పాలెగాళ్లను అణిచివేయడంలో విజయం సాధించాడు.

బ్రిటీష్ రికార్డుల ప్రకారం కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు నాలుగు జిల్లాల్లో 80 జాగీర్లుండేవి. ఒక్కో జాగీరును పర్యవేక్షిస్తూ ఒక్కో పాలెగాడు ఉండేవాడు.

గ్రామానికి గ్రామానికి మధ్య గ్రామకక్షలు వుండేవి. వీటిని పరిష్కరించడానికి, అరికట్టడానికి మన్రో ఎన్నో కఠినమైన చర్యలు తీసుకున్నాడు. ముఠా కక్షల్ని శాంతిభద్రతల సమస్యగా భావించిన బ్రిటిష్ పాలకులు వీటిని రెచ్చగొట్టే వారిని, ప్రోత్సహించే వారిని బహిరంగ ఉరిశిక్షల ద్వారా అరికట్టాలని నిర్ణయించుకున్నారు.

గ్రామాధిపత్యం కోసం, తమ మనుగడను, ఉనికిని కాపాడుకోవడం కోసమే కాకుండా చిన్న చిన్న సమస్యలకు కూడా ఫ్యాక్షన్ చిచ్చు రగులుకున్న సందర్భాలు అనేకం వున్నాయి. మొండితనం, మాట పట్టింపు వంటివి కూడా దీనిని మరింతగా రగిల్చాయి. గ్రామీణ పల్లెల్లో పాలెగాళ్లను కీర్తిస్తూ, స్మరిస్తూ ఎన్నో కథలు, పాటలు, సుద్దులు ప్రచారంలో వుండగా, చరిత్ర రికార్డులను తయారు చేసిన బ్రిటిష్ పాలకులు వీరిని దుర్మార్గులుగా, దొంగలుగా చూపించడం కన్పిస్తుంది. తమ భూభాగాలను ఆంగ్లేయుల రాజ్యంలో కలిపినప్పటికీ వారు తమకీయాల్సిన భరణాలు ఇవ్వకపోవడంతో వారిపైకి తిరుగుబాటు చేసినట్లు ఇప్పటికీ గ్రామీణులు మౌఖిక కథల ద్వారా వివరిస్తుంటారు. ఇవి రెండు రకాల విభిన్న వైఖరులు.

నాడు తమ వ్యక్తిగత ప్రతిష్ట కోసం, ప్రాబల్యం కోసం, తమ ప్రాంతంలో ఆధిపత్యం కోసం ముఠా నాయకులు ఫ్యాక్షన్ హింసను నమ్ముకునేవారు. రాయలసీమ ప్రాంతంలోని అన్ని ప్రాంతాల ముఠా నాయకులు ఇందుకోసం చేసుకునే వ్యూహాలు, అనుసరించే మార్గాలు ఒకేవిధంగా ఉన్నప్పటికీ హింసను సృష్టించడంలో నాలుగు జిల్లాల మధ్య స్పష్టమైన తేడాలు మనకు కన్పిస్తాయి.

కర్నూలు జిల్లాలో మొదటి నుంచి కూడా ఫ్యాక్షన్ హత్యలు ఒక వృత్తిగా జరుగుతున్నట్లు మనకు రికార్డులు చెప్తాయి. కడప జిల్లాలో ఫ్యాక్షన్ విధ్వంసంలోనూ, హింసాకాండలోనూ రాజకీయ నాయకుల ప్రమేయం ఎక్కువగా వుంటుంది. అనంతపురం జిల్లాలో ప్రత్యర్థుల్ని ఆర్థికంగా దెబ్బతీయడం కోసం నిరంతరం పరితపించే తీరు బయటపడుతుంది. చిత్తూరు జిల్లాలో చాపకింద నీరులా తమ వ్యూహాలను అమలుపరిచే వైఖరి విశదమౌతుంది.

ఈ విధంగా ఒక్కొక్క జిల్లాకు ఒక్కోవిధమైన తేడా కనిపించినప్పటికీ హింసలోనూ, విధ్వంసంలోనూ, రక్తపాతంలోనూ, ప్రత్యర్థిని తుదముట్టించే వరకు నిద్రపోని మొండివైఖరిలోనూ ఒకేవిధమైన సారూప్యత వుంటోంది. 1970 దశకంలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన చాలా హత్యలు రాజకీయాలకు పునాది వేశాయనే చెప్పాలి. 1980 వచ్చేనాటికి ఇవి మరింతగా బలపడ్డాయి. జరిగింది రాజకీయ హత్య లేక ఫ్యాక్షన్ హత్య అనే సందిగ్ధ వాతావరణం కల్గేది. తర్వాత వచ్చిన మార్పుల

కారణంగా రాజకీయ హత్యలకు ఫ్యాక్షన్ హత్యలకు మధ్య వుండే సన్నని తేడా కూడా మాసిపోయి రెండూ ఒకే ఛత్రం కిందికి చేరాయి. తమ రాజకీయ మనుగడ కోసం, ఉనికిని కాపాడుకోవడం కోసం, ఆధిపత్య పోరు కోసం, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం 'హింస'ను సృష్టించడం లేదా ప్రోత్సహించడం అనేది ముఠా నాయకులకు వృత్తిగా, ప్రవృత్తిగా మారింది. ముఠా నాయకులే 'ఫ్యాక్షన్ లీడర్లు'గా అవతారం ఎత్తారు.

ఈ దిశగానే రాజకీయ వ్యవస్థలో 'హింసా మార్గం' కూడా తమ భవిష్యత్‌కు నిచ్చెనమెట్లుగా ముఠా నాయకులు మార్చుకున్నారు. దీంతో రాజకీయాల నుంచి విడదీయరానిదిగా ఫ్యాక్షనిజం మార్పు చెందింది. గ్రామ కక్షల పునాదుల నుంచి ఫ్యాక్షనిజం ఎప్పటికప్పుడు తన రూపాన్ని మార్చుకుంటూ పొలిటికల్ ఫ్యాక్షనిజంగా అవతరించింది. అతిక్రూరంగా తమ ప్రత్యర్థులను అడ్డు తొలగించుకోవడం లేదా ఆర్థికంగా దెబ్బకొట్టడం అనేది తమకు ఆత్మగౌరవం, ఆధిపత్యం ఇనుమడింప జేస్తుందని ముఠా నాయకులు విశ్వసిస్తూ వచ్చారు.

గ్రామాల్లో తమ మాటే నెగ్గాలనే లక్ష్యంతో, గ్రామం తమ గుప్పిట్లో వుండాలనే కాంక్షతో చిన్నచిన్న తగాదాలను కూడా చిలికి చిలికి గాలివానలా మార్చి తమ ఉనికిని చాటి చెప్పుకోవడానికి ముఠా నాయకులు వేచి చూసేవారు. తమకు ఎదురు తిరిగిన, తమ మాట వినని, తమకు లొంగని వారిని ప్రత్యర్థులుగా చూసేవారు. ఎలాగైనా వారిని తమ వైపుకు తిప్పుకోవడంగానీ, కాదంటే కడతేర్చడం గానీ చేయడానికి కూడా వెనకడుగు వేయలేని స్థితికి ముఠానాయకులు చేరుకున్నారు. తమ మాట వినే వారినందర్నీ ఒక గుంపుగా మార్చుకొని ఆ గుంపుకు తాను నాయకుడిగా చలామణి అయ్యేవాడు. ఈ గుంపులు కుటుంబాల పరంగానూ, కులాలపరంగానూ, పల్లెల పరంగానూ, వ్యక్తి ఆధిపత్యం పరంగానూ ఏర్పడడం మొదలైంది. ఫలితంగా గుంపులూ వర్గాలయ్యాయి. గుంపు నాయకులే వర్గనాయకులుగా మారారు. వీరే ముఠాలను కలుపుకుంటూ ముఠా నాయకుల అవతారాలు ఎత్తారు.

రాజకీయాలను తమ అవసరాల కోసం, తమ ఆర్థిక ప్రగతి కోసం, ఉన్నతి కోసం వాడుకుంటూ ముఠానాయకుడిగా వుంటూ 'హింస'ను సృష్టిస్తూ, ప్రేరేపిస్తూ జీవనాన్ని గడపసాగారు. తమ రాజకీయ మనుగడ కోసం ప్రత్యర్థుల్ని భయపెట్టడం, వారి ఆస్తులను విధ్వంసాలకు గురి చేస్తూ హత్యకు హత్యే సమాధానంగా తమ రాజకీయ ప్రస్థానం కొనసాగించసాగారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల ఆధారంగా తను వర్గానికి నాయకుడిగా చలామణి అయ్యేవాడు. ఫ్యాక్షన్‌ను పెంచి

పోషించడమే లక్ష్యంగా మారింది. పల్లెలకూ పల్లెలకూ మధ్య వుండే గొడవలు, పంచాయతీలనుంచి పల్లెల్లోనే రెండు వర్గాలు ఏర్పడడం వరకు పరిస్థితులు మారిపోయాయి. ఒకే వరలో రెండు కత్తులు ఇమడవనే రీతిలో పచ్చని పల్లెలో ముఠాల చిచ్చు రగులుకునేది. ఫలితంగా పంటల్ని నాశనం చేసుకోవడం, ఆస్తుల్ని ధ్వంసం చేసుకోవడం, కాపు కాచి ప్రత్యర్థుల్ని హతమార్చడం వంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి.

దీంతో ఎకరాలు ఎకరాలు సాగు కావాల్సిన పొలాలన్నీ బీళ్లుగా మారాయి. ఉద్రిక్తత వాతావరణాన్ని భరించలేనివారు పల్లెల్ని విడిచి వేరే ప్రాంతాలకు వలసలు పోవడం మొదలుపెట్టారు. పల్లెల్లో బాగా డబ్బున్న, భూమి వున్నవారు, రాజకీయ పలుకుబడి వున్న వారిదే ఆధిపత్యంగా మారింది. వారికే రాజకీయ పదవులు సంక్రమించసాగాయి. గ్రామ కక్షలు క్రమక్రమంగా ప్రత్యర్థులను వెంబడిస్తూనే సమితులు, తాలూకా, జిల్లా స్థాయిలకు కూడా విస్తరిస్తూ వచ్చాయి. సామాజిక నేపథ్యం నుండి వచ్చిన గ్రామకక్షలు చివరికి బలమైన ఫ్యాక్షనిజంగా రూపుదాల్చాయి. కర్నూలు జిల్లాలో బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో ఫ్యాక్షన్ ప్రాంతాలను గుర్తించేందుకు వీలుగా జిల్లాను ఎర్రమల, నల్లమల ప్రాంతాలుగా విభజించారు. నల్లమల పరిధిలో కోయిలకుంట్ల, ఆళ్లగడ్డ, నంద్యాల, నందికొట్కూరు, పాణ్యం, ఆత్మకూరు ప్రాంతాల్ని వర్గీకరించారు.

ఎర్రమల ప్రాంతంలో డోన్, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాలుంచారు. ప్రత్యేకించి కోవెలకుంట్ల ప్రాంతాన్ని గ్రామ కక్షలకు నిలయంగా గుర్తించారు. నియోజకవర్గంలోని చాగరాజు వేముల, దొర్నిపాడు, ఇంజేడు, భీమునిపాడు, పెద్ద ఎమ్మనూరు, పేరు సోముల, తిమ్మనాయునిపేట, అంకిరెడ్డిపల్లెలు ఫ్యాక్షన్ గ్రామ జాబితాలో చేరాయి. గ్రామాధిపత్యం, భూములపై ఆధిపత్యం కోసం ఈ గ్రామాల మధ్య వర్గ పోరాటాలు, ముఠా కక్షలు ఏర్పడి అవి ఫ్యాక్షన్ హత్యలకు దారి తీసాయి. తర్వాత ఇదే విధమైన గ్రామ కక్షలు, ముఠా పోరాటాలు కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, కమలాపురం, పులివెందుల, రాయచోటి ప్రాంతాలకు విస్తరించింది. అనంతపురం జిల్లాలోని పెనుగొండ, ధర్మవరం, చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాంతాలకు 1970 నాటికి క్రమక్రమంగా ఫ్యాక్షన్ అల్లుకుంటూ పోయింది. తర్వాత మరింతగా బలపడింది.




## పల్లెల్లోకి 'పార్టీలు'...

వర్గాధిపత్య పోరులో పల్లెలు తమ వర్గం నాయకుడికి రాజకీయ హోదా కూడా కట్టబెట్టాలనే తలంపుతో ఉన్నప్పుడే పల్లెల్లోని వర్గాల్లోకి రాజకీయ పార్టీలు ప్రవేశం చేశాయి. తమ చుట్టుప్రక్క పల్లెలతో సయోధ్య లేకపోవడం, ప్రత్యర్థులు పెరగడం వంటి అంశాల కారణంగా పల్లెల్లోనూ రెండు వర్గాలైన వారికి ఈ రాజకీయ పార్టీల రాక ఒక పదునైన అవకాశంగా మారింది. ఒక వర్గం వారు ఒక పార్టీని ఆశ్రయిస్తే, మరో వర్గం వారు మరో రాజకీయ పార్టీలోకి చేరడం తప్పనిసరైంది. ఎవరి బలం ఎంత అనేది యింతవరకు వర్గంలోని బలం ఆధారంగా జరుగుతూ వచ్చేది. కానీ రాజకీయ పార్టీల ప్రవేశంతో అది ఓట్ల సంఖ్య ఆధారంగా జరగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఓట్లు వుండే వారి సంఖ్య కీలకంగా మారింది. దొంగ ఓట్లు కూడా తెరమీదకొచ్చాయి.

పల్లెల్లో తమ వర్గం వారికి, తమకు మద్దతిచ్చి తమ వెనుక నిలిచిన వారికి వర్గనాయకులు సహకారం అందించేవారు. ఏవైనా సమస్యలొచ్చిన సందర్భాల్లో తమ పక్షంలోని వారికి అనుకూలంగా పనిచేసేవారు. పల్లెల్లో ఏర్పడిన రెండవ వర్గంతో విభేదిస్తూ తగిన సమయంలో ప్రత్యర్థులను ఎలా దెబ్బతీయాలో వ్యూహాలు పన్నేవారు. ప్రత్యర్థుల నుంచి తమకు ప్రమాదం పొంచి వుందని భావించిన సందర్భాల్లో ఎప్పుడూ తమ వెనుక నలుగురైదుగురు వ్యక్తిగత నమ్మకస్తుల్ని వుంచుకునేవారు వర్గనాయకులు. ఏదైనా ఊహించని ముప్పు వాటిల్లుతోందని గ్రహించినప్పుడు ప్రత్యర్థుల్ని ఎదుర్కోవడానికి వీళ్లు అంగరక్షకులుగా ఉపయోగపడేవారు.

తమ వెనుక రక్షణగా తీసుకెళ్లడానికి చాలావరకు తమ బంధువులనో, రక్త సంబంధీకులనో, మిత్రులనో వాడుకునేవారు. గ్రామ కక్షలు ముదిరిన తర్వాత అంగరక్షకుల పాత్ర పెరిగింది. దీంతో బలిష్టంగా శరీరాకృతి కలిగిన, మొరటు వ్యక్తుల్ని ఇతర కులాల నుంచి కూడా నమ్మకస్తుడని అనిపించుకున్న వాళ్లనుంచి ఎంపిక చేసుకొని తమ వెంట రక్షణగా తిప్పుకునేవారు. ప్రత్యర్థులు అకస్మాత్తుగా ఎదురైతే ప్రతిఘటించడానికి వీలుగా వీరు చేతుల్లో 'కట్టెలు' పట్టుకొని తిరిగేవారు. ఇలా కట్టె పట్టడానికి తమ వర్గంలో అత్యంత నమ్మకమైన వారికే అవకాశం వుండేది. కట్టె

పట్టేవాళ్ల సంఖ్యను బట్టి ప్రత్యర్థులు తలపడడానికి కూడా భయపడే వారు. వర్గ నాయకుడు  ఎప్పుడు, ఎక్కడికి వెళ్లాలన్నా కట్టె పట్టే వాళ్లను వెంట తీసుకొని బయటకు బయలుదేరేవారు. ఇది తమకున్న ఆధిపత్యాన్ని కూడా పరోక్షంగా చెప్పడానికి, మేము మీతో తలపడడానికి సిద్ధంగానే వున్నామని హెచ్చరించడానికి కట్టెపట్టే వాళ్లని ఎక్కువ సంఖ్యలో వెంట తిప్పుకునేవాళ్లు. ఇదొక బల ప్రదర్శనగా కూడా మారింది. తర్వాత 'కట్టె పట్టేవాళ్ల'కు మరింత ఉత్తేజాన్ని యిస్తూ వారి చేతులకు వేటకొడవళ్లను ఇచ్చారు వర్గనాయకులు. కర్రల నుంచి వేటకొడవళ్లకు మారేసరికి హింస మరింతగా పెరగడం మొదలైంది. అంతకుముందు కర్రలతో గాయాల వరకు వెళ్లే హింస వేటకొడవళ్ల రాకతో తలలు తెగే వరకూ సాగింది.

నిజానికి తమ పగ, ప్రతీకారం కేవలం ముఠానాయకుడు, వర్గనాయకుడే కావడంతో మిగిలిన అంగరక్షకుల్ని వదిలేసి ప్రత్యర్థి ఎప్పుడు దొరుకుతాడో అప్పుడే తమ కసి తీర్చుకోవాలనే వైఖరి మొదట్లో వుండేది. తమకు ఎవరైతే ద్రోహం చేశాడో ఆ నాయకుడ్ని మాత్రమే లక్ష్యంగా చేసుకొని పోరు సాగేది. వాళ్ల బంధువులుగానీ, మిత్రులుగానీ, కట్టెపట్టే వాళ్లుగానీ ఎవరూ తమకు శత్రువులు కాదని భావిస్తూ వుండేవారు. ఈ ముఠాల పోరులో నైతిక నియమాలు కూడా చూసుకునేవారు. ఆడవాళ్ల జోలికిగానీ, పిల్లల జోలికిగానీ, పంట జోలికిగానీ, పశువుల జోలికిగానీ, ఆస్తుల జోలికిగానీ వెళ్లేవారు కాదు.

కానీ తర్వాత్తర్వాత వచ్చిన మార్పుల్లో ఈ విలువలు, నియమాలు అన్నీ లేకుండా పోయాయి. ప్రత్యర్థికి సంబంధించిన ప్రతీదీ తమకూ శత్రువు లాంటిదేననే వైఖరి ముదిరిపోయింది. దీంతో హత్యకు హత్య, వామికి వామి, ఇంటికి ఇల్లు, పంటకు పంట అనే మొరటువాదంతో విధ్వంసం సృష్టించడం మొదలుపెట్టారు. ఆవుల పొదుగులు కోసిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. 'హింస' స్థాయి హెచ్చింది. గడ్డివాములు తగులబెట్టడం, చీనీ చెట్లు నరకడం, పైర్లు నాశనం చేయడం, బోర్లు మూసేయడం వంటి చర్యలు జరిగాయి. 1980 నాటికి నాటుబాంబు కూడా ముఠానాయకుల చేతికి చిక్కాయి. దీంతో హింస, రక్తపాతం, విధ్వంసాల స్థాయికి చేరింది. నాటుబాంబుల తయారీ అనేది తమ పల్లెల్లోనే తోటల్లో, కల్లాల్లో విస్తృతంగా చేయించడం ప్రారంభించారు ముఠా నాయకులు. ఇలా నాటుబాంబుల ద్వారా ప్రత్యర్థి ప్రాణాలు తీయడం మరింత సులభంగా మారింది. ఈ బాంబులు తయారుచేస్తూ కాళ్లు, చేతులూ పోగొట్టుకొని వికలాంగులు కావడంతో పాటూ ప్రాణాలు కోల్పోయినవాళ్లు కూడా ఎంతోమంది వున్నారు. నాటుబాంబులతో విధ్వంసం ఎక్కువైంది. ప్రత్యర్థి ఆస్తులు ధ్వంసం చేయడానికి ఇవి ఎక్కువగా ఉపయోగపడ్డాయి.

తర్వాత ఓట్లు కోసం పల్లెల్లో రాజకీయ పార్టీలు ముఠా నాయకుల్ని మరింతగా ప్రోత్సహించడం ప్రారంభించాయి. పదవులు, అధికారాలు, డబ్బు, కాంట్రాక్టులు ఆశ చూపి "ఎక్కువ ఓట్లు, ఎక్కువ సీట్లు, అధికారం కైవశం" అనే సిద్ధాంతానికి ప్రాణం పోసి ముఠా నాయకులను పార్టీలు మరింతగా వాడుకోసాగాయి.

## పంచాయితీలు...

పల్లెల్లో తరచూ జరిగే తగాదాలు, గొడవలు వంటి వాటిని పరిష్కరించడం కోసం ముఠా నాయకులు పంచాయితీలు నిర్వహిస్తారు. తమకున్న ఆధిపత్య హోదా కారణంగా వారిచ్చే తీర్పును సమ్మతించడానికి ఇరువర్గాల వారు పూనుకుంటారు. వీటిల్లో ఎక్కువశాతం భూవివాదాలు, ఆస్తి వివాదాలు ఉంటాయి. కాబట్టి ముఠా నాయకులు తమ వర్గం పెంచుకోవడానికి పంచాయితీలను అనువుగా వాడుకుంటారు. తమకు ఎవరైతే అనుకూలంగా వుంటారో అలాంటి వారికే తమ సహకారాన్ని అందిస్తారు. ఒక్కో సందర్భంలో రెండు పక్షాల నుంచిగానీ, అనుకూలంగా తీర్పు వచ్చిన వ్యక్తుల నుంచిగానీ డబ్బులు వసూలు చేసుకోవడం జరుగుతుంది. లేదా తమ వాటాగా ప్రయోజనాన్ని ఆశిస్తూ వుంటారు. పంచాయితీ చేసినందుకు ప్రతిఫలంగా ఇమ్మంటారు. తమ మాట లెక్కచేయని వారిని హింసించడం, శిక్షలు వేయడం చేస్తుంటారు. ముఠా నాయకులకు పంచాయితీలు మరో అదనపు ఆదాయమార్గం.

## చట్టసభల్లోకి...

ముఠా నాయకులు ఎన్ని తప్పులు చేసినా పైనుండే రాజకీయ నాయకులు వారిని తమ ఆశీస్సులతో రక్షిస్తూ వుంటారు. తమ అండతో కప్పి పుచ్చుతుంటారు. ముఠా నాయకులకు కాంట్రాక్టులు ఇచ్చి ఆర్థికంగా ఎదిగేలా తమ సహాయమందిస్తారు. పల్లెల్లో పట్టు సాధించిన ముఠా నాయకుల అవసరం ఎన్నికల కాలంలో ఎక్కువగా ఉపయోగం అవుతుంది. తమ ఉనికికి ప్రధాన కారణంగా నిలిచే రాజకీయ నాయకుడ్ని గెలిపించడం కోసం పల్లెల్లోని ముఠా నాయకులు నిరంతరం శ్రమిస్తారు. ఓటర్లను బెదిరించో, భయపెట్టో ఏదో విధంగా ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం చేస్తారు. డబ్బులు పంచడం, నాటుసారా అందివ్వడం వంటి ప్రలోభాలకు ఓటర్లను గురిచేస్తారు. దొంగ ఓట్లు వేయించడం, బ్యాలెట్ పెట్టెల్లో నీళ్లు, ఇంకు వంటివి పోయడం, పోలింగ్ అధికారుల్ని భయపెట్టి రిగ్గింగ్ చేయించడం వంటి పనులకు ముఠా నాయకులు పాల్పడతారు. ఎలాగైనా సరే తమ రాజకీయ నాయకుడ్ని గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తారు.

ఒక్కోసారి ఎన్నికల సమయంలో తమ మాట వినని వారిని హతమార్చడం, కిడ్నాప్ చేయడం వంటి సంఘటనలు కూడా చోటు చేసుకుంటాయి. తర్వాత మరో అడుగు ముందుకేసి ఇలాంటి ముఠా నాయకులకే పార్టీలు టికెట్లు ఇవ్వడం ప్రారంభించాయి. వారే తమకున్న ఆధిపత్యంతో ఎలాగోలా ఎన్నికల్లో గెలుపొంది రాజకీయ నాయకులుగా మారుతున్నారు. చట్టసభల్లోకి అడుగు పెడుతున్నారు.

## మారుతున్న రూపాలు....

గ్రామ రాజకీయాల నుంచి దేశ రాజకీయాల వరకు ఎదిగే ముఠా నాయకులు కొత్త అవతారాలు ఎన్నో ఎత్తుతున్నారు. పారిశ్రామికవేత్తలుగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా, పెద్ద మంత్రులకు బంధువులుగా అనేక రూపాలుగా రూపాంతరం చెందుతున్నారు. కోట్ల రూపాయలు సంపాదించు కుంటున్నారు. అధికారులను శాసించే స్థాయికి, ప్రజాప్రతినిధులను కూడా తమ చుట్టూ తిప్పుకునే స్థాయికి ముఠా నాయకులు ఎదుగుతున్నారు. నిన్నా మొన్నటి దాకా ఎవరో ఒక రాజకీయ నాయకుడి చుట్టూ తిరుగుతూ వారి ద్వారా పనులు పొందిన ముఠా నేతలు ఆర్థికంగా స్థిరపడుతున్నారు.

పథకాల పనులు సంపాదించుకొని పర్సెంటేజీలు తీసుకొని ఎక్కువ పనులను సబ్ కాంట్రాక్ట్‌కు ఇవ్వడం ద్వారా ముఠా నేతలు లబ్ధి పొందుతున్నారు. పలువురు నేతలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొని కోట్లు విలువ చేసే పనులు దక్కించుకుంటున్నారు. ముఠా నేతల రాజకీయాలకు భయపడి పలు ప్రాంతాల్లో అధికారులు సీమ ప్రాంతానికి రావడానికి కూడా జంకుతున్న పరిస్థితి మనకు కన్పిస్తుంది. తమ వర్గం వారికి, తమ ప్రాంతానికి పనులు కావాలంటూ ముఠా నేతలు రాజకీయ ఒత్తిడి తెస్తుంటారు. దీంతో కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతుంటాయి.

## ఎన్నో కారణాలు..!

కరువుకు పెట్టింది పేరు రాయలసీమ. వ్యవసాయ పనులు కూడా పల్లెల్లో మూడు మాసాలకు మించి సాగవు. ఈ విధమైన ఆర్థిక వెనుకబాటుతనం కారణంగా సీమలో ప్రధానంగా నిరక్షరాస్యత, నిరుద్యోగం సమస్యలు కన్పిస్తాయి. నీటిపారుదల, పారిశ్రామికీకరణ రంగాల్లో సీమ ఎంతో వెనుకబడి వుంది. అందుకే ఈ ప్రాంతంలో వెనుకబాటుతనం పెరిగిపోయింది. దీనిని ఆసరాగా చేసుకొని ఫ్యాక్షన్ నేతలు తమ వ్యూహాలను రచించుకుంటున్నారు. నిరుద్యోగ యువతను తమతో పాటూ

తిప్పుకుంటున్నారు. చదివిన చదువుకు దొరకని ఉద్యోగం జీవనోపాధి కోసం హింసను నమ్ముకునేలా చేస్తోంది. బలహీన వర్గాల్లోని కుటుంబాలకు ఉపాధి అవకాశాలుగా ఫ్యాక్షన్ నాయకుల దగ్గర ఏదో ఒక పనిలో చేరిపోతున్నారు. ఫలితంగా ప్రత్యర్థులు విసిరే బాంబు దాడులకు ఇలాంటి అమాయకులు కూడా ఎంతోమంది బలవుతున్నారు.

ఫ్యాక్షన్ నేతలు బలవంతపు వసూళ్లకు పాల్పడడం, చట్టవిరుద్ధమైన మైనింగ్ కార్యకలాపాలు, పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు, భయపెట్టి టెండర్లు సంపాదించడం వంటి పనులన్నీ సులభంగా చేసుకుంటూ ఎదిగిపోతున్నారు. స్థానిక గొడవల్లోనూ, వివాదాల్లోనూ తీర్పులు ఇచ్చి పెద్దమొత్తంలో డబ్బులు గుంజుతున్నారు. పలు దేవాలయ భూములను, ప్రభుత్వ భూములను చట్టవిరుద్ధంగా ఆక్రమించుకొని తమ ఉనికిని ఫ్యాక్షనిస్టులు చాటుకొంటున్నారు.

మట్కాలాంటి గ్యాంబ్లింగ్, కల్తీ మద్యం అమ్మకాలు, కిరాయి హత్యలు, పేలుడు పదార్థాల అమ్మకాలు, ఆస్తుల, భూముల దురాక్రమణ వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఖనిజ నిక్షేపాలున్న భూములను తమ గుప్పిట్లో వుంచుకొని విలువైన సంపదను కొల్లగొడుతున్నారు. ప్రజలను భయపెట్టే సామర్థ్యం, నేరాలు, ఘోరాలకు పాల్పడే యంత్రాంగం, పోలింగ్ బూత్‌ల ఆక్రమణ, రిగ్గింగ్, ఓటర్లను బెదిరించడం వంటి పనులు చేస్తూ తమ రాజకీయ ఆధిపత్యాన్ని ముఠా నాయకులు కాపాడుకుంటున్నారు. అసాంఘిక, చట్టవిరుద్ధమైన కార్యక్రమాల ద్వారా సంపాదించిన సొమ్మును తిరిగీ ఎన్నికల్లో ఖర్చు చేసి పదవులు పొందుతున్నారు.

## నేటి ఫ్యాక్షనిజం

నేటి రాజకీయాల్లో వర్గపోరు రగులుకుంటోంది. ఎవరి వర్గాన్ని వారు ప్రోత్సహించుకుంటారు. నచ్చనివారిని తమ నుంచి దూరంగా పంపడానికి పొగబెడతారు. ఆ దిశగా పావులు కదుపుతారు. వ్యతిరేక వర్గాలను రెచ్చగొడతారు. ఆరోపణలు చేయిస్తారు. ఎవరిని ఎప్పుడు తప్పిస్తే తమకు మార్గం సుగమమవుతుందని వ్యూహాలు చేస్తారు. చాపకింద నీరులా కుట్రలు పన్నుతారు. వెన్నుపోట్లు పొడుస్తారు. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు కల్పిస్తారు. ఇరువర్గాల మధ్య దాడులు, ప్రతిదాడులు జరుగుతాయి. ఒక ప్రత్యర్థిని దెబ్బతీయడానికి మరొకరితో స్నేహం చేస్తారు. రాజీ పడతారు, వర్గాలను ఉసిగొల్పుతారు. వర్గాల మధ్య, పార్టీల మధ్య, రాజకీయ వ్యక్తుల మధ్య నిరంతరం ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తూనే వుంటుంది.

# మొదటి భాగం



పాలెగాళ్ల సంస్కృతి గురించి మనం చర్చిస్తూ వస్తున్నప్పుడు వీరి పరిణామ క్రమంలో వైరుధ్యం కన్పిస్తుంది. క్రీ.శ. 1336లో విజయనగర రాజ్యస్థాపనకు ముందు వుండే పాలెగాళ్ల వ్యవహార తీరులోనూ తర్వాత వచ్చిన రాజకీయ మార్పుల కారణంగా ఏర్పడిన పరిస్థితుల్లోనూ వీరి వ్యవహార శైలి విభిన్నంగా కన్పిస్తుంది. క్రీ.శ. 1506లో వీరనరసింహరాయలు సింహాసనాన్ని అధిష్టించే సమయంలో రాజ్యంలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతుంది. దుర్గపాలకులు, సామంతులు, పాలెగాళ్లు అందరూ ఎదురు తిరుగుతారు. ఇదే పరిస్థితి క్రీ.శ. 1509లో శ్రీకృష్ణదేవరాయలు పాలనలోకి వచ్చేటప్పుడు కూడా తమ వ్యతిరేకతను చాటి చెప్తారు. ఒక దశలో వారిని కట్టడి చేయడం కూడా వీలుకాని పరిస్థితి ఏర్పడుతుంది.

పన్నులు చెల్లించమని ఎదురు తిరిగితే సైన్యాన్ని అందించమని కోరడం మనకు కన్పిస్తుంది. చక్రవర్తి పాలనలో వుండడంకంటే స్వతంత్రంగా వుండి తమ రాజ్యాలను తామే పరిపాలించుకోవాలనే ఉద్దేశ్యం పాలెగాళ్ల వైఖరిలో మొదటి నుంచి మనం గమనించవచ్చు. సైన్య సహాయంతో పాలెగాళ్లను ఎప్పటికప్పుడు అణిచివేస్తూ రావడం కూడా జరుగుతోంది.

విజయనగర రాజుల పాలనకు ముందున్న పాలెగాళ్లలో తమ రాజ్యాల్లో ప్రజలను ఎలా పరిపాలించాలి, వారి అభిమానం ఎలా పొందాలి అనే అంశాలు వుంటే, విజయనగర రాజుల కాలంలోని పాలెగాళ్లు కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు చెల్లించే పన్నులు తామే స్వీకరిస్తూ మొండితనం ప్రదర్శిస్తారు. సైన్యంతో పోరాటం చేయడానికి కూడా వెనుకాడని వ్యక్తిత్వం వారిలో కనపడుతుంది.

క్రీ.శ. 1564లో రాక్షస తంగడి యుద్ధంలో ఓటమి తర్వాత తిరుమల రాయలు పెనుగొండకు పారిపోయిన సందర్భంలో పాలెగాళ్ల తారాస్థాయి విలయ విధ్వంసక అరాచకాలు చేసినట్లు చరిత్ర చెప్తుంది. అంతవరకు ఎవరైతే తమను ఆదుకొని పైకి తెచ్చారో అలాంటి రాజుల పైకే వీళ్లు పోరాటానికి దిగిన నేపథ్యం. పాలెగాళ్లను కట్టడి చేసే సామర్థ్యం తనకు లేకపోవడంతో చివరాఖరికి తిరుమల రాయలువారితో రాజీ పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

శ్రీరంగరాయలు, హండే నాయకుల యుద్ధ సమయంలో సీమలో పాలెగాళ్లు దోపిడీలకు పాల్పడే స్థితికి చేరుకున్నారు. రెండవ వెంకటపతి రాయల కాలంలో కొంతవరకు పరిస్థితి కుదుటపడే వాతావరణం ఏర్పడుతుంది. పాలెగాళ్ల ఆగడాలను అరికట్టడానికి వ్యూహాలు పన్నుతాడు. బ్రిటిష్ పాలకుల కాలం నాటికి అక్రమ సంబంధాలు, భూ వివాదాలు, ఆస్తి వివాదాలతో పాలెగాళ్లు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్న దశగా చెప్పుకోవచ్చు. చివరికి దారి కాచి దోపిడీలు కూడా చేసేవారు. దివిటీ దొంగలుగా కూడా పాలెగాళ్లు కన్పిస్తారు. తర్వాత మన్రో వీరిని అణచివేస్తాడు. ఇదంతా ఒక దశగా చెప్పుకోవచ్చు.

## రెండవ భాగం

నాటి పాలెగాళ్ల రాజ్యలో కన్పించిన ఫ్యాక్షనిజానికి నేటి పొలిటికల్ ఫ్యాక్షనిజానికి సంబంధం లేదు. రాజకీయాలతో ముడిపడిన ముఠాకక్షలకు, వర్గపోరాటాలకు 'సీమలోని పాలెగాళ్ల సంస్కృతి'కి నిజానికి ముడిపెట్టడం దారుణంగా కన్పిస్తుంది. ఇలాంటి పొలిటికల్ ఫ్యాక్షనిజం ఇవాళ దేశంలోనూ, రాష్ట్రంలోనూ అన్నిచోట్ల ఏదో ఒక రూపంలో కన్పిస్తున్నదే. దీనికి 'సీమ'కు మాత్రమే 'ఫ్యాక్షన్' అని ప్రత్యేక ముద్ర వేయాల్సిన అవసరం ఏముంది? రాజకీయాలతో, పార్టీలతో ముడిపడిన హింస అన్ని ప్రాంతాల్లోనూ నేడు జరుగుతూనే వుంది. కానీ సీమలో ఏ అలజడి జరిగినా వెంటనే 'ఫ్యాక్షన్ జాడ్యం' అనే అంశం వెలుగులోకి వస్తుంది. నాటి పాలెగాళ్ల సంస్కృతి అంతరించి ఎంతోకాలం అవుతున్నా ఇంకా ఆ ఛాయలతోనే సీమను చూడడం అమానుషం. గ్రామకక్షలు, ముఠా తగాదాలు, రాజకీయ హత్యలు అనేవి అన్నిచోట్లా జరుగుతూనే ఉన్నాయి. సీమను మాత్రమే భూతద్దంలో చూడాల్సిన అవసరం ఏముంది? సినిమాలు పనిగట్టుకొని వ్యంగ్యంగా సీమ సంస్కృతిని అపఖ్యాతిపాలు చేస్తున్న విధానం కూడా బాధాకరం.

1975-80 ప్రాంతంలోనే దాదాపుగా సీమకక్షల చరిత్ర ముగుస్తుంది. మన్రో ఉక్కుపాదంతో అణిచివేయడంతోనే పాలెగాళ్ల చరిత్ర కూడా మనకు కన్పించదు. 1980 నుంచి కొత్తగా అన్ని ప్రాంతాల్లో మొదలైన రాజకీయ చైతన్యమే ఇక్కడా ప్రారంభమైంది. మిగతా చోట్ల గూండాయిజం, రౌడీయిజాలు కూడా పుట్టుకొచ్చాయి. వీటి గురించి ఎవరూ మాట్లాడరు. వీటిని హింసగా కూడా పరిగణించరు. కానీ సీమలో ఏ హింసాత్మక సంఘటన జరిగినా, హత్యలు చోటు చేసుకున్నా 'ఫ్యాక్షన్' అనే బలమైన స్లిప్‌ను సీమ ముఖచిత్రానికి అతికించేస్తారు. ఫ్యాక్షన్‌కు పర్యాయపదంగా సీమను 'భూతం'లా చూపిస్తారు.



# రాయలసీమ రావణకాష్ఠం

నాటుబాంబులు, వేటకొడవళ్లు సీమ ఆనవాళ్లు. పాలెగాళ్లనాళ్ల నుండీ రెండొందలేళ్లుగా కొనసాగుతూ వస్తున్న కక్షల ఫ్యాక్షన్ రాక్షసానికి ఇంకా ఆరని నెత్తుటి తడే సాక్ష్యం. తరతరాలుగా రగిలే పగలకు తెగిపడ్డ తలలెన్నో!

రాయలసీమకు భౌగోళిక స్వరూపంలోనూ వైవిధ్యం ఉంది. రాష్ట్రంలో అతితక్కువ వర్షపాతం కలిగిన ప్రాంతంగానే కాక, అతి తక్కువ భూగర్భ జలాలు కలిగిన ప్రాంతం కూడా ఇదే కావడం గమనించదగిన అంశం. వర్షాలు లేని కారణంగా బీడుపడిన భూములు. నీళ్లు లేక విలవిలలాడే కరవుతో దుఃఖించే గ్రామాలు సీమలో ప్రధానంగా కన్పిస్తాయి. జీవన వైవిధ్యంలోనూ, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా భిన్న పార్శ్వాలు గోచరిస్తాయి.

సీమలో వేళ్లూనుకుపోయిన ఆటవిక హింసా సంస్కృతికి 'ఫ్యాక్షన్' వర్గకక్షలు మాయని మచ్చగా నిలుస్తాయి. క్రీస్తు శకం 17-18 శతాబ్దాల కాలం నాటి నుంచి వస్తున్న పాలెగాళ్ల ఆధిపత్యపు పునాదులపైన ఈ ఫ్యాక్షన్ గోడలు నిర్మితమైనట్లు తెలుస్తుంది. ఆస్తులను ధ్వంసం చేయడం, గడ్డివాములను తగులబెట్టడం, చీనీచెట్లు నరకడం, పచ్చని పైర్లను నాశనం చేయడం, ప్రత్యర్థి వర్గాన్ని తుదముట్టించడం, బాంబుదాడులకు పాల్పడడం వంటి అకృత్యాలన్నీ ఈ 'ఫ్యాక్షన్' విషవలయంలో మనకు ప్రస్ఫుటమౌతాయి.

1800లో నిజాం ప్రభువులు దత్తమండలం (సీడెడ్ జిల్లాలు)గా రాయలసీమ ప్రాంతాన్ని బ్రిటిష్ వారికి అప్పగించారు. బ్రిటిష్ ప్రభుత్వం హయాంలోనే ఫ్యాక్షన్ ప్రాంతాలను గుర్తించేందుకు, కర్నూలు జిల్లాలను ఎర్రమల, నల్లమలలుగా విభజించారు. ఫ్యాక్షనిస్టులుగా మారిన అప్పటి పాలెగాళ్లను అణచివేసే బాధ్యతను దత్తమండలాల చీఫ్ కలెక్టర్ సర్ థామస్ మన్రోకు అప్పగించింది ప్రభుత్వం. చరిత్ర రికార్డులను రచించడంలో కీలక భూమిక పోషించిన బ్రిటిష్ పాలకులు, పాలెగాళ్లను దుర్మార్గులుగా చిత్రించి, రికార్డుల కెక్కించారు. కానీ మరో కోణంలో గ్రామీణ ప్రాంతాల్లోని జానపద గీతాల్లోనూ, సుద్దుల పాటల్లోనూ, పాలెగాళ్లను సాహసవీరులుగా, బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసిన యోధులుగా కీర్తించడం ఇక్కడ మనకు కన్పిస్తుంది.

రాయల కాలంలో వూరికో పాలెగాడు వుండేవాడు. ఊళ్లో వాడు చెప్పిందే

వేదం. చేసిందే శాసనంగా చలామణి అయ్యేది. పాలెగాళ్ల ఆధిపత్యాన్ని సవాల్ చేసిన వారి తలలు కోటగుమ్మాలకు వేలాడగట్టేవారు. భయాన్ని సృష్టించి అధికారాన్ని అనుభవించడం పాలెగాళ్ల వ్యూహంగా కన్పిస్తుంది. పన్నులు వసూలు చేయడం, యుద్ధ సమయాల్లో సైన్యాన్ని అందివ్వడం వంటి పనులు పాలెగాళ్లు చేసేవారు. మట్లి (కడప జిల్లా) పాలెగాళ్లతో విజయనగర రాజులు వివాహ సంబంధాలు చేసుకున్నట్లు చరిత్ర చెబుతోంది. రాజులు పోయిన తరువాత, రాజ్యాలు అంతరించిన తర్వాత, గ్రామాల్లో అధికారాలు అనుభవిస్తూ, వేలకొలది ఎకరాల భూమిని తమ గుప్పిట్లో వుంచుకొని, గ్రామ పెద్దలుగా అవతరించిన వర్గమే తర్వాత తర్వాత బలహీనమైన కులాల వారిని తమ పంచన చేర్చుకొని, తమ అవసరాలకు వారిని ఉపయోగించుకుంటూ, బలమైన వర్గంగా నిర్మితమైనారు. ఇప్పటికి ఇలా వూళ్లలో ముఠాలుగా, వర్గాలుగా ఏర్పడినవారిదే ఆధిపత్యంగా నిలుస్తోంది. ఇలాంటి ఆధిపత్యపు పోరులో బలహీనులే బలిపశువులుగా మారుతున్నారు.

సీమ ప్రధానంగా కరవు ప్రాంతం. ఆర్థిక వెనుకబాటుతనం వల్లనే నిరక్షరాస్యత, నిరుద్యోగం ఎక్కువ. నిరుద్యోగ యువతను ఫ్యాక్షనిస్టులు తమ అవసరాలకు వాడుకుంటున్నారు. ఫ్యాక్షనిస్టుల ఆశీస్సులతో హోదాగా హీరోయిజంతో జీవనశైలికి ఆకర్షితులవుతున్న యువత, ఊహించని రీతిలో ప్రత్యర్థి వర్గాలు విసిరే బాంబుదాడులకు తమ నిండు జీవితాలనే కోల్పోతున్నారు. ఈ విధంగా సీమలో జరిగే, జరుగుతున్న ఫ్యాక్షన్ విధ్వంస సంఘటనలు చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. కానీ ఉదాహరణకు కొన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. బలవంతపు వసూళ్లు, చట్టవిరుద్ధమైన మైనింగ్ కార్యకలాపాలు, చట్ట వ్యతిరేకంగా జరిగే ఇతర పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు, ప్రత్యర్థులకు భయానికి గురి చేసి టెండర్లు సంపాదించడం వంటి వివిధ రకాల పనుల వలన, ఫ్యాక్షనిస్టులు పటిష్ఠంగా బలపడుతున్నారనేది అక్షరసత్యం.

జీవితం క్రమక్రమంగా సంక్షోభాలకు గురై బండబారి మొరటుదేలినప్పుడు, వాళ్లు ఉపయోగించే భాషలో, యాసలో, జీవనశైలిలో, వ్యవహార శైలిలో ఆ మొరటుదనం ఎలా వ్యాపిస్తూ వుంటుందో అదేవిధంగా, అంతే విధ్వంసక స్థాయిలో ఫ్యాక్షనిజం వికృత కార్యకలాపాలు కూడా స్వరూపాన్ని పొందుతూ వుంటాయి. నిండుగా పెరిగిన చీనీతోటల్ని నిర్దాక్షిణ్యంగా నరికే సంస్కృతి ఇక్కడ కనపడుతుంది. ప్రత్యర్థి వర్గానికి చెందిన ఆవుల పొదుగులు కోసి తమ కసిని, పగను చల్లార్చుకున్న వైనాలు కూడా ఈ ఫ్యాక్షనిజంలో ఉన్నాయి. మరింత లోతుగా ఈ ఫ్యాక్షన్ సమస్యను అధ్యయనం

చేస్తే, అక్షరాస్యత, నీటిపారుదల, పారిశ్రామికీకరణలాంటి అభివృద్ధి కార్యక్రమాలు విఫలం కావడం కూడా, ఈ ఫ్యాక్షన్ పీడిత ప్రాంతంలో వెనుకబాటుతనాన్ని, నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నాయి. పిలవకపోయినా ఎప్పుడూ స్థిరంగా వచ్చి పలకరించే కరవు ప్రాంతం కాబట్టి, భూమి లేని పేదవారు, ఉపాధి లేని బలహీనులు, తమ బతుకు తెరువు కోసం, జీవనోపాధికి ఫ్యాక్షనిస్టులనే నమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా, ఫ్యాక్షనిస్టులు, తమ అక్రమ కార్యకలాపాల కోసం నిరుద్యోగ యువతను వాడుకుంటూ, తమ పనుల్ని చాకచక్యంగా చేసుకుంటున్నారు. సీమ ప్రాంతంలో ఫ్యాక్షనిస్టుల వ్యవహారంలో పోలీసుల పాత్ర కూడా తగినవిధంగా విశ్వసనీయత పొందక, విమర్శలను ఎదుర్కొంటూ వుంది.

## కరువు సీమలో కక్షల పోరు!

"లారీతో సుమోను ఢీకొట్టించి బాంబులు విసిరారు. వేటకొడవళ్లతో నరికారు. దాడిలో గాయపడి తప్పించుకొని పారిపోయేందుకు నేను ప్రయత్నించాను. ప్రత్యర్థులు వెంటపడి నన్ను వేటకొడవళ్లూ, కత్తులతో పొడిచారు" – అని 2008 మే 17వ తేదీ కర్నూలు జిల్లా కోడుమూరు మండల కేంద్రానికి దగ్గర్లో జరిగిన ఫ్యాక్షనిస్టు కప్పట్రాళ్ల వెంకటప్పనాయుడి హత్యలో గన్‌మెన్ కురువరాముడు ఇచ్చిన మరణవాంగ్మూలం. హత్యోదంతంలో 18మంది ప్రత్యర్థులపై కప్పట్రాళ్ల తమ్ముని కుమారుడు పరమప్పనాయుడు తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన సీమను ఉలిక్కిపడేలా చేసింది. సీమలో ఫ్యాక్షన్ చిచ్చు రగులుతూనే ఉందనే అంశాన్ని ఇది మరోసారి చాటిచెప్పింది. ఇవేకాదు మే 16వ తేదీ కూడా సీమలో రెండు ఫ్యాక్షన్ హత్యలు జరిగాయి. ఒకటి అనంతపురం జిల్లా కనగానపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణయాదవ్ హత్య కాగా, మరొకటి కడప జిల్లా మార్గోపల్లె గ్రామానికి చెందిన ఆనపాటి వెంకటసుబ్బయ్యను నడిరోడ్డుపై మిట్టమధ్యాహ్నం భయంకరంగా నరికి చంపారు ప్రత్యర్థులు. అంతకుముందు రెండ్రోజుల క్రితమే మే 15వ తేదీ కడప జిల్లా పెద్దముడియం మండలం నాగరాజుపల్లెలో రాచమల్లు విశ్వనాథరెడ్డి దారుణహత్యకు గురయ్యాడు. ప్రత్యర్థులు వెంటపడగా విశ్వనాథరెడ్డి మిద్దె ఎక్కి పారిపోవడానికి ప్రయత్నిస్తూ ప్లాస్టిక్ పట్టా తగులుకొని కిందపడ్డారు. వెంటనే ప్రత్యర్థులు కట్టెలు, రాళ్లతో బాది దారుణంగా హత్య చేశారు. నాగరాజుపల్లెలో 1995లో జరిగిన ఫ్యాక్షన్ హత్య నేపథ్యం ప్రతీకారమేనని తేలింది. ఇక్కడ ఇరువర్గాల మధ్య కక్షలు రగులుతూనే ఉన్నాయి.

## హింస... హింస...!

అనంతపురం జిల్లా సింగిల్‌విండో అధ్యక్షుడు ముప్పై అయిదు సంవత్సరాల నారాయణయాదవ్ హత్యలో జరిగిన హింస పరిశీలిస్తే... మరో వ్యక్తి కోసం మోటారుసైకిల్‌పై ఎదురుచూస్తున్న నారాయణయాదవ్‌పై సుమోలో వచ్చిన దుండగులు దాడి చేశారు. వేటకొడవలితో నరకడంతో స్వల్పంగా గాయపడిన నారాయణయాదవ్ అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించారు. పక్కనే ఉన్న సందులోకి పరుగుతీశారు. మారణాయుధాలతో వెంటపడి తరుముకొచ్చిన దుండగులు మెయిన్‌రోడ్డుకు సుమారు వందమీటర్ల దూరంలో వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికారు. తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఓ చేయి పూర్తిగా తెగి వేలాడింది.

మే 12వ తేదీ అనంతపురం జిల్లా పుట్లోరు మండలం మడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణ ఇంటిపై ప్రత్యర్థులు బాంబుదాడి చేశారు. ఆ సమయంలో వెంకటనాయుడు అరటి తోటకు కాపలాగా వెళ్లడంతో ప్రాణాలతో బయటపడగలిగాడు. మే 8వ తేదీ కడప జిల్లా సింహాద్రిపురం మండలంలోని బిదినంచెర్ల గ్రామంలో అర్థరాత్రి ఈశ్వరరెడ్డి ఇంట్లో బాంబులు పేలాయి. పేలుళ్ల ధాటికి ఇంటిపైకప్పు ఎగిరిపోయింది. ఏప్రిల్ 19వ తేదీ అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మడుగుపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి వర్గాల వారు బాంబులు విసురుకున్నారు. ఏప్రిల్ 4వ తేదీ కడప జిల్లా మైలవరం మండలం గంగుల నారాయణపల్లె గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గురుశేఖర్‌రెడ్డి పొలంలో మేకలు పడ్డాయనే అంశం ఈ గొడవకు కారణమైంది. ఏప్రిల్ 28వ తేదీ అనంతపురం జిల్లా యల్లనూరు మండల పరిధిలోని గడ్డంవారిపల్లెలో రామకృష్ణారెడ్డి వర్గీయులపై వెంకటరామిరెడ్డి వర్గీయులు వేటకొడవళ్లతో దాడులు చేశారు. ఇలా ఇరువర్గాల మధ్య పాక్షిక దాడులు జరిగాయి.

## కక్షల కత్తులబోను కర్నూలు

కర్నూలు జిల్లాలో ప్రధానంగా 131 గ్రామాల్లో కక్షలు బలంగా ఉన్నట్లు రికార్డులు చెప్తున్నాయి. కోయిలకుంట్ల నియోజకవర్గంలోని చాగరాజు వేముల, దొర్నిపాడు, ఇంజేడు, భీమునిపాడు, పెద్ద ఎమ్మనూరు, పేరు సోమల, తిమ్మనాయునిపేట, అంకిరెడ్డిపల్లెలు ఫ్యాక్షన్ జాబితాలో ప్రధానంగా కనిపిస్తాయి. కోయిలకుంట్ల తర్వాత నల్లమల పరిధిలోని ఆళ్లగడ్డ, నంద్యాల, నందికొట్కూరు, పాణ్యం, ఆత్మకూరు ప్రాంతాలు, ఎర్రమల ప్రాంతంలో డోన్, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాలు ఫ్యాక్షన్ ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. బ్రిటీష్

కాలం నుంచి ఫ్యాక్షన్ చరిత్రను తనలో లిఖించుకున్న కోయిలకుంట్ల ప్రాంత పరిధిలో కాటసాని, బిజ్జం కుటుంబాలకు మధ్య కక్షలు రక్తపాతానికి దారితీశాయి. ఫ్యాక్షన్ ప్రాంతానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన కప్పట్రాళ్లలో వరం క్రిష్ణప్ప, పి.వెంకటప్పనాయుడు కుటుంబాల మధ్య ఫ్యాక్షన్ పగలు రగిలాయి. నందికొట్కూరు ప్రాంతంలో గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కుటుంబాల మధ్య ఫ్యాక్షన్ బాంబు దాడులకు దారితీసింది. 1994లో డిసెంబర్ మాసంలో గౌరు ప్రధాన అనుచరుడైన సాంబశివారెడ్డిని బైరెడ్డి అనుచరులు కిడ్నాప్ చేసి హత్య చేశారు. దానికి ప్రతీకారంగా బైరెడ్డి అనుచరులైన అంబిరెడ్డి, రామసుబ్బయ్యలను ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. 1996లో మాజీ ఎంపీ మద్దూరు సుబ్బారెడ్డిని కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో బైరెడ్డి వర్గీయులు బాంబులతో దాడిచేసి హత్య చేశారు. అనంతర పరిణామాలలో 1997లో బైరెడ్డి అనుచరుడైన తిరుపతిరెడ్డిని బ్రాహ్మణకొట్కూరులో హత్య చేయగా, 1998లో నందికొట్కూరులో నరసన్నగౌడ్ హత్యకు గురైనారు.

అనంతపురం జిల్లాలో పెనుగొండ, ధర్మవరం, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫ్యాక్షన్ పగలు హింసాత్మకంగా కనిపిస్తాయి. రాష్ట్రంలో సంచలనం రేపిన పెనుగొండ ఎమ్మెల్యే పరిటాల రవి హత్య నేపథ్యం భయానకం. రాష్ట్రంలోకెల్లా అత్యంత భారీస్థాయిలో కాపలా పెట్టుకున్న రవి తన పార్టీ కార్యాలయం గడపదాటి బయటికి వస్తుండగా తుపాకీ కాల్పులకు గురయ్యారు. మధ్యతరగతి వ్యవసాయదారుల కుటుంబం నుంచి వచ్చిన పరిటాల రవీంద్ర తక్కువకాలంలో అగ్రస్థాయి రాజకీయ నాయకుడిగా ఎదిగారు. 1983 జూన్ 12న అనంతపురంలో మాజీ శాసనసభ్యుడు మద్దెల చెరువు నారాయణరెడ్డిని హత్య చేసిన కేసులో రవిపేరు ప్రముఖంగా వినిపించింది. 1993 అక్టోబర్ 24న మద్దెలచెరువు సూర్యనారాయణరెడ్డి తల్లిని, ఇతర కుటుంబసభ్యులను టీవీ బాంబుపేల్చి హత్య చేశారు.

1996 ఏప్రిల్ 27న సోమందేపల్లిలో కాంగ్రెస్ నాయకుడు రమాకాంత్‌రెడ్డిపై దాడి జరిగింది. 1998 జూలైలో రంగారెడ్డి అనే వ్యక్తి అపహరణకు గురై హత్యకాబడ్డాడు. 2000 మార్చి 16వ తేదీ అనంతపురంలో గోనుగుంట్ల సూర్యనారాయణ అనే కాంట్రాక్టర్ ఇంటిపై దాడి జరిగింది. 2000 ఏప్రిల్ 24న హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ దగ్గర జంట ఫ్యాక్షన్ హత్యలు జరిగాయి. పరిటాల, గంగుల కుటుంబాల మధ్య ఫ్యాక్షన్ గొడవలు తరచూ వార్తల్లోకి ఎక్కినవే.



# నెత్తుటి 'మడుగు' కడప

కడప జిల్లాలో జమ్మలమడుగు ప్రాంతం అంటే వేటకొడవళ్లు, నాటుబాంబులు గుర్తుకొస్తాయి. జిల్లాలోనే అత్యంత ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతంగా రికార్డుకెక్కిన ఘనత జమ్మలమడుగుకు దక్కుతుంది. తర్వాత ముద్దనూరు మండలంలో కోడిగాండ్లపల్లె ఫ్యాక్షన్ గ్రామంగా ముద్రపడింది. సింహాద్రిపురం మండలంలోని కసనూరుకు కూడా ఫ్యాక్షన్ చరిత్ర ఉంది. కొండాపురం సర్కిల్ పరిధిలోనూ ఫ్యాక్షన్ గ్రామాలు చాలా ఉన్నాయి. ఫ్యాక్షన్ హత్యల విషయానికొస్తే 1993 ఆగస్ట్ 7వ తేదీన హైదరాబాద్ నడిబొడ్డున పట్టపగలు జరిగిన బాంబుదాడిలో అప్పటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే పి.శివారెడ్డి హత్యనే ప్రధానంగా చెప్పుకోవాలి.

కడప జిల్లాలో జరిగిన వై.ఎస్.రాజారెడ్డి హత్య కూడా అందులో ప్రధానమైందిగా చెప్పుకోవాలి. ఇటీవల 2006 జనవరి 30న సింహాద్రిపురంలో రామచంద్రారెడ్డి అలియాస్ చంద్రుడు, పి.రామచంద్రారెడ్డిలను ప్రత్యర్థులు హత్య చేశారు. 2007 అక్టోబర్ 13న కొండాపురంలో జిర్రా గంగిరాజు, జిర్రా క్రిష్ణయ్యలను ప్రత్యర్థులు హత్య చేశారు. 2007 జూలై 7న జిర్రా ఓబుళరాయుడు అనే వ్యక్తిని దత్తాపురంలో హత్య చేశారు. 2007 మే 16న ఎర్రగుంట్ల మండలం మాలేపాడు సర్పంచ్ జి.జయరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డిని ప్రత్యర్థులు అంతం చేశారు.

# పాలెగాళ్ల రాజ్యం

రాయలసీమలో పాలెగాళ్ల వ్యవస్థ అత్యంత ప్రాచీనమైనది. దీనికి తరతరాల చరిత్ర వుంది. సీమ నిరంతరం రగిలే అగ్నిగుండం. పోరాటాలకు ప్రధాన స్థావరం.

ఊరికో పాలెగాడు ఉండేవాడు. ఏ ఊరికి వాడు రాజుగా, ఆయా ప్రాంతాల్లోని ఊర్లను పంచుకొని పాలెగాళ్లు పరిపాలించారు. క్రీస్తుశకం 17, 18 శతాబ్దాల కాలంలో సీమలో ఈ పాలెగాళ్లదే ఆధిపత్యంగా వుండేది. వీరు తీసుకున్న నిర్ణయాలే శాసనాలుగా అమలయ్యేవి. ఊరికో రచ్చబండ ఏర్పాటు చేసి దాని మీద బురుజులు నిర్మించారు. (ఇప్పుడు సీమలో పలు గ్రామాల్లో ఇప్పటికీ ఈ బురుజులు, రచ్చబండల్ని మనం చూడవచ్చు). ఆ కాలంలోనే పాలెగాళ్లు న్యాయాన్ని, ధర్మాన్ని పాటిస్తూ ప్రజాపాలన చేశారు. తప్పు జరిగిందని తెలిస్తే అక్కడికక్కడే శిక్షలు అమలు జరిపేవారు. ఎదురు చెప్పిన వారి తల బురుజుకు వేలాడగట్టేవారు. గ్రామ పెద్దలు ఏర్పడి వారే ముఠాలను కూడగట్టుకోవడం ప్రారంభించారు. ఇప్పటికీ ఇలాంటి ముఠాలదే సీమలో రాజ్యం – వారిదే అధికారం.

దీనివల్ల ప్రజల్లో భయం ఏర్పడి మరోసారి తప్పులు చేయకుండా నడుచుకునేవారు. తాము చెప్పిందే వేదం, తాము చేసిందే శాసనంగా చెలాయించిన పాలెగాళ్లు నిరంకుశ పాలన కొనసాగించనప్పటికీ వారి పరిపాలన క్రమశిక్షణతో కూడుకొని ఉండటంతో ప్రజల అభిమానం పొందలేకపోయారు. అయితే రాయలసీమ పాలెగాళ్ల దెబ్బకు తక్కిన రాజ్యాలన్నీ సీమవైపు కన్నెత్తి కూడా చూడకుండాపోయాయి. పాలెగాళ్లను ఎదిరించడం అంటే ప్రాణాలు పోగొట్టుకోవడమే అని చుట్టుపక్క రాజ్యాల రాజులు బెదిరిపోయేవారు. ఎలాంటి కార్యమైనా పాలెగాళ్లు తలచుకుంటే క్షణాల్లో జరిగిపోయేది.

సీమ చరిత్రలో పాలెగాళ్లదే ప్రధానపాత్రగా సాగింది. పన్నులు వసూలు చేసి రాజధానికి పంపడం, యుద్ధ సమయాల్లో సైన్యాన్ని అందివ్వడం వంటి పనులు పాలెగాళ్లే చేశారు. సుల్తానుల దాడుల వల్ల కర్నాటకలోని హంపి రాజధానిని రాయలసీమలోని అనంతపురం జిల్లా పెనుకొండకు విజయనగర రాజులు మార్చారు. అప్పుడు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించిన ఘనత పాలెగాళ్లకే దక్కుతుంది. మట్లి పాలెగాళ్లతో విజయనగర రాజులు వివాహ సంబంధాలు కూడా చేసుకున్నారు. ఎంతమంది రాజులు మారినా, ఎన్ని రాజ్యాలు మారినా చివరకు సీమలో పరిపాలన బాధ్యత మాత్రం పాలెగాళ్లకే దక్కేది. అందుకే నిజాం పాలనలో కూడా పాలెగాళ్లే సీమను ఏలారు. పాలెగాళ్ల పరిపాలనలో ఎన్నో వసతులు కూడా ప్రజలకు దక్కాయి. దేవాలయాల నిర్మాణం, చెరువులు, బావుల తవ్వకాలు, పంటలు పండించడానికి సదుపాయాలు ఎన్నో కల్పించారు. ఎన్నో యుద్ధాలను సీమ ఎదుర్కొంది. బ్రిటిష్ వారికి కూడా ఈ పాలెగాళ్ల సత్తా ఏమిటో తెలిసింది. బ్రిటిష్ సైనికులు సైతం

పాలెగాళ్లను అణచడానికి వెనుకడుగు వేశారు. పోరాట వీరులైన పాలెగాళ్లను ఎదుర్కొనలేక వారిని బందిపోట్లుగా పిలిచారు. అయినా చివరికి పాలెగాళ్లదే పైచేయి అయింది.

## కక్షలకు నిలయాలు - గ్రామాలు!



వ్యక్తిగత ప్రతిష్ట కోసం, భూముల వద్ద, పొలాల గట్ల కోసం, అక్రమ సంబంధాలు, పాతకక్షలు... వంటి సంఘటనలు ఫ్యాక్షన్ పుట్టడానికి అంకురార్పణ అవుతాయి. క్రమక్రమంగా హత్యలకు దారితీస్తాయి. ఇటువైపు వర్గంవారు ఒక హత్య చేస్తే అటువైపు వర్గం వారు మరో హత్య చేస్తారు. సమస్య అక్కడితోనే ఆగిపోదు. రెండు వర్గాల వారు అనుక్షణం ప్రత్యర్థి కోసం కాపు కాస్తుంటారు. శత్రువు ఏమాత్రం ఒంటరిగా దొరికినా ఉదయం నాటికి అతని తల ఎక్కడో ఒక చోట బయటపడుతుంది. ఇలా గ్రామాల్లో ప్రారంభమైన చిన్నచిన్న స్పర్థలే చిలికి చిలికి గాలివాన అయినట్లు పగలు, ప్రతీకారాల వరకు వెళతాయి. పలు కుటుంబాలు యిలా గ్రామ కక్షలతోనే ఆర్థికంగా చితికిపోయాయి. చిన్న విషయాలకు సైతం గొడవ పడడం, రాజకీయ నాయకుల దగ్గరకు వెళ్లడం, పంచాయతీ పెట్టించడం, అవసరాన్ని బట్టి 'రాజీ'ల ద్వారా, వీలైతే నిరంకుశంగానూ ముఠా రాజకీయ నాయకులే న్యాయాధీశులై తీర్పునివ్వడం యిక్కడి ప్రయివేట్ న్యాయం. కోర్టు, చట్టాలు, ఫీజులు, ఖర్చులు వంటివి ఏవీ లేకుండా క్షణాల్లో అక్కడికక్కడే పంచాయితీ పెట్టి సమస్యను పరిష్కరించడం - కాదంటే కాళ్లు చేతులు నరికి తమ ఆధిపత్యం నిరూపించుకోవడం యిక్కడ రివాజు.

ముఠా నాయకులే ప్రయివేట్ న్యాయాధీశులుగా తమ స్వార్థం కోసం, మనుగడ కోసం న్యాయాన్ని ప్రకటిస్తూ అమలు చేస్తూ, వీలైతే బాధితులైన ఇరువర్గాల నుంచి అందినంత దండుకుంటూ తమ జీవనం సాగిస్తుంటారు. గ్రామాల్లోని ఈ కక్షలే రాజకీయ నాయకులకు తమ వర్గాలను పెంచుకోడానికి తోడ్పడతాయి. గ్రామాలు నిరంతరం కక్షలతో రగిలిపోవడం ఎవరో ఒకరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం, వారిని విడిపించుక రావడానికి రాజకీయ నాయకులను సంప్రదించడం- రాజకీయ నాయకులకు ఎక్కువ సమయం పోలీస్ స్టేషన్లకెళ్లి నిందితులను విడిపించడంతోనే

సరిపోతుంది. యింకెక్కడి అభివృద్ధి? గ్రామ సర్పంచ్ ఎన్నికల నుండి లోక్‌సభ ఎన్నికల వరకు నాయకులు వర్గాల్ని కూడగట్టడంలోనే మునిగి వుంటారు. ఇలా ఎవరికి వారు ఒక్కొక్క గ్రామాన్ని కలుపుకుంటూ తమ నియోజకవర్గాన్ని గుప్పిట్లో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. కక్షల దెబ్బకు గ్రామాలు గ్రామాలు వలసపోవడం యిప్పుడు ఎక్కువగా జరుగుతోంది. కడప జిల్లాలోని కోడిగండ్లపల్లె, కొమ్మాద్ది, తాతిరెడ్డిపల్లె, వర్దరాజుపల్లె గ్రామాలు దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువ భాగం మెట్టభూములు కావడం, పంటలు సరిగ్గా పండకపోవడం, సంవత్సరంలో నాలుగు నెలలు పని వుంటే మిగిలిన ఎనిమిది నెలలు పనిలేకుండా వుండటం, చేయడానికి పనులు లేకపోవడంతో నాయకుల వద్ద 'ప్రయివేట్ సైన్యం'గా చేరిపోతున్నారు. నిరుద్యోగులు కూడా ఈ బాటలోనే నడుస్తున్నారు. వీళ్లందర్నీ వాడుకుంటూ ముఠా నాయకుడు ఎదిగిపోతున్నాడు. మరోమార్గం లేకపోవడంతో గ్రామవాసులు అతడి దగ్గరికే పనికి కుదురుతున్నారు.

# ఫ్యాక్షన్ చిచ్చుకు 'సీమ' భస్మం

ప్రత్యర్థిపై పగ తీర్చుకోవడానికి ఇస్తున్న ప్రాధాన్యత ప్రజల సమస్యల పరిష్కారానికి ఇవ్వడం లేదు. తినడానికి గుప్పెడు మెతుకులు లేక పస్తులున్నా ఫరవాలేదు. ప్రత్యర్థిని మట్టుపెట్టాలన్న వైఖరితో సీమలో ఫ్యాక్షన్ సంస్కృతి పెచ్చరిల్లుతోంది. పురివిప్పిన వర్గ రాజకీయాలు ప్రతీకార జ్వాలలతో ఎప్పుడూ కుతకుతలాడుతుంటాయి. ప్రత్యర్థుల అంతమే వాటి లక్ష్యంగా కనిపిస్తోంది. ముందుజాగ్రత్త చర్యగా వర్గనాయకులు, వారి అనుచరులు మారణాయుధాలను వెంట తీసుకొని వెళ్తుంటారు. ఆయుధాలు లేకుండా అడుగు బయట పెట్టాలంటే భయం. డేగ కళ్లతో ప్రత్యర్థుల కదలికలను పరీక్షిస్తుంటారు. గ్రామాల్లో చిన్న చిన్న సంఘటనలు జరిగినా ఇరువర్గాలు రంగప్రవేశం చేస్తాయి. ఆ సంఘటనను తమ బలప్రదర్శనకు వేదికగా మార్చుకుంటాయి. ఫ్యాక్షన్ విషవలయాలు గ్రామాల్లో విలయతాండవం చేస్తున్నాయి. మనిషి మీద పగ మరో సాటి మనిషిని ముక్కలు ముక్కలుగా నరికి ఆ శరీర భాగాలు సైతం కనపడకుండా చేసే స్థితికి ఫ్యాక్షన్ చేరుకుంది.

గ్రామాలకు గ్రామాలు తగలబడటం, ధాన్యం, పశుగ్రాసంతో సహా నోరులేని పశువులు మంటల్లో నిలువునా దహించుకుపోవడం వంటి సంఘటనలు రివాజుగా మారాయి. ఇక నాయకుల వెంట తిరిగే సామాన్యుల పరిస్థితి మరింత ప్రమాదంలో పడింది. స్వార్థ నాయకులకు అండగా వుంటున్న యువత పలు సందర్భాలలో బలయిపోతున్నారు. కొందరు అంగవికలురై అలమటిస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి

ఒకవైపు బాధిస్తుంటే మరోవైపు వర్గ పోరాటాల్లో మునిగిపోయి తమ సర్వస్వాన్ని పోగొట్టుకుంటున్నారు ప్రజలు. యువతకు ఉపాధి కల్పించాల్సిన నాయకులే వారి చేత రౌడీయిజం చేయిస్తున్నారు. బాంబుల తయారీకి పురికొల్పుతున్నారు. మరికొందరు కిరాయి హంతకులుగా మారిపోతున్నారు. ఈ ప్రస్థానం ఎక్కడికో?

ఫ్యాక్షనిజానికి పునాదులు కిరాయి హంతకముఠాలు. సీమలో అయిదు వేల రూపాయలకు కూడా హత్యలు చేసే గ్రూపులు వున్నాయి. ఇక్కడ జరుగుతున్న ఫ్యాక్షన్ హత్యల్లో తొంభై శాతానికి పైగా కిరాయి హంతకులు చేస్తున్నవే. కక్షలు, కార్పణ్యాలు, వర్గపోరాటాల్ని పెంచి పోషించే రాజకీయ నాయకులు తమ ప్రత్యర్థులను హతమార్చేందుకు కిరాయి హంతకులను ఆశ్రయిస్తుంటారు. సీమలో ఇలా డబ్బుకు ప్రాణాలు తీసే ముఠాలు 150 నుంచి 200 వరకు వుండవచ్చని అంచనా.

వీళ్లు ఇతర జిల్లాలోనే కాకుండా పక్క రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల్లో కూడా హత్యలు చేయడానికి ఒప్పుకుంటారు. ఒక్కో కిరాయి ముఠాకు ఒక్కో నాయకునితో దగ్గరి సంబంధాలు వుంటాయి. ఒక్కో కిరాయి హంతక ముఠాలో ఐదు నుంచి పదిమంది వరకు సభ్యులుంటారు. కిరాయి హత్యలు చేసే గ్రూపులేవీ నేరుగా ఎటువంటి ఒప్పందాలు కుదుర్చుకోవు. ఈ ముఠాలకు తెర వెనుక నుండి సూచనలిచ్చే నేతలే చేయాల్సిన పనులను నిర్ణయిస్తారు. చాలా సందర్భాల్లో తాము ఈ హత్య ఎందుకు చేస్తున్నామో, ఇది ఎవరికి ప్రయోజనమో వంటి విషయాలను కూడా కిరాయి ముఠాలకు తెలియదు. పనిచేయడం – డబ్బు పుచ్చుకోవడం మాత్రమే వారికి తెలిసిన విద్య.

అలాగని వీళ్లకు డబ్బుకు కొదవుండదని కాదు, బడా నాయకులు నాలుగు లక్షలతో, ఆరు లక్షలతో కాంట్రాక్టు కుదుర్చుకొని... పనికాగానే వీళ్లకు ఇచ్చే సొమ్ము వేలల్లోనే వుంటుంది. మిగతా సొమ్ము పెద్దల చేతుల్లోనే యిరుక్కుపోతుంది. తమ తెర వెనుక నాయకుడిని ఎదురు ప్రశ్నించే అవకాశం లేదు. ఒకవేళ ఈ కూపం నుంచి బయటపడాలన్నా సాధ్యం కాదు. అంతకుముందు చేసిన పలు హత్యల వివరాలు బడా నేతలకు తెలుసు కాబట్టి, అతను ఎక్కడైనా వీళ్లను ఇరికించే అవకాశం వుంటుంది. కిరాయి హంతకులపై కేసులు తక్కువ నమోదు అవుతాయి. ఎందుకంటే హత్య జరిగినప్పుడు ప్రత్యర్థి వర్గాలపైనే కేసులు పెడతారు. హత్య ఎవరు చేశారనే విషయం వారికి అవసరం అవుతుంది. ఎంతసేపు చేయించిన వారిపైన దృష్టి వుంటుంది. హత్య చేయించారని కోర్టుకెక్కడం అక్కడ సరైన సాక్ష్యాలు లేకపోవడంతో కేసు వీగిపోవడం మామూలే! హత్యలు చేసిన కిరాయి హంతకులు ఏమాత్రం తమ

ఉనికి బయటపడకుండా జీవనం సాగిస్తారు. కర్నూలు జిల్లాలో పత్తికొండ, కోయిలకుంట్ల, డోన్, నంద్యాల ప్రాంతాల్లో కిరాయి హంతకులు వున్నట్లు భావిస్తుండగా, కడప జిల్లాలో పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో కిరాయి హంతకులు వున్నట్లు అంచనా. కిరాయి హంతక ముఠాల్లో ఒకరికి ఒకరు సరిపోక వారిలో వారే చంపుకున్న సందర్భాలు, కాంట్రాక్టు ప్రకారం ఇద్దర్ని చంపమని పంపినప్పుడు అక్కడ వాతావరణం అనుకూలించకపోతే ఐదుమందిని చంపివచ్చిన ముఠాలు కూడా వీళ్లలో వున్నాయట. 1996లో కడప జిల్లాలో పులివెందులకు 6 కిలోమీటర్ల దూరంలో కిష్టంగారిపల్లె వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో చలపతి అనే కిరాయి హంతకుడు మృతి చెందాడు. ఈ కిరాయి హంతకుడు 1993 నుంచి 1996 వరకు దాదాపు వంద హత్యలు చేసి వుండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## బాంబుల రాజ్యం

ముఠా నాయకులు తమ రక్షణ కోసం ప్రధానంగా వాడేవి – బాంబులు. రాయలసీమలో తుపాకీ లైసెన్సులను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల గతంలో 3,500 తుపాకీ లైసెన్సులు రద్దయ్యాయి. ఫలితంగా ఫ్యాక్షనిస్టులు తమ రక్షణ ఏర్పాట్లకు వినూత్న మార్గాలను అన్వేషించారు. ఫ్యాక్షన్ ముసుగులో ఎన్నో నేరాలకు పాల్పడిన నాయకులు, సహజంగానే ప్రత్యర్థుల నుంచి ముప్పు ఎదుర్కొంటున్న రాజకీయ నాయకులు తమకు తుపాకులు అందుబాటులో లేకపోవడంతో 'నాటుబాంబు'లే వీరికి దిక్కయ్యాయి. వేటకొడవళ్లు, గండ్రగొడ్డళ్లు, బరిసెలు... ఆయుధాలుగా వున్నప్పటికి శక్తివంతమైన 'నాటుబాంబు'లే వీరికి ప్రధాన ఆయుధాలయ్యాయి. ఫలితంగా నాటుబాంబుల తయారీ సీమలో కుటీర పరిశ్రమగా మారింది. నాయకులకు బాంబులు అవసరం అయినప్పుడు అవి చేసే వారిని పిలిపించుకొని చేయించుకోవడం లేదా వారి నుండి కొనడం చేస్తుంటారు. శక్తివంతమైన బాంబులను డిమాండ్‌ను బట్టి 100 నుంచి 150 రూపాయల వరకు విక్రయిస్తారు. సాధారణ బాంబులైతే 50 నుంచి 80 రూపాయల వరకు ధర పలుకుతుంది. సాధ్యమైనంత వరకు ముఠా నాయకులే ఊరికి దూరంగా వున్న ప్రాంతాల్లోగాని, పొలాల్లోగాని వీటిని తయారు చేయించుకుంటారు.

## దారి తప్పే 'యువత'

గతంలో కడప జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఉమేష్‌చంద్ర ఫ్యాక్షనిజాన్ని చాలావరకు అణిచివేశారు. ఆయుధాలను కూడా పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ఫ్యాక్షనిజాన్ని రూపుమాపాలన్న ధ్యేయంతో ఉమేష్‌చంద్ర తీసుకున్న

కఠిన చర్యల వల్ల అనేకమంది ఫ్యాక్షనిస్టులు జిల్లాను విడిచిపెట్టి వెళ్లిపోయారు. కడప జిల్లాలో దాదాపు 90 శాతం గ్రామాల్లో వర్గ రాజకీయాలు నడుస్తున్నాయి. పంచాయితీ సర్పంచ్ నుంచి పార్లమెంట్ సభ్యుల వరకు ప్రైవేట్ బాడీగార్డులను వెంటబెట్టుకొని తిరుగుతుంటారు. ఈ ప్రవేట్ బాడీగార్డులతో అధికశాతం యువత కావడం గమనించదగ్గ విషయం.

వీరిలో కొందరి చేత నాయకులు మారణాయుధాలు తయారు చేయించడం, హింసా రాజకీయాలకు వాడుకోవడం జరుగుతోంది. దీనివల్ల యువత మీద ముఠాల ప్రభావం పడుతోంది. ప్రధానంగా గ్రామీణ యువతే నాయకులకు ప్రవేట్ సైన్యంగా మారడం వలన ఆ ప్రభావం గ్రామీణులపై పడి పల్లెల్లోనూ వర్గ రాజకీయాలు చోటు చేసుకున్నాయి. ఖాళీగా తిరుగుతూ జీవితాన్ని జులాయిగా గడిపేస్తున్న వారిని చేరదీసి వారికి బాంబుల తయారీలోనూ, కిరాయి హంతకముఠాల్లోనూ, ప్రైవేట్ సైన్యంలోనూ అవకాశాలు ఇస్తున్నారు. ఎన్నికల సమయాల్లో అయితే యువతకు చేతినిండా పనే!

ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేకించి రాయలసీమ నుంచి ఎక్కువమంది మనుషులను వివిధ నియోజకవర్గాల వారు పిలిపించుకుంటూ వుంటారు. మూడు పూటలా భోజనం, ఎన్నికల తర్వాత ఐదువేల రూపాయల నగదు, రెండు జతల బట్టలు ఇస్తాం అంటూ ఎన్నికల సమయాల్లో వివిధ నియోజకవర్గాల నుంచి ప్రతినిధులు రావడం, ఇక్కడి యువతను తీసుకెళ్లడం చేస్తుంటారు. వీళ్లు ఎన్నికల ప్రచారం చేయడం, రిగ్గింగ్, అరాచకాలు చేయడం వంటి పనులు చేపడతారు. ఇలా వెళ్లి అక్కడే ప్రాణాలు పోగొట్టుకున్న అభాగ్యులు కూడా ఎందరో వున్నారు. సీమ నుంచి ఎన్నికల ప్రచారం కోసం కర్నాటక, తమిళనాడు ప్రాంతాలకు నిరుద్యోగులు వెళ్లడం ఇక్కడ ప్రతిసారీ జరుగుతూనే వుంటుంది. ఫలితంగా బంగారు భవిష్యత్‌ను వీడి విద్రోహులుగా మారిపోతున్నారు.

## బాంబులు ఎలా తయారవుతాయి?

ఒక కిలోగ్రాము ఎర్రటి గంధకం, ఒక కిలోగ్రాము తెల్లటి గంధకం దొరికిందంటే చాలు పది నుండి పదిహేను బాంబులు తయారు చేస్తారు. వీటి తయారీలో దాదాపు 20 కేఫ్‌ల వరకు ఉపయోగిస్తారు. నాటుబాంబుల తయారీకి కావలసిన ప్రధాన సామగ్రి మొత్తం కర్నాటక నుంచే తెచ్చుకుంటారు. బాంబుల తయారీలో వాడే కేఫ్‌లను ప్రభుత్వ అనుమతి వున్న లైసెన్సుదారుల నుండే కొనుగోలు చేస్తారు. బాంబుల తయారీకి పెద్దగా కష్టపడకపోయినప్పటికీ వీటిని తయారు చేస్తున్నప్పుడు జాగ్రత్తగా వుంటే చాలు. లేదంటే అక్కడికక్కడే ప్రాణాలు పోవడం



ఖాయం. ఇలా నాటు బాంబులు చేస్తూ ప్రాణాలు పోగొట్టుకున్న వారి సంఖ్య వేలల్లో వుంటుంది. కర్నూలు జిల్లా పోలీసులు బాంబులను తయారు చేసేవారి జాబితాను తయారుచేసి అన్ని జిల్లాలకంటే ఒక అడుగు ముందున్నారు. ఆ వివరాలను గతంలోనే ప్రకటించారు. ఇదేవిధంగా అనంతపురం, కడప జిల్లాల పోలీసులు ఒక జాబితా తయారుచేస్తే సీమలో కొంతవరకు బాంబులను తగ్గించవచ్చని జనం అభిప్రాయం.

## రాయలసీమ రాజకీయం...
## ముఠా కక్షల హత్యల తోరణం

రాయలసీమ ఫ్యాక్షన్ కేకలు రాజధానిలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఏదో ఒక పని మీద రాజధానికి వచ్చే సీమ నాయకులను అవకాశం చిక్కితే ప్రత్యర్థి వర్గాలు ఇక్కడే మట్టుబెడుతున్నాయి. లేదంటే తిరిగి వెళ్లేవరకూ వెన్నంటే ఉండి తమ ఇలాకాలోకి రాగానే మాటువేసి హత్య చేస్తున్నాయి. శివారెడ్డిని బాంబులు వేసి చంపడం మొదలు నిన్న జరిగిన సూర్యప్రతాపరెడ్డి హత్య వరకూ అనేక దురాగతాలకు ఏదో ఒక రూపంలో నగరం వేదిక అవుతోంది. నగరంలోని తన కోడలి ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్న సూర్యప్రతాప్‌రెడ్డి ఏ రైలు ఎక్కాడో ప్రత్యర్థులు అనుచరులకు పక్కా సమాచారం ఇచ్చారు. దాని ఆధారంగానే తాడిపత్రి రైల్వేస్టేషన్లో కాపుగాసి దిగగానే నరికి చంపారు. రాజధాని కేంద్రంగా చేసుకుని నడుపుతున్న ఫ్యాక్షన్ కార్యకలాపాలకు ఇదో ఉదాహరణ మాత్రమే.

అనంతపురం జిల్లా ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సూర్యప్రతాపరెడ్డి (సూరీడు) మంగళవారం తెల్లవారుజామున తాడిపత్రి రైల్వేస్టేషన్ ఆవరణలో దారుణ హత్యకు గురయ్యారు. ప్రత్యర్థులు నరకడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కోడలు శ్రీమంతం వేడుకలో పాల్గొనేందుకు ఏప్రిల్ నెల 13న ఆయన హైదరాబాద్ వెళ్లారు. తిరిగి సోమవారం రాత్రి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌కు బయలుదేరి తెల్లవారుజామున తాడిపత్రికి వచ్చారు. దాదాపు 3.45 గంటల ప్రాంతంలో రైలు దిగి సూరీడు స్టేషన్ ప్రధాన ద్వారం గుండా వస్తుండగా లగేజి తీసుకుని గన్‌మేన్ ఆటోను పిలవడానికి

వెళ్లాడు. అప్పటికే కాపుకాచిన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు బాంబులతో సూరీడుపై దాడి చేశారు. రైలు దిగగానే కంట్లో కారం చల్లి 30 కత్తిపోట్లు పొడిచారు. తర్వాత జీపులో హంతకులు పరారయ్యారు. 2006 ఏప్రిల్ 18వ తేదీన ఈ హత్య జరిగింది.

## వేటకొడవళ్లతో తెగనరికి...

కర్నూలు జిల్లా బనగానపల్లి మండలం ఎనగండ్లకు చెందిన బొబ్బల మోహన్‌రెడ్డి (36) ఆరేళ్ల కిందట హైదరాబాద్‌కు వలస వచ్చారు. ఆరునెలల గర్భవతైన భార్య నిరమ్మలమ్మ (26), కూతురు భావన (6), దూరపు బంధువు మధుకరణ్‌రెడ్డి (19)లతో కలిసి హైదరాబాదులోని హైదర్‌గూడలో దాసరి ధరంపాల్‌రెడ్డి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. స్థానికంగా చలువరాళ్ల వ్యాపారం నిర్వహించేవారు. రెండేళ్ల కిందట ఆ వ్యాపారాన్ని మానుకొని వడ్డీ వ్యాపారం ప్రారంభించారు. మోహన్‌రెడ్డి ఆది నుంచి ఎంతో గోప్యత పాటించేవారు. తన నివాసం ఎక్కడన్నది ఆయన స్నేహితులకి కూడా తెలియకుండా చూసుకునేవారు.

## ఎలా జరిగింది?

మోహన్‌రెడ్డి నిత్యం తెల్లవారుజామున వార్తాపత్రిక కోసం ఇంటి సమీపంలోని చౌరస్తాకు వెళుతుంటారు. అలవాటు ప్రకారం సోమవారం కూడా పేపర్ తెచ్చుకోవడానికి చౌరస్తాకు కాలినడకన వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో అక్కడికి సమీపంలోని పోచమ్మ దేవాలయం దగ్గర ఓ టాటాసుమో వాహనంలో కాపు కాసిన ఆరుగురు వ్యక్తులు ఒక్కసారిగా కిందకు దిగారు. వాళ్లని చూసిన మోహన్‌రెడ్డి ఖంగుతిన్నారు. ఆరుగురిలో నలుగురు మోహన్‌రెడ్డిని ఒడిసిపట్టుకుని 'వెయ్యండిరా' అంటూ అరిచారు. అదే అదునుగా మరో ఇద్దరు ఏమాత్రమూ ఆలస్యం చేయకుండా వేటకొడవళ్లతో మోహన్‌రెడ్డిని విచక్షణారహితంగా నరికారు. ఆ ఆరుగురు వ్యక్తులు వచ్చిన సుమోలోనే ఉండాయించారు. తొందరలో ఆ వాహనం చౌరస్తాలో ఓ ఆటోను ఢీకొని వెళ్లిపోయింది. స్థానికులు ఈ పరిణామాల్ని గమనిస్తున్నారు. అయితే ఎవరూ వాహనం నంబరు గురించి పట్టించుకోలేదు.

అక్కడకు చేరుకున్న పోలీసు జాగిలం సంఘటనా స్థలిలో పడి ఉన్న ఓ నిందితుడి చెప్పులను వాసన చూసి దేవాలయం చుట్టూనే తిరిగింది. హతుడి భార్య నిరమ్మలమ్మ, సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డిని పోలీసులు విచారించగా... మోహన్‌రెడ్డి గతంలో మాజీ ఎమ్మెల్యే బెజ్జం పార్థసారథిరెడ్డికి ముఖ్య అనుచరుడిగా వ్యవహరించాడని,

ఆరేళ్ల క్రితం ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఇద్దరి మధ్యా మనస్పర్థలు వచ్చాయని చెప్పారు. దీంతో స్వస్థలం వదిలి ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. మోహన్‌రెడ్డికి ఫ్యాక్షన్ చరిత్ర ఉన్నట్లు తెలుస్తోందని, ఎనగండ్లలో ఓ దేవాలయ నిర్మాణం విషయమై కొందరితో అతడికి గొడవ జరిగినట్లు పోలీసులు చెప్పారు. ఈ హత్య 2007 ఏప్రిల్ 23వ తేదీన హైదరాబాద్‌లో జరిగింది.

## రాజధానిలో రక్తపాతం

రాయలసీమ హత్యా రాజకీయాలకు వేదికగా రాజధాని నగరం హైదరాబాద్ మారుతోంది. 1997 సంవత్సరం నవంబర్ 19న రామానాయుడు స్టూడియో బయట జరిగిన బాంబు పేలుడు సంఘటన ఈ విషయాన్ని మరింత బలపర్చుతోంది. జరిగిన లోక్‌సభ ఎన్నికల అనంతరం ఇప్పుడిప్పుడే రాయలసీమలోని ముఠా కక్షలు, వర్గ వైషమ్యాలు మళ్లీ పంజా విసరడానికి సిద్ధపడుతున్నాయి. సీమలో వేటకొడవళ్ల సాక్షిగా ప్రారంభమైన హత్యా రాజకీయాలు నేడు బెల్జియం, ఇంగ్లాండ్ తుపాకుల స్థాయికి చేరుకుందంటే పరిస్థితి ఎలా వుందో ఊహించుకోవచ్చు. ప్రత్యర్థుల మీద పగ సాధించడం కోసం ఆధునిక సాంకేతిక పద్ధతులు వినియోగిస్తున్నారు.

అనంతపురం జిల్లా చిక్కేపల్లి గ్రామం వద్ద ఒక శక్తివంతమైన మందుపాతర పేలి ఎనిమిది మందిని దారుణంగా బలి తీసుకున్న సంఘటన చెరిగిపోలేనిది. ఈ మందుపాతరను పేల్చిన వ్యక్తి కూడా అక్కడికక్కడే అదే విధ్వంసానికి బలికావడం... పెనుకొండ శాసనసభ్యుడు చెన్నారెడ్డిని పోలీసుల వేషంలో వచ్చి హత్య చేసిన సంగతి... మద్దులచెరువు గ్రామంలో కాంగ్రెస్ శాసనసభ్యుడు సూర్యనారాయణరెడ్డిని హతమార్చడం కోసం ఇంటిలోని టి.వి.లో బాంబు పెట్టడం... పేల్చడం... వంటి సంఘటనలు యిక్కడి రాక్షస రాజకీయాన్ని వివరిస్తాయి. వర్గపోరాటాల విషపు కోరల్లోకి చిక్కి ఇంటికొక్కరు కూడా మిగలకుండా ఫ్యాక్షనిజానికి ఆహుతైన కుటుంబాలు ఎన్నో ! అతిచిన్న తగాదాలు సైతం కక్షలుగా మారి తీవ్రరూపం దాల్చి గ్రామాలకు గ్రామాలే దహించుకుపోవడం లేదా, వలస పోవడం వంటి సంఘటనలు ఎన్నెన్నో. నిత్యం చావు కోరల్లో బతకడం ఇష్టం లేక రాజధాని హైదరాబాద్‌ను రక్షిత ప్రదేశంగా భావించి అక్కడికెళ్లి తలదాచుకుంటుంటే... పగపట్టిన ఫ్యాక్షన్ ప్రాణాలు తీసేదాకా నిద్రపోవడం లేదు. గతంలో తెలుగుదేశం జమ్మలమడుగు నియోజకవర్గ శాసనసభ్యుడు పి.శివారెడ్డి పట్టపగలు హైదరాబాద్ నడిబొడ్డున దారుణహత్యకు గురికావడం, బంజారాహిల్స్‌లో అనంతపురం జిల్లా పెనుకొండ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.రమణారెడ్డి సోదరుడు ఓబుల్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిని దారుణంగా నరికి

చంపడం, అనంతపురం జిల్లాకు చెందిన తెలుగుదేశం మాజీ మంత్రి పరిటాల రవిపై ఫియట్ కారు బాంబు విధ్వంసం... వంటి సంఘటనలు నిదర్శనాలు.

1993 ఆగస్ట్ 7వ తేదీన హైదరాబాద్ నడిబొడ్డున పట్టపగలు బాంబు దాడిలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే పి.శివారెడ్డి హత్యకు గురికావడంతో ప్రారంభమైన సీమ రాజకీయ హత్య యిప్పటికి చెరిగిపోని చేదు జ్ఞాపకమే! పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజనీర్ చలమారెడ్డి కుమార్తె వివాహానికి హాజరవ్వటానికి శివారెడ్డి ఇతర ఎమ్మెల్యేలతో పాటు కల్యాణమండపానికి వచ్చి తిరిగి వెళుతుండగా ఎనిమిది మంది ఆగంతకులు ఆయనపై బాంబులు విసిరారు. ఈ దాడి వల్ల ఆయన కుడిచెయ్యి నజ్జునజ్జయ్యి మిగతా శరీరం నుండి విడిపోయింది. దుండగులు మొత్తం శక్తివంతమైన ఆరు నాటుబాంబులు విసిరారు. బాంబుల దాడిలో శివారెడ్డి కూలిపోయినప్పటికీ, ఇంకా ప్రాణంతో వున్నారేమోనన్న అనుమానంతో ఆయనపై దుండగుల్లో ఒకరు పెద్ద రాయితో – విసరడానికి ప్రయత్నించారంటే రాయలసీమ కక్షలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. తన ప్రాణాలకు ముప్పు ఉన్నందున అదనపు రక్షణ కల్పించాలంటూ శివారెడ్డి రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వాన్ని కోరి 24 గంటలు కాకముందే ఆయన హత్య సంచలనం రేపింది.

1996 జులై 23వ తేదీన బంజారాహిల్స్ రోడ్డు నంబరు ఒకటిలోని మహేశ్వరి టవర్స్‌లో రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో అనంతపురం జిల్లా పెనుగొండ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.రమణారెడ్డి సోదరుడు ఓబుల్‌రెడ్డి, నాగభూషణం, రంగారెడ్డిలను దారుణంగా నరికి చంపడం రాజధానినే గడగడలాడించింది. మారణాయుధాలతో వేటాడి వేట కొడవళ్లతో దారుణంగా నరికి చంపడం వెనుకగల పకడ్బందీ వ్యూహాన్ని వివరించాల్సి వస్తే... తన ప్రియురాలితో పడకగదిలో టి.వి. చూస్తూ కూర్చున్న ఓబుల్‌రెడ్డి గ్రౌండ్ ఫ్లోరు హాలు నుంచి శబ్దాలు రావడంతో ప్రమాదం ఏదో జరిగిందని భావించి, పడకగది తలుపును వేసుకున్నారు. కానీ హంతకులు తలుపును తన్నగా బోల్టు ఊడిపోయింది. బెడ్‌రూంలోకెళ్లిన హంతకులు ఓబుల్‌రెడ్డి బాత్‌రూంలో వున్నట్లు పసిగట్టారు. రివాల్వర్‌తో బాత్‌రూం తలుపుపై కాల్పులు జరపగా, లోపల గాయపడిన ఓబుల్‌రెడ్డి కిందపడ్డాడు. వెంటనే హంతకులు ఆయనను బాత్‌రూం నుంచి బయటకు లాగి నిర్దాక్షిణ్యంగా వేటకొడవళ్లతో ఖండఖండాలుగా నరికి మాంసపు ముద్దను చేశారు. అదే బాత్‌రూంలో ఓబుల్‌రెడ్డితో దాక్కున్న అతని ప్రియురాలు లక్ష్మిని హంతకులు ప్రాణాలతో వదిలేశారు. హంతకులు పాయింట్ త్రీ టూ రివాల్వర్ వాడినట్లు పోలీసులు గుర్తించారు. హంతకులు బురఖాలు, కుర్తా పైజమాలు, తలపై నమాజ్ టోపీలు ధరించినట్లు... పోలీసుల కథనం.

1997 నవంబర్ 9న రామానాయుడు స్టూడియో బయట ఒక తెల్లటి ఫియట్ కారు నుంచి సంభవించిన బాంబు పేలుడులో 26 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 27 మంది గాయపడ్డారు. తెలుగుదేశం మాజీ మంత్రి పరిటాల రవిపై జరిగిన హత్యాయత్నమిది. మోహన్‌బాబు హీరోగా తన తండ్రి పరిటాల శ్రీరాములుగారి వాస్తవ జీవితాన్ని చిత్రంగా నిర్మించాలని పరిటాల రవి సంకల్పించి సినిమా ప్రారంభోత్సవం జరిపిన తర్వాత వస్తున్నప్పుడు ఈ విస్ఫోటనం జరిగింది. ఈ దారుణానికి ఒక టీ.వీ. ఛానల్‌కు చెందిన సిబ్బంది మృతి చెందడం తెలిసిందే. ఈ దారుణానికి కారణంగా మాజీ శాసనసభ్యుడు ఎం.సూర్యనారాయణరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. పరిటాల రవిపై హత్యా ప్రయత్నానికి గల కారణాల వెనుక దశాబ్దాల వైరం వుంది.

## దశాబ్దాల వైరం - అందుకే ఆ విధ్వంసం!

ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల్లో సుమారు పాతికేళ్ల నుంచి రెండువర్గాల మధ్య వైరం వుంది. మద్దలచెరువు, వెంకటాపురం, కనుముక్కల గ్రామాలు ఈ వైరానికి ప్రధాన కేంద్రాలు. ఈ గ్రామాలన్నీ పెనుకొండ సెగ్మెంట్ క్రిందకు వస్తాయి. అప్పటికే పెనుకొండ ప్రాంతంలో ఒక కీలక నాయకుడిగా ఎదిగిన మద్దల చెరువు నారాయణరెడ్డికి వ్యతిరేకంగా పరిటాల శ్రీరాములు ప్రజల మద్దతు పొందడంతో సహించలేకపోయిన మద్దల చెరువు నారాయణరెడ్డి, సానే చెన్నారెడ్డిలు ఒక పథకం ప్రకారం పరిటాల శ్రీరాముల్ని అంతం చేశారు. పరిటాల శ్రీరాములుకు ఇద్దరు కొడుకులు. ఒకరు పరిటాల సూరి, మరొకరు పరిటాల రవి.

పరిటాల సూరి విప్లవ ఉద్యమాలలో ప్రధాన పాత్ర పోషించేవారు. దీనిని ఆసరాగా తీసుకొని ప్రత్యర్థి వర్గాలు సూరి ఎక్కడ తమ రాజకీయ జీవితానికి అడ్డొస్తాడోనని సూరికి విప్లవ పార్టీలతో వున్న సంబంధాలను పోలీసులకు వెల్లడించిన వారి సాయంతోనే అతన్ని కడతేర్చారు. ఫలితంగా పరిటాల శ్రీరాములు కుటుంబంలో కేవలం పరిటాల రవి మాత్రమే మిగిలారు. తనను కూడా ఎక్కడ అంతం చేస్తారోనని రవి కొంతకాలం పాటు అజ్ఞాత జీవితం గడిపారు. ఈ సమయంలోనే రవి పీపుల్స్‌వార్ నాయకులు, ప్రజల సానుభూతి పొందారు. పగ సాధించడానికి నక్సలైట్లు ముందడుగు వేశారు. ఓరోజు తెల్లవారుజామున బస్సు దిగి వెళ్తున్న నారాయణరెడ్డి (మద్దులచెరువు)ను వెంటాడి హత్య చేశారు. నారాయణరెడ్డికి ఒక కుమారుడు. పేరు సూర్యనారాయణరెడ్డి (సూరి). సూరిని కూడా హతమార్చాలనుకున్నారు. పాడైన టి.విని రిపేర్ కోసం అనంతపురం పంపగా, దానిని బాగుచేసి తిరిగి పంపిస్తున్నట్లుగా పథకాన్ని రూపొందించి

టి.విలో బాంబు పెట్టి బస్సులో పంపారు. టి.విని తీసుకున్న సూరి ఇంటిలోని వారు దానిని ఆన్ చేయగా విస్ఫోటనం సంభవించి ఇల్లంతా నేలమట్టమయ్యింది. సూరి ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో ప్రాణాలతో బతికిపోయారు.

పరిటాల శ్రీరాములు మరో ప్రత్యర్థి అయిన సానే చెన్నారెడ్డిని పట్టపగలు తన స్వగృహంలోనే పేపర్ చూస్తుండగా హతమార్చారు. సానే చెన్నారెడ్డికి ఇద్దరు కుమారులు. ఒకరు ఎస్వీ రమణారెడ్డి, మరొకరు ఓబుల్‌రెడ్డి. ఓబుల్‌రెడ్డిని బంజారాహిల్స్ రోడ్‌లోని మహేశ్వరీ టవర్స్‌లో దారుణంగా ముక్కలు ముక్కలుగా వేటకొడవళ్లతో నరికి ప్రతీకారం తీర్చుకున్న సంగతి తెలిసిందే. యస్వీ రమణారెడ్డి యిప్పుడు సానే చెన్నారెడ్డి కుటుంబంలో మిగలగా, మద్దులచెరువు సూర్యనారాయణరెడ్డి కుటుంబంలో సూర్యనారాయణరెడ్డి, పరిటాల శ్రీరాములు కుటుంబంలో రవితో పాటు ఒక్కొక్క కుటుంబానికి ఒక్కరు మాత్రమే మిగిలారు. యింకా ఈ కక్షల కార్చిచ్చు ఆరలేదు. పరిటాల రవిని హతమార్చడం కోసం ఫియట్ (సికెఎం 646) కారులో బాంబుపెట్టి పేల్చివేసిన దారుణ విస్ఫోటనం సంఘటన తెలిసిందే. ఈ సంఘటనకు బాధ్యుడైన మద్దెలచెరువు సూర్యనారాయణరెడ్డి (సూరి)ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ చిచ్చు ఆరేదెన్నడో?

## రక్తపు మరకల చరిత్ర

కడప జిల్లా రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గంలో 1989 నవంబరులో జరిగిన ఎన్నికల్లో రక్తపాతం జరిగింది. పోలింగ్ రోజున తెల్లవారుజామున ఇండిపెండెంట్ అభ్యర్థి ఆవుల సుబ్బారెడ్డిని దారుణంగా హత్య చేశారు. ఈ ఎన్నికలను అటు కాంగ్రెస్‌వారు, ఇటు తెలుగుదేశం వారు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పోలింగ్‌రోజున తెల్లవారుజామున అమాయక వృద్ధుడైన ఇండిపెండెంట్ అభ్యర్థి ఆవుల సుబ్బారెడ్డిని జీపులో తీసుకెళ్లి సంబేపల్లికి అతి సమీపంలో అతిదారుణంగా హత్య చేశారు. అప్పటికే జిల్లా కేంద్రాల్లో ఓటింగ్ కూడా ప్రారంభమైంది. ఇండిపెండెంట్ అభ్యర్థి హత్యతో ఓటింగ్‌ను నిలిపివేశారు.

అదేరోజు సంజీవనగర్ కాలనీ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల నిర్వహణకు వచ్చిన పోలింగ్ అధికారి అహమదుల్లా బాషాను అతి క్రూరంగా పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఈ సందర్భంలో దుండగులను అడ్డుకోబోయిన మరో పోలింగ్ అధికారి సురేష్‌బాబు చేయి నరికివేశారు. అదేరోజు ఉదయం విద్యార్థి సాధు ఆనందరెడ్డిని కాల్చి చంపారు. ఇలా ఒకటేరోజు, ఒకే నియోజకవర్గంలో మూడు సంచలనాత్మక హత్యలు జరిగాయి. 1996 జూన్ 20న కర్నూలులో మద్దూరు సుబ్బారెడ్డి హత్య

కూడా సంచలనం సృష్టించింది. నంద్యాల పార్లమెంట్ మాజీ సభ్యుడు మద్దూరు సుబ్బారెడ్డి (80) కాంగ్రెస్ పార్టీకి చెందినవారు. వీరు తమ స్వగ్రామం బ్రాహ్మణకొట్కూరుకు వెళ్లడానికి మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్‌లో కర్నూలు ఒకటవ డిపోకు చెందిన 9 ఎ 7257 ఆర్టీసీ డీలక్స్ బస్‌లో బయలుదేరారు. రాత్రి 7.30 గంటలకు బస్ కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుంది. బస్‌లోంచి మద్దూరు సుబ్బారెడ్డి దిగి ఒక అడుగు ముందుకు వేయగానే పొంచివున్న ఇద్దరు వ్యక్తులు రెండు బాంబులు వేశారు. దీనితో సుబ్బారెడ్డి తల ఎగిరిపోయింది. ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సీమలో రక్తపుమరకల చరిత్రకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే!

## ముఠా కక్షలు!

లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత సీమలో క్రమక్రమంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. ఎవరికి వారు ముఠాలను కూడగట్టడంలో నిమగ్నమై వున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తమ ఆధిక్యత కాపాడుకోవడానికి, ప్రత్యర్థులను అణచివేయడానికి నిరంతరం తపిస్తూంటారు. ఈ విధానం వల్లే ప్రతి గ్రామంలోనూ రెండు గ్రూపులు మనకు కనిపిస్తాయి. కేవలం ఒక కర్నూలు జిల్లాలోనే 300 గ్రామాలు ముఠా కక్షల కోరల్లో చిక్కుకుని వున్నాయి. గతంలో కర్నూలు జిల్లాలో అశాంతికి కారణం అవుతున్న నేతలకు రాష్ట్ర హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 25 మంది ఫ్యాక్షన్ నేతలపై 197 కేసులు నమోదయ్యాయి.

బైరెడ్డి రాజశేఖరరెడ్డి, కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, భూమానాగిరెడ్డి, గంగుల ప్రతాప్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిలు కూడా కోర్టు నుండి షోకాజ్ నోటీసులు పొందడంతో రాజకీయ వర్గాల్లో సంచలనం కల్గించింది. 1996 ఏప్రిల్ 18న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు పాటల్ శేషిరెడ్డిని దారుణంగా ముఠా కక్షలు హత్య చేశాయి. రెండుగంటల సేపు బాంబులతో అతని కార్యాలయంపై దాడి చేసి ఇంటిపై కప్పు నుంచి లోపలికి ప్రవేశించి శేషిరెడ్డి, పరప్పనాయుడులను బలి తీసుకున్నారు. శేషిరెడ్డి చేతివేళ్లు, కాళ్లు వేటకొడవళ్ల పదునుకు తెగిపడగా, పరప్పనాయుడి పొట్టపై బాంబులు వేయడంతో మాంసం, ప్రేగులు బయటపడ్డాయి. పాతకక్షలే ఈ హత్యలకు కారణం. రాజకీయ కురువృద్ధుడు మద్దూరు సుబ్బారెడ్డి హత్య విషయానికొస్తే సుబ్బారెడ్డి కుటుంబానికి శేషశయనారెడ్డి కుటుంబాల మధ్య వర్గ తగాదాలు ఎప్పటినుండో వున్నాయి. నందికొట్కూరు ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి మద్దూరు సుబ్బారెడ్డి హత్యకేసులో ప్రధాన నిందితునిగా వున్నాడు. ఫ్యాక్షన్ పంజా విసిరిన ప్రతిసారీ ప్రజలు తల్లడిల్లిపోతారు. ఫ్యాక్షన్ వర్గాలతో ఎలాంటి సంబంధంలేని అమాయకులు

ఈ ఘర్షణలో తమ ఆస్తుల్నే కాకుండా, ప్రాణాలను కూడా కోల్పోతున్నారు. దాడులు జరిగిన ప్రతిసారి ఒక వర్గం వారు ఆస్తుల్ని పోగొట్టుకుని నిరాశ్రయులు కాగా, మరోవర్గం వారు ప్రత్యర్థులు ఎప్పుడు మళ్లీ పంజా విసురుతారోనని ప్రాణాల్ని గుప్పిట్లో పెట్టుకొని కాలం వెళ్లదీస్తుంటారు. సీమలో ఎన్నికలంటే భయం. ఎందుకంటే ఎన్నికల ముందు హత్యలు జరుగుతాయి. ఎన్నికల రోజు హత్యలు జరుగుతాయి. ఎన్నికలు అయిపోయిన అనంతరం హత్యలు జరుగుతాయి. యిక ఆస్తుల విషయానికి వస్తే ఎన్ని గ్రామాలు మరుభూములవుతాయో, ఎన్ని నివాసాలు దగ్ధమౌతాయో, ఎన్ని చీనీ తోటలు తెగిపడతాయో... చెప్పలేం...

## అడుగంటిన పారిశ్రామిక ప్రగతి!

కరువు కాటకాలకు నిలయమైన రాయలసీమలో కక్షలు, కార్పణ్యాలు మాత్రం పెరుగుతున్నాయి. కాని పారిశ్రామిక ప్రగతి మాత్రం పెరగలేదు. సహజ వనరులు ఎన్నో ఉన్నా వాటిని ఆధారంగా చేసుకొని పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చేవారు ఫ్యాక్షనిస్టుల దెబ్బకు బెదిరిపోతున్నారు. రాజకీయ నాయకుల ప్రాబల్యం, పోరాటాలతో – నిరుద్యోగులు, కార్మికులు సమిధలవుతున్నారు. కేవలం ఒక్క కడప జిల్లాలోనే దాదాపు 30 నుంచి 40 శాతం చిన్న, పెద్ద పరిశ్రమలు మూతపడ్డాయంటే పరిస్థితి ఎలా వుందో ఊహించుకోవచ్చు.

కార్మిక సంఘాలకు నాయకులుగా వుంటున్నవారిలో ఎక్కువ శాతం వ్యక్తులు యాజమాన్యాలను భయపెట్టి, బెదిరించి పరిశ్రమలలోని టెండరు పనులు, కాంట్రాక్టు పనులు బినామీ పేర్లతో తీసుకుని లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. తమ పనులకు అడ్డొస్తే దౌర్జన్యం తప్పదు. 1997 26వ తేదీన జువారి సిమెంట్స్ యాజమాన్య అధ్యక్షుడు ఓంప్రకాష్ జగేటియాను ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్లో మారణాయుధాలతో దాడిచేసి గాయపర్చిన సంఘటన అన్ని పరిశ్రమలలో సంచలనం రేపింది. కడప జిల్లాలో చెన్నూరు చక్కెర కర్మాగారం, ప్రొద్దుటూరు పాలశీతలీకరణ ఉత్పత్తి కేంద్రం, రంకా కేబుల్స్, ఆంధ్రా కేబుల్, ఆంధ్రా కాటన్మిల్లు, పెన్నా కాటన్ మిల్లు, ప్యాకేజింగ్, పెన్నా పేపర్ మిల్లులు ఇబ్బందుల్లో వున్నాయి. అనంతపురం జిల్లాలో గుంతకల్లు స్పిన్నింగ్ మిల్లు, ఎ.పి. లైటింగ్స్ సంస్థలు మూతపడ్డాయి. తాడిపత్రి ప్రాంతంలో ఎల్అండ్టి సిమెంట్ కర్మాగార యజమానులు యిక్కడి ఫ్యాక్షన్ రాజకీయాలకు విసిగిపోయి కొంతకాలం పాటు తమిళనాడుకు వెళ్లిపోవడం, జువారి సిమెంట్ కర్మాగారం ఉన్నతాధికారి రామాంజనేయరెడ్డి ఇంటిపై బాంబుదాడి, చిలమకూరులోని కోరమాండల్ సిమెంట్ ఫ్యాక్టరీలో దాడులు ఇక్కడి పారిశ్రామిక ప్రగతికి అవరోధంగా నిలిచాయి.

చిలమకూరు, కలమల్ల గ్రామాల మధ్య సిమెంట్ పరిశ్రమ నిర్మించేందుకు 'సీబా' అనే సంస్థ 4.50 కోట్ల రూపాయలు వెచ్చించి భూముల సర్వే పనులు పూర్తి చేసినప్పటికీ ఇక్కడి ఫ్యాక్షనిజానికి బెదిరి ఆ ప్రాజెక్టును నిలుపు చేసింది.

పాడిపరిశ్రమతో అభివృద్ధి చెందిన గ్రామాల్లో ఫ్యాక్షన్ వ్యవస్థ చెలరేగి పరిశ్రమను పూర్తిగా మట్టుబెట్టేందుకు బాటలు వేసింది. ఒకప్పుడు పాలు ఏరులై పొంగిన గ్రామాల్లో నిత్యం జరిగే నెత్తుటేరుల కారణంగా పాడిపరిశ్రమ పూర్తిగా కనుమరుగైపోయింది. ప్రొద్దుటూరు పాలఫ్యాక్టరీ మూతపడటంతో దీనిపై ఆధారపడి జీవిస్తున్న ఎన్నో కుటుంబాలు రోడ్డునపడ్డాయి. గుంతకల్లులోని స్పిన్నింగ్ మిల్లు మూతపడటంతో 1300 మంది కార్మికులు ఉపాధి పోగొట్టుకుని నిరుద్యోగులయ్యారు. సీమలో బంగారం, వజ్రాలు, ఇనుము, ఆస్‌బెస్టాస్, బెరైటీస్ గనులు వున్నాయి.

ఈ గనుల నుండి ప్రతి సంవత్సరం 45 లక్షల టన్నుల ఖనిజాలు వెలికితీస్తున్నా దానిలో కొంతశాతం మాత్రమే యిక్కడి పరిశ్రమలు వినియోగించుకుంటున్నాయి. మిగిలిన సంపదంతా ప్రక్క రాష్ట్రాలకు తరలిపోతోంది. రామగిరి ప్రాంతంలో గాలిమరల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు కూడా ఫ్యాక్షనిస్టులే అడ్డు తగులుతున్నారు. ఫలితంగా యిక్కడ ఎన్ని వనరులు వున్నప్పటికీ పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించాలంటే పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదు.

## హైకోర్టుకు జిల్లా జడ్జి నివేదిక 'అనంత'లో రాజకీయ రక్తపాతం!

హత్యకు గురైనవారి వివరాలను జిల్లా జడ్జి తన నివేదికలో పొందుపరిచారు.

హతుల వివరాలివీ.

- బుక్కరాయసముద్రం మండలానికి చెందిన శివయ్యను హత్య చేశారు. ముక్కామల చిన్నవెంకటరెడ్డి సహా 20 మంది నిందితులు.
- ఎర్రిస్వామి 2001 స్థానిక ఎన్నికల్లో ఆయన అల్లుడు బోయమండలం నాగార్జున కనేకల్ మండలం హణకనహాల్ పంచాయతీ సర్పంచ్ పదవికి పోటీ చేశారు. నాగార్జున తరపున మామ ఎర్రిస్వామి విస్తృత ప్రచారం చేస్తుండడంతో బోరు వద్ద వివాదాన్ని అడ్డుపెట్టుకుని ముగ్గురు 2004 మే 30న హత్య చేశారు.
- ధర్మవరంలో సుధాకర్‌రెడ్డి మద్దతుదారులు సలీం బాషాను హత్య చేశారు.

- కూడేరు మండలం గొట్కూరులో చల్లా శ్రీనివాసులుకు, నాగిరెడ్డికి రాజకీయ వైరం ఉంది. 2004 జూన్ 25న శ్రీనివాసులుపై 28 మంది దాడి చేసి హత్య చేశారు.
- బుక్కపట్నం మండలం కొత్తకోట సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, నాయకుడు నరసింహులును రాజకీయ కక్షలతో అపహరించుకెళ్లి 2004 జూన్ 26న నరికి చంపారు.
- సోమందేపల్లికి చెందిని మదన్‌మోహన్ 2004 జులై 27న హిందూపురం వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తరపున చురుగ్గా ప్రచారం చేసినందునే ఈ హత్య జరిగిందని ఆరోపణలున్నాయి.
- రెండు వర్గాల మధ్య రాజకీయ, ఫ్యాక్షన్ కక్షల నేపథ్యంలో వజ్జల మల్లికార్జున, మరో 9 మంది 2004 ఆగస్టు 14న పావురాల కిష్ట, పావురాల రాజాలను హత్య చేశారు.
- తలుపుల మండలానికి చెందిన పరిశెట్టి రామకృష్ణ అసెంబ్లీ ఎన్నికల్లో చురుగ్గా ప్రచారం నిర్వహించారు. 2004 సెప్టెంబర్ 5న ఆవుల మనోహర్‌రెడ్డి, మరో 10 మంది కలిసి ఆయన్ను హత్య చేశారు.
- తరగకుంట ప్రభాకర్ తెదేపా నేత పరిటాల రవీంద్రకు అనుచరుడు. రవీంద్ర మద్దెలచెర్వు సూరి కుటుంబాల మధ్య దీర్ఘకాలంగా విరోధం వుంది. శత్రు నిర్మూలనలో భాగంగా మొద్దుశీను తదితరులు పథకం ప్రకారం 2004 సెప్టెంబర్ 5న తగరకుంట ప్రభాకర్‌ను హత్య చేశారు.
- వాసుదేవరెడ్డి, బసయ్యగారి సుధాకర్‌రెడ్డి ఒకే పార్టీలో ఉండేవారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో వాసుదేవరెడ్డిని తాడిపత్రిలో 2004 డిసెంబరు 9న సుధాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి హత్య చేశారు.
- ఎమ్మార్పీయస్‌కు చెందిన గంగులప్ప ఎమ్మెల్సీ పల్లె రఘునాథరెడ్డికి మద్దతుదారు. పూలకుంటపల్లి సర్పంచి ఎం.శివారెడ్డికి, గంగులప్పకు గ్రామ ఆధిపత్యం, కాంట్రాక్టుల విషయాల్లో వివాదాలు ఉన్నాయి. 2004 డిసెంబరు 14న గంగులప్పను హత్య చేశారు. ఇందులో 13 మంది నిందితులు వున్నారు.
- తెలుగుదేశం ఎమ్మెల్యే పరిటాల రవీంద్ర, మల్లకాల్వ ఈశ్వరయ్యలను

2005 జనవరి 24న హత్య చేశారు. రవీంద్ర తెలుగుదేశం పార్టీ సమావేశంలో పాల్గొని కార్యకర్తలు కేశవయ్య, ఈశ్వరయ్యలతో కలిసి వస్తుండగా కాల్పులు జరపడంతో పరిటాల, ఈశ్వరయ్యతో పాటు గన్‌మెన్ మహబూబ్‌బాషా కూడా చనిపోయారు. దీనికి కాంగ్రెస్ నేత సూరి కుట్రదారు కాగా, మొద్దుశీను, మరో 14 మంది నిందితులుగా వున్నారు.

- శ్రీనాథ్‌గౌడ్, చిన్నవెంకటరెడ్డి వర్గాల మధ్య పదేళ్లుగా విబేధాలు వున్నాయి. రాజకీయ, ఫ్యాక్షన్ వైరాల నేపథ్యంలో చిన్న వెంకటరెడ్డి, మరో 12 మంది 2005 ఫిబ్రవరి 3న శ్రీనాథ్‌గౌడ్‌ను హత్య చేశారు.
- పెనుకొండ మండలం బండ్లపల్లికి చెందిన రామాంజనేయులు అసెంబ్లీ ఎన్నికల్లో ఏజంట్‌గా ఉన్నాడు. గొల్ల మురళి, మరో నలుగురు ఆయనతో గొడవ పెట్టుకుని 2005 మే 26న తీవ్రంగా కొట్టి గాయపరిచారు. చికిత్స పొందుతూ మే 29న మృతి చెందాడు.
- రాజేంద్రనాథ్‌రెడ్డి మాజీ గ్రామ పరిపాలనాధికారి (వీఏవో). తాడిపత్రి మండలానికి చెందిన ఎం.పుల్లారెడ్డి వర్గంతో దీర్ఘకాలంగా రాజకీయ విబేధాలున్నాయి. 2006 మార్చి 8న పుల్లారెడ్డి, మరో ఐదుగురు కలిసి రాజేంద్రనాథ్‌రెడ్డిని హత్య చేశారు.
- మాజీ ఎమ్మెల్యే సూర్యప్రతాప్‌రెడ్డి (సూరీడు) తెలుగుదేశంలో కీలకమైన నాయకుడు. యల్లనూరు మండలం వెన్నపూసపల్లికి చెందిన కాంగ్రెస్ నేత బి.నారాయణరెడ్డితో శత్రుత్వం వుంది. తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో ఈ ఏడాది జనవరి 10న ఎస్.లోకేశ్వర్‌రెడ్డి, మరో 21 మంది మూకుమ్మడిగా బాంబులతో దాడి చేసి సూరీడును హత్య చేశారు.
- బోయ రామాంజనేయులు అనంతపురం మున్సిపాలిటీలో మాజీ వార్డు సభ్యుడు. కాంట్రాక్టు, అభివృద్ధి పనుల పంపిణీలో తలెత్తిన విబేధాలతో టి.శంకరయ్య మరో 11 మంది బాంబులతో దాడి చేసి హతమార్చారు.
- పెద్దపప్పూరు మండలంకు చెందిన రాంభూపాల్‌రెడ్డిని, రెడ్డమ్మగారి భాస్కర్‌రెడ్డి, మరో 13 మంది హత్య చేశారు.
- రొద్దం మండలానికి చెందిన హరిజన సన్నప్పయ్య ఆయన కుమారులు ఎంపీటీసీ ఎన్నికల్లో మద్దతు తెలిపారు. సన్నప్పయ్య తోటలో నిద్రపోతుండగా గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు.

- ధర్మవరం మండలంలో ఎ.నారాయణస్వామిని, ఎం.భాస్కర్ మరో ఏడుగురు హత్య చేశారు. ఎలుకుంట్ల గ్రామం చౌకధరల దుకాణం డీలర్‌షిప్ విషయంలో వీరికి వివాదం ఉంది.
- అనంతపురం జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో జరిగిన హత్యలకు తన పిటిషన్‌లో ప్రస్తావించింది. వాటిలో కొన్ని...
- చిత్తూరు జిల్లా గుడిపాల మండల మద్రాసు బాబు అలియాస్ వి.కె.విజయ్‌కుమార్ అదృశ్యమైన మూడు రోజులకు అతణ్ణి యాసిడ్ పోసి తగులబెట్టిన విషయం బయటపడింది.
- కడప జిల్లా కొండాపురం మండలానికి చెందిన జిర్రాపెద్ద గంగరాజు, కృష్ణయ్యలను ప్రత్యర్థులు పట్టపగలే దారుణంగా హత్య చేశారు.
- కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలంలో వి.బ్రహ్మరుద్రారెడ్డిని ప్రత్యర్థులు బాంబులు వేసి, కత్తులతో పొడిచి అతి క్రూరంగా హత్య చేశారు.



**ప్రాణ హాని వుందన్నారు!**

"నా భర్త అంగరక్షకులుగా ముసలివారిని, చేతకానివారిని ఇచ్చారు. వారికి తుప్పుపట్టిన తుపాకులిచ్చారు. వీరి వల్ల తన ప్రాణాలకు రక్షణ ఉండదని నా భర్త భావించబట్టే ప్రైవేట్ వ్యక్తులను నియమించుకున్నారు. తన ప్రాణాలకు హాని వుందని పసిగట్టి ప్రధానికి కూడా నివేదించుకున్నారు. స్వయంగా వారే టీవీ ఛానళ్లకు వెల్లడించారు. ఆయన్ను రోడ్డు మీద నిలబెట్టి సోదాలు చేశారు. పులివెందులకు 15 వాహనాల్లో వెళ్తుంటే వాటిని అడుగడుగునా తనిఖీ చేశారు. ఇంటికొచ్చి ఆయన ఫైళ్లన్నింటినీ పట్టుకెళ్లిపోయారు. వాటిని ఇప్పటికీ తిరిగివ్వలేదు. పరిటాల హత్య కేసును సీబీఐకి అప్పగించామన్నారు. కాని వారు ఏం చేశారు?"

***– రవి హత్యోదంతంపై శాసనసభలో చర్చలో పరిటాల సునీత.***

# పరిటాల రవిపై నేరారోపణలు

మధ్యతరగతి వ్యవసాయదారుల కుటుంబం నుంచి వచ్చిన పరిటాల రవీంద్ర చాలా తక్కువ కాలంలోనే అగ్రస్థాయి రాజకీయ నాయకుడిగా ఎదిగారు. ఆయన తాత, తండ్రి చిన్నస్థాయి వ్యవసాయదారులుగా ఉంటూ ఆ ప్రాంతంలోని రెడ్డి ఫ్యాక్షన్ నాయకులకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు. రైతులు, రైతు కూలీలు, ఇతర వృత్తుల మీద ఆధారపడి జీవిస్తున్న సామాన్య ప్రజానీకం నుంచి బలవంతంగా డబ్బు లాగడం, ముక్కు పిండి పన్నులు వసూలు చేయడమనే దుష్ట సంప్రదాయం వందల ఏళ్ల నుంచి ఇంకా కొనసాగడాన్ని వారు వ్యతిరేకించారు. ఆ దుష్ట సంస్కృతి ఒక్క అనంతపురం జిల్లాలోనే కాకుండా రాయలసీమ ప్రాంతంలోని చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లో కూడా సాధారణమైపోయింది. ఈ సంస్కృతి సాధారణ ప్రజలను ముఠా నాయకులకు విధేయులుగా మారేందుకు ప్రేరేపించింది. దాంతో ఈ ప్రాంతంలో అభివృద్ధి అడుగంటి వెనుకబాటుతనం, నిరుద్యోగం పెరిగిపోయాయి.

రవి కూడా కొన్నేళ్లు నక్సలైట్ జీవితాన్ని గడిపిన తరువాత తన తాత తండ్రుల మార్గాన్నే అనుసరించారు. తండ్రి, సోదరుడు హరిల మార్గంలోనే మొదట నక్సలైట్‌గా మారి, ఆ తరువాత ముఠా నాయకులను ఎదిరించడానికి సిద్ధపడిన రవి కాలక్రమంలో తానే ఒక ముఠా నాయకుడిగా మారిపోయారు. నక్సలైట్ శ్రేణుల నుంచి వైదొలగిన తరువాత ఆయన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్.టి.రామారావు ఆహ్వానం మీద ఆ పార్టీలో చేరిపోయారు. మొదటిసారి శాసనసభ్యుడుగా ఎన్నికైన వెంటనే రవిని ఎన్‌టిఆర్ కార్మికశాఖ మంత్రిని చేశారు. ఆయన మీద హత్య, లూటీలు, హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడిన ఆరోపణలపై 40 పైచిలుకు కేసులు నమోదయ్యాయి. పోలీసులకు కూడా ఆయనంటే భయం ఉండడంతో వాటిల్లో చాలా కేసులు పరిశోధనలకు కూడా నోచుకోలేదు. సాక్ష్యాలు లభ్యం కాని కారణంగా కొన్ని కేసుల్ని కొట్టేయడం జరిగింది. రవిపై అనంతపురం జిల్లాలోని అనంతపురం పట్టణం, కనగానిపల్లి, రామగిరి, పెనుగొండ, రొద్దం, సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయి. ఈ కేసులన్నీ దర్యాప్తులో ఉన్నాయి.

- 1983 జూన్ 12 అనంతపురంలో మాజీ శాసనసభ్యుడు మద్దెలచెరువు నారాయణరెడ్డిని హత్య చేసిన కేసులో రవి పేరు ప్రముఖంగా వినిపించింది. ఆయనను వెంట తరిమి కిరాతకంగా హత్య చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.
- 1993 అక్టోబర్ 24న మద్దెలచెరువు సూర్యనారాయణరెడ్డి తల్లిని, ఇతర కుటుంబ సభ్యులను టీవీ బాంబు పేల్చి హత్య చేశారు. ఈ హత్యలో

సూర్యనారాయణరెడ్డి తప్పించుకోగలిగారు. ఈ కేసులో రవిని, మరో ఆరుగురిని ప్రధాన నిందితులుగా నమోదు చేశారు.

- 1996 ఏప్రిల్ 7న సోమందేపల్లిలో కాంగ్రెస్ నాయకుడు రమాకాంత్‌రెడ్డిపై దాడి జరిగిన కేసులో రవి పేరుంది.
- జూలై 1998లో రంగారెడ్డి అనే వ్యక్తిని అపహరించి హత్య చేసిన ఆరోపణపై ఐ.పి.సి. 354, ఆర్.డబ్ల్యు. 34 కింద కేసు దర్యాప్తులో వుంది.
- 2000 మార్చి 16వ తేదీన అనంతపురంలో గోనుగుంట్ల సూర్యనారాయణ అనే కాంట్రాక్టర్ ఇంటి పైన రవి వర్గానికి చెందినవారు పెద్ద ఎత్తున దాడి జరిపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ కేసు పైన కూడా దర్యాప్తు జరుగుతోంది.
- 2000 ఏప్రిల్ 24వ తేదీన హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ దగ్గర జంటహత్యలు జరిగాయి. ఈ కేసులో కూడా పరిటాల రవీంద్రతో పాటు మరో ఆరుగురి మీద కేసులు నమోదయ్యాయి.
- ఇటీవల రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏజంట్‌గా పనిచేసిన గంగాధర్‌ను అపహరించి హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి.
- సి.కె.పల్లెకు చెందిన వెంకటాంపల్లికి చెందిన కమ్మరి సూరి అదృశ్యం పైన గత సెప్టెంబర్ మూడో వారంలో కేసు నమోదు చేశారు.
- రొద్దం మండలం గౌరాజుపల్లికి చెందిన భాస్కరరెడ్డిని కిడ్నాప్ చేసి, హత్య చేసిన ఆరోపణపై ఐ.పి.సి. 354 కింద కేసు నమోదు చేశారు.

## దర్యాప్తులో ఉన్న కేసులు

- ఆయుధాలు కలిగి ఉండడం, అపహరణలు, బలవంతపు వసూళ్లకు సంబంధించి సుమారు 40 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో దర్యాప్తులో ఉన్నాయి.
- 1983 జూన్ 12వ తేదీన మద్దెల చెరువు నారాయణరెడ్డిని అనంతపురంలో హత్య చేశారు. 1993 అక్టోబర్ 24వ తేదీన నారాయణరెడ్డి తల్లిని, ఇతర కుటుంబ సభ్యులను టీవీ బాంబుతో హత్య చేశారు.
- 2000 ఏప్రిల్ 24వ తేదీన హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలో ఇద్దరిని హత్య చేసినట్లు రవిపై ఆరోపిస్తూ కేసు నమోదైంది.

# పరిటాల రవి హత్య కేసు
# ప్రాథమిక సమాచార నివేదిక

మహారాజశ్రీ అనంతపురం 2 టౌన్ పోలీస్ స్టేషన్ వారికి రామగిరి మండలం, వెంకటపురం వాస్తవ్యుడు, ధర్మగిరి కొండన్న రాయించిన ఫిర్యాదు – అయ్యా, ఈ రోజున, అనగా 24.01.2005న జిల్లా పార్టీ సమావేశం ఉదయం 11.30 గంటలకఉ అనంతపురం టౌన్‌లో జిల్లా జడ్జీ బంగ్లా ఎదురుగా ఉన్న తెలుగుదేశం పార్టీ ఆఫీసులో జరుగుతుండెను. పెనుగొండ ఎం.ఎల్.ఏ. అయిన నా అల్లుడు పరిటాల రవీంద్ర ఈ సమావేశానికి వెంకటాపురం నుంచి మూడు జీపుల్లో బయలుదేరారు. ఆయన వెంట నేను, హెచ్.హనుమప్ప, హరిజన నాగేషు, వడ్ల శంకరప్ప, డ్రైవర్ రాము, పేరురు ముత్యాలు, పూర్ణయ్య, అయిదుగురు గన్‌మెన్‌లతో బయలుదేరి పార్టీ ఆఫీసుకు ఉదయం 11.30 గంటలకు చేరుకొన్నాము. పార్టీ రాష్ట్ర నాయకులైన కె.కళావెంకట్రావు, బి.గోపాలకృష్ణారెడ్డి, రుమాండ్ల రామచంద్రయ్య, యూసెఫ్ అలీ, శోభా నాగిరెడ్డి, పార్లమెంటు సభ్యురాలు దుర్గ, మరికొందరు వచ్చి ఉన్నారు.

స్థానిక తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చినారు. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో సమావేశం అయిపోయి భోజన విరామం ఇచ్చారు. నా అల్లుడు పరిటాల రవీంద్ర, నేను, గన్‌మెన్‌లు మా వెంట వచ్చినవారు అందరం కలిసి భోజనం చేశాము. అందరం నా అల్లుడితో పాటు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో అనంతపురంలోనే ఉన్న మా ఇంటికి వెళ్లేందుకు ఆఫీస్ గేట్ బయటకు వెళ్లగా, మా గన్‌మెన్ మాదిరిగా సఫారీ డ్రెస్‌లో ప్యాంట్లు, బ్యాగులు వేసుకొని ఉన్న ఆరుగురు రివాల్వర్లు, పిస్టళ్లు పట్టుకొని, ఒకరు బాంబు పట్టుకొని చుట్టుముట్టారు. నా అల్లుడు పరిటాల రవి పైనా, ఇతరుల పైనా కాల్పులు జరిపారు. అదే సమయంలో ఒకరు బాంబు వేయగా, పెద్దగా శబ్దం వచ్చింది. జనం చెల్లా చెదురయ్యారు. నా అల్లుడు పరిటాల రవీంద్ర, గన్‌మెన్ బాషా అక్కడే పడిపోయారు. తెలుగుదేశం కార్యకర్త ఈశ్వరయ్య కూడా పడిపోయాడు. ఇంకా కొదరికి గాయాల య్యాయి. కేశవులు, అబ్దుల్ ఘనీ, ముత్యాలుకు బుల్లెట్ గాయాలయ్యాయి. నా అల్లుడు పరిటాల రవీంద్రకు కుడి కన్ను, ఎద, ముఖంపై బుల్లెట్ గాయాలై కుప్పకూలి చనిపోయాడు. అప్పుడు వందలమంది ప్రత్యక్షంగా చూశారు. ఈ కాల్పులు జరిపిన వారిని నేను చూస్తే గుర్తు పట్టగలను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జెయిల్లో ఉన్న మద్దెలచెరువు సూర్యనారాయణరెడ్డి (సూరి), ఆయన భార్య గంగుల భానుమతి, తగరకుంట కొండారెడ్డి కుట్రతో నా అల్లుడిని ఆరుగురితో చంపించారు. జగన్మోహన రెడ్డి, సూరి, జెసి దివాకరరెడ్డి, ఒక పోలీసు ఉన్నతాధికారి కుట్ర చేసి తనను చంపేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అందుకు ఆధారాలున్నాయని మా అల్లుడు చెప్పేవాడు. విచారించి చట్టరీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నాను.

ఇట్లు: **ధర్మవరపు కొండన్న.**



# రాజారెడ్డి హత్య
## కారుపై బాంబులేసి...

అర్ధశతాబ్దం క్రితం బలపనూరులో ఎడగూరు వెంకటరెడ్డి కుటుంబం నివాసం వుండేది. వెంకటరెడ్డి ఇళ్లు సందులో వుండడం వల్ల వీరికి సందింటివారని పేరు వచ్చింది. వెంకటరెడ్డికి ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. వారిలో నాల్గవ కుమారుడు వై.ఎస్.రాజారెడ్డి. 29 మే 1925లో జన్మించారు. పులివెందుల నియోజకవర్గంలో తిరుగులేని రాజకీయనేతగా ఎదిగిన వై.ఎస్.రాజారెడ్డి హత్య సీమలో ఫ్యాక్షన్ జాడ్యాన్ని మరోసారి హెచ్చరించింది. తనకెంతో ఇష్టమైన వేంపల్లి మండలంలోని ఇడుపుల పాయ ఎస్టేట్ నుంచి తిరిగి పులివెందులకు వస్తున్న సమయంలో కాపుకాచి ప్రత్యర్థులు బాంబు దాడికి పాల్పడ్డారు. ముందస్తుగా ఖరారు చేసుకున్న వ్యూహం ప్రకారం ప్రత్యర్థులు రోడ్డుకు ఇరువైపులా వుండే కంపచెట్లలో దాక్కొని వేముల వద్ద రాజారెడ్డి ప్రయాణిస్తున్న కారుపై నాటుబాంబులతో దాడి చేశారు. తలపైన పడిన బాంబు కారణంగా రాజారెడ్డి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. 1998 మే 23న జరిగిన ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనాన్ని రేకెత్తించింది.

### నా తండ్రిని చంపినవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు

"నా తండ్రిని హతమార్చిన వారిపైన ఎలాంటి ప్రతీకార చర్యలు చేపట్టలేదు. వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అసలు వారిని ఏదో చేయాలన్న ఆలోచనలు నాకు రావు. అలాంటప్పుడు కనీసం పొలం గట్టు తగాదా కూడా లేని పరిటాలపై ఎందుకు ప్రతీకారానికి పాల్పడతాం? పరిటాలది, మాది వేర్వేరు జిల్లాలు. మా మధ్య ఎటువంటి ఘర్షణలు లేవు. నా కుమారుడు చేసిన తప్పల్లా పెనుకొండ, తాడిపత్రిలకు యువజన కాంగ్రెస్ వారు పిలిస్తే వెళ్లడమే. అప్పట్లో పరిటాల ఏదో అంటే జగన్ కోర్టులో పరువునష్టం దావా వేశారు. పరిటాల హత్యకు గురైనప్పుడు నేను అనకాపల్లిలో వున్నాను. ఆ రోజు సాయంత్రం చంద్రబాబు గవర్నరును కలిసి సీబీఐ విచారణ కోరారు. నా కుమారుడికి ఏమాత్రం సంబంధం ఉందనుకున్నా సీబీఐ విచారణ ఎందుకు వేయిస్తాం? అప్పట్లో రవి, నేను మాట్లాడుకునేవాళ్లం. అలాంటప్పుడు ఎందుకు చంపుకుంటాం?"

**– రవి హత్యోదంతంపై శాసనసభలో చర్చలో వైఎస్ రాజశేఖరరెడ్డి**



## ఫ్యాక్షన్‌తో ప్రారంభం... ఫ్యాక్షన్‌తోనే అంతం!

నలభై ఏళ్లుగా కప్పట్రాళ్ల అనుక్షణం ఒక యుగంలా బతికారు. బాంబులు, వేటకొడవళ్లు, తుపాకులే నేస్తంగా సాగిన ఆయన జీవనం చివరకు వాటితోనే అంతమైంది. 1970లో కప్పట్రాళ్ల పంచాయతీ ఎన్నికలు జరిగాయి. వారం కిష్టప్పపై వెంకటప్పనాయుడు విజయం సాధించారు. ఉభయ వర్గాల నడుమ అప్పుడు ప్రారంభమైన ఫ్యాక్షన్ ఇప్పటికీ కొనసాగుతోంది. 1970లో గ్రామం వదిలి వెళ్లిన ప్రత్యర్థి వారం కిష్టప్ప కుమారుడు మునిరంగడు పలుసార్లు వెంకటప్పనాయుడిపై హత్యాయత్నాలు చేశారని చెబుతారు. 1970 నుంచి 2006లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల వరకు కప్పట్రాళ్లలోనే గాక... చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగించిన వెంకటప్పనాయుడు మొదటినుంచీ తేదేపా నేత కె.ఇ.కృష్ణమూర్తి వర్గీయుడు. డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములను శాసించే స్థాయికి ఆయన ఎదిగారు. ఈ క్రమంలోనే ఆయనపై మొత్తం 12 సార్లు (8 పెద్దవి, నాలుగు సాధారణమైన దాడులు) హత్యా ప్రయత్నాలు జరిగాయి. ప్రతిసారీ ఆయన తప్పించుకోగలిగారు. కానీ 15 మంది ప్రధాన అనుచరులను కోల్పోయారు.

- 1971లో ఒకసారి గ్రామంలో బహిర్భూమికి వెళ్లగా ఆయనపై ప్రత్యర్థులు వేటకొడవళ్లతో దాడి చేశారు. కొనప్రాణాలతో ఆయన బతికిపోయారు.
- 1974లో ఆయన ఇంటిపైనే దాడి జరిగింది. మారువేషంలో ఆయన తప్పించుకున్నారు. కానీ ఆయన సోదరుడు బొజ్జప్పనాయుడిని, మరో అనుచరుడిని ప్రత్యర్థులు నరికేశారు.
- 1984లో కర్నూల్లోని ఓ హోటల్ వద్ద ప్రత్యర్థులు చేసిన దాడి కీలకం. పొట్టలోని పేగులు బయటకు వచ్చేవిధంగా పిడిబాకులతో ఆయన కడుపులో పొడిచారు. మృతి చెందాడని భావించి ప్రత్యర్థులు పారిపోయారు. కొన ఊపిరితో ఉన్న ఆయన బతికి బట్టకట్టగలిగారు. గాడ్‌ఫాదర్ కె.ఇ.మాదన్న (కే.ఈ.కృష్ణమూర్తి తండ్రి) అప్పట్లో ఆయన్ను రక్షించారని చెబుతారు. ఆనాటి నుంచి కప్పట్రాళ్ల కేఈ కుటుంబ సభ్యులలో ఒకరిగా ఒదిగిపోయారు.

- 1989లో తేదేపా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2006 స్థానిక సంస్థల ఎన్నికల వరకు నేతగా, ఫ్యాక్షనిస్టుగా అంతా తానై ఆధిపత్యాన్ని చెలాయించారు. రెండు దశాబ్దాల పాటు 50 గ్రామాలు ఆయన కనుసన్నల్లో మెలిగాయి.
- కిష్టప్ప కుమారుడు మునిరంగడు 1991లో అర్ధరాత్రి ఎస్సై దుస్తులు వేసుకుని కప్పట్రాళ్లకు వచ్చి నాయుడిపై బాంబుల దాడి జరిపాడు. ఆ దాడిలో ఆయన ప్రధాన అనుచరుడు దర్గయ్య చనిపోయాడు.
- 1992 ఏప్రిల్ ఒకటో తేదీ అర్ధరాత్రి కప్పట్రాళ్లలో వెంకటప్పనాయుడిపై భారీ దాడి జరిగింది. మిద్దెపై అనుచరుల భద్రత నడుమ నిద్రిస్తుండగా 50 మంది బాంబులు, వేటకొడవళ్లు, నాటు తుపాకులతో స్వైరవిహారం చేశారు. ఈ దాడుల్లో నలుగురు అనుచరుల ప్రాణాలు గాలిలో కలిశాయి. 12 మంది క్షతగాత్రులయ్యారు. ఆయన మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు.
- 1996లో దేవనకొండ వ్యవసాయ కార్యాలయం వద్ద ప్రత్యర్థులు మాటువేసి హత్యకు విఫలయత్నం చేశారు.
- 1998లో కప్పట్రాళ్ల – జిల్లేడు బుడకల గ్రామాల మధ్య కల్వర్టులోకి మందుపాతర్లు అమర్చి నాయుడి హత్యకు ప్రత్యర్థులు ప్రయత్నించి విఫలమయ్యారు.
- 2001లో ఓ రోజు ఉదయం ఇంటి ముందఉ నడుస్తుండగా నాయుడితో ఎలాంటి వైరం లేని ఓ కుటుంబ సభ్యులు బాంబులతో ఆయనపై దాడిచేసి తుదముట్టించేందుకు ప్రయత్నించారు.
- 1970లో ఊరొదిలి వెళ్లిన వారం కిష్టప్ప కూతురు పద్మక్క, 1997లో ఊరొదిలి వెళ్లిన కప్పట్రాళ్ల బంధువు మద్దిలేటి నాయుడు తదితరులతో కలిసి రెండేళ్ల క్రితం కోట్ల సూర్యప్రకాశరెడ్డి సహకారంతో ఆ గ్రామం చేరారు. అప్పటి నుంచి ఆ గ్రామం రగులుతూనే వుంది. అడపాదడపా వైరివర్గాల మధ్య దాడులు జరుగుతూనే ఉన్నాయి. వీటన్నిటి నుంచీ తప్పించుకోగలిగిన వెంకటప్పనాయుడు చివరకు నాటి దాడిలో చనిపోయారు.

# ఫ్యాక్షనంటే ఫ్యాషన్ కాదు... ఊబి!

**- కప్పట్రాళ్ల వెంకటప్పనాయుడు**

"ఇప్పటికి నాపై ఎనిమిదిసార్లు దాడులు జరిగాయి. దేవుడి దయో, నా కన్నతల్లి చలవో, నా భార్య మాంగల్యబలమో ప్రతిసారీ బయటపడ్డారు. ఫ్యాక్షన్ అంటే బయటకు కనిపించినట్లు ఉండదు. మీకు తెలుసా? చిన్నచిన్న కోరికలు కూడా తీరలేదు. అందరిలా హోటల్‌లో కూర్చుని టీ తాగాలని... భార్యాపిల్లలను వెంటపెట్టుకుని తిరునాళ్లకు వెళ్లాలని... ఇవన్నీ నాకు తీరని కోరికలే. ఓ పెళ్లికి వెళ్లలేను. ఇన్నేళ్లలో చూసింది ఒకే సినిమా. ఈ మధ్య మా నాయకుడొకరు తిరుపతి వెళ్తుంటే 'అన్నా నేనూ వస్తా! అన్నా'. 'మాతో వద్దులే నాయుడూ... నీ పరిస్థితి బాగాలేదు' అన్నారు.

ప్రతివాళ్లను అనుమానించక తప్పదు. నావైపు ఆసక్తిగా చూసినా... 'మనవైపు చూస్తున్నాడు ఫాలో కండి' అని మా వాళ్లకు చెబుతా. ప్రాణభయం! ఇంట్లో వాళ్లకూ అలవాటైపోయింది. కట్టుకున్న తరువాత ఇంకేం చేస్తారు! నాపై అభిమానంతో ఉండే అనుచరులే కాని నేను జీతాలిచ్చి పోషించింది లేదు. నాకు ఒక్క శత్రువని కాదు. ఒకరు పోతే మరొకరు పుట్టుకొస్తూనే ఉన్నారు. నా లక్ష్యం ప్రాణాలను కాపాడుకోవడమొక్కటే. నేను రాత్రిళ్లు నిద్రపోయి ఎన్నో ఏళ్లయింది. మధ్యాహ్నమే కొద్దిసేపు నిద్రపోతాను. రాత్రంతా మేలుకొనే ఉంటాను. మా కుక్క అరిస్తే గన్‌మెన్‌ను, అనుచరులను అలర్ట్ చేస్తాను. బయటకు వెళ్తే రూటు మార్చాలి. వాహనం మారాలి. ఇంతకన్నా నష్టపోయింది ఉంటుందా? నా అనుచరులకు ఎప్పుడూ చెబుతుంటా... ఫ్యాక్షన్ అంటే ఫ్యాషన్ కాదని! ఒకసారి ఇరుక్కుంటే ఇక బయటకు రాలేం. ఫ్యాక్షన్ వల్ల అన్ని విధాలా నష్టపోవడమే. ఇన్నేళ్ల నా అనుభవంతో చెబుతున్నా... ఈ ఊబిలో కూరుకుపోవద్దు". మాపై జరుగుతున్న దౌర్జన్యాలను సహించలేక, మా అనుచరులు, మద్దతుదారులను కాపాడుకునే యత్నంలో మాకు తెలియకుండానే ఇందులో కూరుకుపోయాం. ఇక్కడ సంపాదించింది శూన్యం. కోల్పోయిందే ఎక్కువ. నాకు వ్యక్తులు, పార్టీలు ఒరగబెట్టిందేమీ లేదు. ఏదో ఒక పార్టీలో కొనసాగుతున్నా. తిరిగి చూసుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఫ్యాక్షన్ నుంచి బయట పడాలనుకున్నా ప్రత్యర్థుల చర్యలతో వీలుపడడం లేదు.

నేను ఎప్పుడు... ఎక్కడికి వెళ్లేదీ ఎవరికీ తెలియనివ్వను. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడను. నా నంబరు ఎవరికీ ఇవ్వను. ఇంట్లో ల్యాండ్‌లైన్ ఉంది. ఒక్క విషయం తెలుసా... నేను ఎక్కడికెళ్లేదీ నా భార్యకూ తెలియదు. ఎవరైనా ఫోన్ చేస్తే తెలియదని సమాధానం చెప్తారు. ప్రశాంతత కరవైంది. నా వాళ్లన్నా ప్రశాంతంగా ఉండాలను కుంటున్నా. అందుకే ఫ్యాక్షన్‌కు దూరం కావాలి. ప్రత్యర్థులు ఉండనివ్వడం లేదు. కాలమే నిర్ణయిస్తుంది.

***– 2004 నవంబరులో ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ.***

# 30 ఏళ్ల అజ్ఞాతం తర్వాత...

రాయలసీమలో వివిధ వర్గాల మధ్య ఆధిపత్యం పోరు నేపథ్యంలో నాయకత్వం చేపట్టిన మహిళలు చాలామందే ఉన్నారు. జమ్మలమడుగులో శివారెడ్డి, పత్తికొండలో శేషిరెడ్డి, పెనుకొండలో పరిటాల రవి, ధర్మవరంలో సూర్యప్రతాప్‌రెడ్డి మృతి తర్వాత వారి కుటుంబాల మహిళలే రాజకీయంగా కీలకపాత్ర పోషించారు. నాయకుడు కప్పట్రాళ్ల వెంకటప్పనాయుడి హత్య కేసులో ప్రధాన నిందితుల్లో ఒక్కరైన వారం పద్మక్క జీవితంలోనూ ఇలాంటి పలు కోణాలే ఆవిష్కృతమౌతాయి.

కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని ఫ్యాక్షన్ గ్రామమైన కప్పట్రాళ్లలో వెంకటప్పనాయుడి ప్రత్యర్థి వారం పద్మక్క. 2005 డిసెంబర్‌లో మరో 14 మంది అనుచరులతో కలిసి ఆమె కప్పట్రాళ్ల చేరింది. దీంతో అప్పటినుంచే జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ముందస్తుగా గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 1974లో నాయుడుతో ఏర్పడిన వర్గకక్షల కారణంగా వారం కిష్టప్ప కుటుంబీకులు గ్రామం వదిలి వెళ్లిపోయారు. 30 ఏళ్ల అజ్ఞాతం తర్వాత... కిష్టప్ప కుటుంబానికి చెందిన పద్మక్క, ఆమె సోదరుడు శ్రీనివాసులు, ఎంపీ కోట్ల సూర్యప్రకాశరెడ్డి అండదండలతో భారీ పోలీసు బందోబస్తు మధ్య మళ్లీ గ్రామంలోకి అడుగుపెట్టారు. గ్రామంలో ప్రవేశించిన ఆమెను అక్కడ ఉండేందుకు ఇల్లు ఏదైనా ఏర్పాటు చేసుకున్నారా అని అప్పట్లో పోలీసు అధికారులు అడిగారు. తమ ఇల్లు ఇక్కడే ఉందని, తమకు ఖాళీ స్థలాలు కూడా ఉన్నాయని ఆమె చెప్పారు. తొలుత గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని కౌలుట్ల చెన్నకేశవస్వామి దేవాలయంలో ఆమె పూజలు చేశారు. అనంతరం ఊళ్లోకి వచ్చి ఈడిగ వెంకటరాముడు ఉంటున్న ఇల్లు తమదేనని, అందులో చేరేందుకు ప్రయత్నించారు. అయితే ఆ ఇంటిని పద్మక్క బావ తమకు అమ్మాడని వారు ఆమెతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడే ఉన్న ఫ్యాక్షన్ జోన్ సిఐ సాంబశివరావు జోక్యం చేసుకుని మీ ఆస్తులు ఎక్కడ ఉన్నదీ రెవెన్యూ అధికారులను పిలిపించి ధ్రువీకరిస్తామని, మిమ్మల్ని గ్రామంలో చేర్చేందుకే వచ్చామని, సహనం వహించి అధికారులతో సహకరిస్తే న్యాయం జరుగుతుందని ఆయన ఆమెకు సూచించారు. దీంతో పద్మక్క, ఆమె వర్గీయులుగతంలో తమ పెద్దలు నివాసం ఉన్న వీధికి వెళ్లారు. అక్కడ వారి బంధువుల ఇంట్లో చేరేందుకు ప్రయత్నించారు. వారు లేకపోవడంతో కుదరలేదు. దీంతో ఉండేందుకు ఇల్లు కరువై గ్రామంలోని పీర్లసావిడిలోనే ఉండిపోయారు.

## రెండు కుటుంబాల పోరు...

కోడుమూరు – పత్తికొండ ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది కప్పట్రాళ్ల. 1975లో సర్పంచి పదవి కోసం ఇక్కడ ప్రారంభమైన పోరు... ఫ్యాక్షన్ జ్వాలకు నిప్పు రాజేసింది. సర్పంచి ఎన్నికల్లో వారం కిష్టప్పపై గెలిచిన నాయుడు... తొలిసారిగా రాజకీయ ఆరంగేట్రం చేశాడు. ఎన్నికల నాటి నుంచే వేడెక్కిన వాతావరణం... రెండు కుటుంబాల మధ్య పగను రగిలించింది. కిష్టప్ప, వెంకటప్ప ఇద్దరూ బీసీ కుటుంబాలకు చెందిన నాయకులే. కానీ వారి మధ్య ఫ్యాక్షన్ జడలు విప్పింది.

వెంకటప్ప సర్పంచిగా గెలిచిన కొన్ని నెలలకే ఆయన అనుచరులు కిష్టప్పను హత్య చేశారు. దీంతో అతని వారసుడిగా వారం మునిరంగడు తెరపైకి వచ్చాడు. కప్పట్రాళ్లలో వందెకరాల భూమి కలిగిన వారం కుటుంబం ఊరొదిలి వివిధ ప్రాంతాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవించాల్సి వచ్చింది. ఫ్యాక్షన్ పగలు పెరిగి... పలుసార్లు రెండు కుటుంబాల మధ్య దాడులు, ప్రతిదాడులు జరిగాయి. 1979లో మునిరంగడు దాడిలో బతికిబయటపడ్డ వెంకటప్పనాయుడికి కేతు కుటుంబంతో సాన్నిహిత్యం ఏర్పడింది. అప్పటినుంచి కేతు వర్గానికి ప్రధాన అనుచరుడుగా నాయుడు మెలగుతూ వచ్చాడు.

## అల్లుడి రాకతో అలజడి...

ప్రధాన ప్రత్యర్థి వారం పద్మక్క గ్రామానికి రావడంతో పాటు నాయుడికి మరో ప్రధాన ప్రత్యర్థి, మేనల్లుడు మద్దిలేటి నాయుడు రాకతో వెంకటప్ప నాయుడు గుండెల్లో అలజడి మొదలైంది. ఫ్యాక్షన్ వర్గకక్షల్లోనే రంగప్పనాయుడు హత్యకు గురయ్యాడు. అనంతరం అతని కుటుంబ సభ్యులు గ్రామం వదిలి వెళ్లిపోయారు. కానీ, రంగప్పనాయుడు కుమారుడు మద్దిలేటి నాయుడు, ఆయన కుటుంబసభ్యులు తిరిగి గ్రామాన్ని చేరడంతో ఫ్యాక్షన్‌కు మళ్లీ ఆజ్యం పోసినట్లయింది.

ఎనిమిదేళ్లుగా లద్దగిరిలో కోట్ల కుటుంబీకుల వద్ద ఆశ్రయం పొందిన రంగప్పనాయుడు కుటుంబీకులు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తిరిగి గ్రామంలోకి చేరేందుకు మార్గం సుగమమైంది. ఒకప్పుడు రెండు నియోజకవర్గాల అభ్యర్థుల గెలుపోటములను శాసించే వెంకటప్పనాయుడు చుట్టూ... ఉచ్చు బిగుసుకుంది. పద్మక్క, మద్దిలేటి నాయుడు వర్గాలు మళ్లీ గ్రామంలో అడుగుపెట్టింది తమ ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకా లేక నాయుడిని అంతం చేసేందుకా? అన్న ఆందోళన

అప్పట్లోనే మొదలైంది. మద్దిలేటి నాయుడు తిరిగి గ్రామానికి చేరిన సందర్భంగా... అతను తనకు సమీప బంధువు అని, ఎలాంటి శత్రుత్వం లేదని వెంకటప్పనాయుడు అన్నారు. నాయుడి కారణంగానే తమ తండ్రి హత్యకు గురయ్యారని, నాయుడితో రాజీ ప్రసక్తే లేదని మద్దిలేటి నాయుడు అప్పట్లోనే కరాఖండీగా తేల్చిచెప్పారు.

## వెంకటప్పనాయుడి ఖాతా ఇదేనంటున్న పద్మక్క

- 1964లో తమ తండ్రి పేరిట ఉన్న ఈత చెట్లను నరికి కల్లు దుకాణాలను ధ్వంసం చసిన కేసులో వెంకటప్పనాయుడు నిందితుడు.
- ఈ కేసులో అతనితో పాటు అతని అన్న పాపానాయుడులకు ఆదోని కోర్టు సంవత్సరకాలం శిక్ష విధించింది. కర్నూలు కోర్టులో ఆరునెలలకు శిక్ష తగ్గించారు. అనంతరం హైకోర్టులో జరిమానా విధించి వదిలేశారు.
- 1972లో తన అన్న శ్రీనివాసులు బస్సులో ప్రయాణిస్తుండగా బల్లెంతో పొడిపించారు. దీంతో 56 రోజుల కోమాలో ఉండి బతికి బయటపడ్డాడు.
- 1973 అక్టోబర్ నెలలో కరణం యోగానందాన్ని దారికాచి తలపై బండరాయితో మోది వెంకటప్పనాయుడి వర్గీయులే చంపారు.
- 1975లో తన అక్క శంకరమ్మను ముద్దనూరు మండలం వేల్పనూరు సమీపంలో కిరాయి హంతకులతో చంపించారు.
- 1984లో టిడిపి సిట్టింగ్ ఎమ్మెల్యే మహాబలేశ్వరగుప్తను హత్య చేసిన కేసులో నాయుడు కూడా ముద్దాయే.
- 1988లో పల్లెదొడ్డి ఆరు హత్యలకు నాయుడే కారణం.
- 1989–93 సంవత్సరాల్లో జరిగిన గొల్లరంగన్న, నడిపోడు హత్యలకు నాయుడే కారకుడు.
- 1996 ఎమ్మెల్యే శేషిరెడ్డి హత్య కేసులో కూడా నాయుడు ముద్దాయి.
- 2001లో కళావతుల ప్రభాకర్ కుటుంబంలోని ఆరుగురు సభ్యులను వెంటాడి వేటాడి నరికించారు.

> *"People have a strong tendency to murder one another. It dates back, I presume to former periods when the chains of Governament lay lightly, and might was right. It is encouraged by the difficulty of securing convictions. This is due partly to the people and partly to the police"*
> *-Cuddapah Dist. Gazetter, Page : 515*
>
> *– హార్డించ్, జిల్లా మేజిస్ట్రేట్, క్రీ.శ. 1900*

# మొండిగోడలు... బీడు భూములు...

కడప జిల్లా కొండాపురం మండలం పొట్టిపాడు పంచాయితీ పరిధిలోని లింగందిన్నెపల్లె నాలుగేళ్లలో ఆరు హత్యల్ని చూసింది. పచ్చని పల్లెలో ఫ్యాక్షన్ చిచ్చు పెట్టింది. గ్రామంలో 30 ఇళ్లు ఉండేవి. 150 మందికి పైగా జనాభా. 800 ఎకరాల సాగుభూమి. జొన్న, ఉల్లి, వేరువనగ, పొద్దుతిరుగుడు పంటలతో పచ్చగా వుండేది ఊరంతా. ఫ్యాక్షన్ చీడ అల్లుకున్న తర్వాత ఊరు ఖాళీ అయ్యింది. పొలాలన్నీ బీళ్లుగా మారాయి. అయిదేళ్ల క్రితం ఉగాది పండుగ రోజున బంధువులందరూ ఒకచోట కూర్చుని సరదాగా మాట్లాడుకుంటూ పేకాడుకుంటున్నారు. ఆట ఊరికే ఆడితే మజా ఏముంటుంది? పదిరూపాయల పందెంతో సాగుతోంది. ఓడిపోయిన వ్యక్తి అందరికి సలాం కొట్టాలనే నియమం చేరింది. ఆహ్లాదకరంగా సాగే ఆట కాస్తా అంతు తేల్చుకునే వరకూ దారి తీసింది. నువ్వు రాంగ్ షో చూపించి గెలిచావని ఒకరు, ముందు నువ్వు ఓడిపోయినావు సలాం కొట్టు అని ఇంకొకరు గొడవకు దిగారు. పంతానికి పోయారు. లావనూరు నుంచి కాలినడకన లింగందిన్నెపల్లెకు వస్తుండగా, దారిలో కాపుకాచి పందిళ్లపల్లె ఓబుళరెడ్డి (63), పెద్దమునిరెడ్డి (52) ఇద్దర్ని 2002 మే 17న ప్రత్యర్థులు హత్య చేశారు.

తర్వాత ఊరు విడిచి తాడిపత్రి చేరిన ప్రత్యర్థులు కేసు కోసం ప్రొద్దుటూరు కోర్టుకు వస్తుండగా ఆర్టీసీ బస్సులో సానా వెంకటశేషారెడ్డి, వీరనారాయణరెడ్డి, పుట్లూరు నారాయణరెడ్డి, జయరామకృష్ణారెడ్డిలను 2004 జూలై 14వ తేదీన దారుణంగా హత్య చేశారు. అప్పటి నుంచి ఊరంతా ఖాళీ అయ్యింది. గ్రామంలో ఎవ్వరూ ఉండడం లేదు. వూర్లోని ప్రాథమిక పాఠశాల మూతపడింది. ఆలయంలో దీపం వెలగడం లేదు. మొండిగోడలు... బీడు భూములతో లింగందిన్నెపల్లె దర్శనమిస్తోంది.

**'రాజవాహన చరిత్ర'లోని ఒక యుద్ధ ఘట్టవర్ణన**

"దుర్గముల పాలెగాండ్లైన కమ్మవారును, వెలమ వారును, 5000 వరహాల జీతము పొందు పఠాను సైన్యపు సేనానులు, కైజీతపు రాచవారు... మొదలైనవారు యుద్ధము చేసిరి. ఆ యుద్ధమందు శత్రువుల 'గడలపౌజు' కకావికయ్యెను. తుపాకీలను కాల్చు మూక ఒక దిక్కు వాటిని శత్రువులపై కాల్చిరి. గజసేనను కోట తలుపులు పగులగొట్ట పురిగొల్పిరి. బాణములను కొందరు రువ్వుచుండిరి. కోట గోడల వద్ద గనులు త్రవ్వి మందు నింపి కాల్చుచుండిరి. దానిని కోటలోని వారు భగ్నపర్చుచుండిరి. కొందరు నిచ్చెనలతో కోట గోడ లెక్కుచుండిరి. కోటలోని వారు వారిని కూలద్రోసిరి. శత్రువుల బిరుసుతనము జూచి రాజవాహనుడు 'రేపు సర్వలగ్గ' అని ప్రకటించెను. శత్రువులు అది విని సంధి చేసుకొనిరి".



## ఫ్యాక్షన్‌ను ద్వేషిస్తూ...

ఒకప్పటి పరిస్థితికి ఇప్పటి పరిస్థితికి పల్లెల్లో మార్పు కన్పిస్తోంది. నిరంతరం ఏదో ఒక కొట్లాటతోనో, గొడవతోనో ప్రత్యర్థి వర్గాల్ని తుదముట్టించాలనే తలంపుతో, ఎప్పుడు చస్తామో తెలియక, పగలూ, రాత్రీ మృత్యువును మోస్తూ, జీవించే జీవితాలను పల్లెల్లోని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోనూ ఇలాంటి వర్గనాయకుల దగ్గర పనికి వెళ్లడానికి కూడా ఏదోవిధంగా నిరాకరిస్తున్నారు.

పల్లెల్లో ఏర్పడే రెండు వర్గాలు. ఇవి రాజకీయ పార్టీల పరంగాగానీ, కులాలపరంగా గానీ, వ్యక్తి ప్రాబల్యం చేతగానీ ఏర్పడుతూ వుంటాయి. పల్లెల్లోని జనం ఏదో ఒక వర్గంలో చేరాల్సి వుంటుంది. అలా చేర్చుకోవడం అనేది కూడా ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రధాన భూమికగా భావిస్తారు నాయకులు.

ఏవైనా సమస్యలొచ్చిన సందర్భాల్లో ఇలాంటి నాయకులు అప్పటికప్పుడు తమ వర్గం వారికి ప్రయోజనకరంగానీ, లాభదాయకంగానీ మేలు చేయడానికి ప్రయత్నిస్తారు. వారి అభిమానాన్ని సంపాదించుకుంటారు. ఆ సందర్భంలో నీకు నేను మేలు చేశాను కాబట్టి నువ్వూ, నీ కుటుంబమూ నాకే మద్దతునిచ్చి నా వర్గంలో కలవాలని కోరుకుంటారు. ఈ విధంగా ప్రజల్ని తమ వైపుకు తిప్పుకోవడానికి నాయకులు నానా అగచాట్లు పడుతూనే వుంటారు.

పల్లెల్లోని ప్రజలు కూడా నాయకుల మాటకు ఎదురుచెప్పే ధైర్యం లేక కట్టే విరవకుండా, పాము చావకుండా మధ్యేమార్గంగా నెట్టుకొస్తుంటారు. కానీ ఇటీవల కాలంలో రాజకీయ నాయకుల వెంట తిరగడానికి గానీ, వారి వద్ద పనులకెళ్లడానికి గానీ కుటుంబంలోని వారే విముఖత చూపిసఊండడంతో ఇంటి యజమాని పాత్ర పోషించేవారు వర్గ నాయకుల వద్దకు వెళ్లడానికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉంటూ నిరాకరిస్తున్న వైనాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పల్లెల్లో ఎక్కువశాతం భూములు, ఫ్యాక్టరీలు, పనులు వర్గ నాయకుల గుప్పిట్లోనే కేంద్రీకృతమై వుండడంతో చాలామంది ఈ విషవలయం నుంచి బయట పడదామనుకున్నా కుదరని పరిస్థితుల్లో వలలో చిక్కిన చేపల్లా సర్దుకుపోతున్నారు.

విపరీతమైన ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడిన పల్లెల నుంచి రాత్రికి రాత్రి ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోవడం కూడా ఇప్పటికీ జరుగుతూనే వుంది. ఈ విధంగా పల్లెల్లో ఏర్పడిన రెండు వర్గాల ఫ్యాక్షన్‌కు భయపడి పట్నాలకు, టౌన్లకు కడుపు చేత పట్టుకొని వలసలుపోయే కుటుంబాలు సీమలో సర్వసాధారణంగా కన్పిస్తూనే వుంటాయి.

## ఉన్నత విద్య కోసం...

పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం, వారికి చక్కటి ఉన్నత విద్యను అందించడం కోసం పల్లెల్లోని వాళ్లు కూడా ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. ఎవరెవరి పిల్లలో టౌన్లలో చదువుకొని విదేశాలకు వెళ్లి డాక్టర్లుగా, ఇంజనీర్లుగా సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తూ డాలర్లు సంపాదిస్తుండడంతో తమ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడం కోసం పల్లెల్లోని కుటుంబాలు చదువుకు అవకాశం వుండే ప్రాంతాలకు వెళుతున్నాయి. ఎంత ఖర్చయినా భరిస్తూ పిల్లల్ని చదివించడానికి తల్లిదండ్రులు సిద్ధపడుతున్నారు.

## పెళ్లిళ్ల కోసం...

ఫ్యాక్షన్ గ్రామాల్లో వుండే కుటుంబాల్లోని అమ్మాయిలకు పెళ్లి కావడం కష్టమవుతోంది. అలాగే అబ్బాయిల ఇంటికి అమ్మాయిల్ని పంపడం కూడా ఒకటికి రెండుసార్లు ఆలోచించుకునే పరిస్థితి కల్గిస్తోంది. ఫలితంగా ఫ్యాక్షన్ ఉండే ఊర్లలో వుండడం కంటే వేరే ప్రాంతంలో వుండడం మేలనే చాలామంది భావిస్తున్నారు. మీ పల్లెలో ఫ్యాక్షన్ వుందా? మీ కుటుంబం ఏ వర్గంలో వుంది? ఇప్పుడు మీ పల్లెలో ఎవరిది ఆధిపత్యం? ఎవరి వర్గం పెద్దది? వంటి ప్రశ్నలతో సతమతమవడం కంటే ఫ్యాక్షన్‌కు దూరంగా వుండడం వల్ల పిల్లల చదువులకు, పెళ్ళిళ్ళకు వారి భవిష్యత్‌కు మంచిదనే ఆలోచనలోనే ఎక్కువమంది వుండడం మంచి పరిణామం.

పల్లెల్లోని వర్గనాయకులు కూడా ఎన్నికలప్పుడు కొంత ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడితే సర్దుకుపోతున్నారు, కానీ నిత్యం గొడవల్ని కోరుకోవడం లేదు. కొన్నిసార్లు తగ్గి వుండడం మరికొన్నిసార్లు ప్రత్యర్థి వర్గాల వారికే పంతానికి పోకుండా అవకాశాల్ని వదిలివేయడం చేస్తున్నారు. ఫలితంగా కక్షల వేడి తగ్గి ఇద్దరి ప్రాణాలకు ఇంకొంత కాలం భరోసా లభిస్తుంది. రాజకీయ నాయకుల దగ్గరికెళ్లి కాంట్రాక్టులు, పనులు తెచ్చుకొని చేసుకోవడం, సంపాదించుకోవడం చేస్తున్నారు.

తమ వెంట మంది మార్బలాన్ని సుమోలలో తిప్పుకుంటూ తమ ఆధిపత్యాన్ని చాటి చెప్పడానికి నిరంతరం ప్రయత్నించడం అనేది అధిక ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో సాధ్యమైనంత వరకు ఫ్యాక్షన్‌కు దూరంగా వుండాలనే వర్గ

నాయకులు కూడా కోరుకుంటున్నారు. కానీ అప్పటికే ఈ ఫ్యాక్షన్ రాజకీయాలు నడిసంద్రంలో వుండడంతో వాతావరణం ఎంత బాగా కన్పించినా ప్రత్యర్థులు ఎప్పుడు దాడి చేస్తారో అనే భయం పట్టి పీడిస్తూనే వుంటుంది వర్గ నాయకులకు. ఇప్పటికే తరాలుగా నడుస్తున్న ఫ్యాక్షన్ నుంచి విముక్తి లభిస్తే చాలని చాలామంది ముఠా, వర్గ, రాజకీయ నాయకులు కోరుకుంటున్నారు. కనీసం తమ పిల్లల్ని అయినా ఈ ఫ్యాక్షన్ నీడ నుంచి దూరంగా తీసుకెళ్లి రక్షించుకోవాలని తపన పడుతున్నారు. ప్రత్యర్థి వర్గాలు ఎప్పుడు, ఎక్కడ, ఎలా తమపైకి దాడికి దిగుతాయోనని భయంతో నరకయాతన అనుభవిస్తున్నారు.

## 'కోకా చట్టం' ఎప్పుడు?

ఫ్యాక్షనిజాన్ని అదుపు చేయడానికి వ్యవస్థీకృత నేరాల నిరోధక చట్టం (కోకా) అవసరమని మేధావులు ఎప్పుడో తేల్చారు. రాయలసీమ ఐజిగా గతంలో పనిచేసిన సాంబశివరావుగారు ఒక నివేదికను కూడా ప్రభుత్వానికి సమర్పించారు. వాస్తవానికి ఫ్యాక్షనిస్టులకు రాజకీయ అండదండలుండడం, ఆర్థికంగా బలవంతులు కావడం వల్ల ప్రస్తుతం ఉండే చట్టాల వల్ల ప్రయోజనం లేదనే విమర్శ వుంది. కోకా చట్టం ప్రతిపాదన కేంద్ర హోంశాఖ అనుమతి కోసం పంపారు. ఇంకా ఇంతవరకు అనుమతి రాలేదు.

## 'ఫ్యాక్షన్ జోన్' ప్రశ్నార్థకమా?

సీమలో పేట్రేగిపోతున్న ఫ్యాక్షనిస్టులకు కళ్లెం వేసి గ్రామసీమల్ని శాంతి వనాల్లా చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన ఫ్యాక్షన్ జోన్ వ్యవస్థ కాగితాలకే పరిమితమైంది. ఫ్యాక్షనిస్టులను అదుపు చేయడానికి, ఫ్యాక్షన్ నీడలోని గూండాలను, వారి వద్ద వున్న లైసెన్స్ లేని నాటు తుపాకులు, అక్రమంగా వుంచుకున్న బాంబులు, ఇతర మారణాయుధాలు, స్వాధీనం చేసుకోవడం ఫ్యాక్షన్ జోన్ ప్రధాన కర్తవ్యం. ఫ్యాక్షన్ జోన్ వ్యవస్థ కాగితాలకే పరిమితమైంది.

రాయలసీమ నీటి ప్రాజెక్టులన్నీ బూజుపట్టిపోతున్నాయి. వాటిలో కొన్నయినా కార్యరూపం దాల్చి అక్కడ గ్రామాల్లో నీరందితే – పంటలు పండితే కరువు రక్కసి హతమారుతుంది. యువత వ్యవసాయం వైపు, పరిశ్రమల వైపు మొగ్గుచూపితే – పొట్ట కూటి కోసం ముఠా నాయకులను ఆశ్రయించే పని తప్పుతుంది. అలాంటి పరిస్థితులు కల్పిస్తేగానీ రాయలసీమ ముఖచిత్రం మారదు.

# ఫ్యాక్షన్ సమస్యకు పరిష్కారాలు

- రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి.
- కరువు, చాలీ చాలని సాగునీటి వనరులు, నిరక్షరాస్యత లాంటి సామాజిక ఆర్థిక అభివృద్ధి సమస్యలను పరిష్కరించేందుకు ఇలాంటి ప్రత్యేక ప్యాకేజీలు తప్పనిసరిగా అవసరం.
- రాయలసీమ ప్రాంతంలోని ఫ్యాక్షన్ ప్రాంతాల్లో విద్య, ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెంచాలి.
- ఫ్యాక్షనిస్టుల చరిత్ర, వాళ్ల చేతికింది హంతకుల చరిత్ర ఒక పద్ధతి ప్రకారం క్రోడీకరించి, వీడియోగ్రాఫ్‌లు, ఫొటోగ్రాఫ్‌లు, వివిధ దుస్తుల్లో, విభిన్న కోణాల్లో తీసి రికార్డు చేయాలి.
- ఫ్యాక్షనిస్టులను సామాజికంగా వెలివేయాలి. ప్రజల్లో ఈ అంశం పట్ల తగిన చైతన్యాన్ని పెంపొందించాలి.
- ఒకసారి సమాజం నుంచి వెలివేయబడి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొనే ఫ్యాక్షనిస్టులకు ఏ రాజకీయ పార్టీలు స్థానమివ్వరాదు.
- ప్రజల్లో ఫ్యాక్షన్‌కు వ్యతిరేకంగా మీడియా ద్వారా దృశ్య, దూర, శ్రవణ విద్యల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి.
- పారిశ్రామిక అభివృద్ధికి శాంతి అత్యవసరం. అందుకే పారిశ్రామికీకరణ, పరిశ్రమల ఏర్పాటు కావలసిన ప్రాంతాల్లో శాంతియుత పరిస్థితులు నెలకొల్పేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.
- సీమలో మూతపడిన పరిశ్రమలను తక్షణం తెరిపించాలి. ఆదుకోవాలి.
- సీమలో ఏర్పాటయ్యే పరిశ్రమలలో స్థానిక యువతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.
- ఫ్యాక్షన్ ప్రాంతాల్లో సాగునీటి వనరులు కల్పించే పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యతతో చేపట్టాలి. నిర్దిష్ట కాల వ్యవధిలోపూర్తి చేయాలి.
- రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, ఫ్యాక్షనిస్టులకు ఎన్నికల్లో పార్టీ టికెట్లు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వకుండా వుండాలి.
- ఫ్యాక్షనిస్టులు ఆక్రమించుకున్న దేవాలయ, ప్రభుత్వ భూములకు తక్షణం విముక్తి కల్పించాలి. ఈ రకమైన దురాక్రమణకు గురైన భూములను రెవెన్యూశాఖ తక్షణమే గుర్తించాలి.

- ఇలాంటి భూములను ముఖ్యంగా బలహీన వర్గాలకు, భూమిలేని పేదలకు పంచాలి.
- పుష్కలమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నప్పటికీ ఫ్యాక్షనిజం వలన రాయలసీమలో ఆశించిన పారిశ్రామికీకరణ జరగలేదు. అందుకే ప్రభుత్వం ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక రాయితీలను కల్పించాలి.
- పాలనా సంబంధిత అణచివేత చర్యలకంటే సామాజిక ఆర్థిక అభివృద్ధి చర్యల ద్వారా ఫ్యాక్షనిజాన్ని మరింత సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చు.
- ఫ్యాక్షన్ హింసను అరికట్టేందుకు అవసరమైన ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. పాలనా యంత్రాంగం ఫ్యాక్షనిజాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ చట్టం ఉపయోగపడాలి.
- ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల్లో పనిచేసేవారు, స్కూళ్లల్లో, కాలేజీల్లో ఫ్యాక్షన్ దుష్పరిణామాల గురించి, వాటి నివారణ గురించి అవగాహన కల్పించాలి.
- పేదరికం, జీవనోపాధి లేకపోవడం, నిరుద్యోగం, నిరక్షరాస్యత ఎక్కువగా వున్న ఈ ప్రాంత యువతరాన్ని ఫ్యాక్షనిస్టులు సులభంగా తమ వైపుకు తిప్పుకొని సాధనాలుగా వాడుకుంటున్నారు. దీనిని అరికట్టాలి. ఉపాధి అవకాశాలు కల్గించాలి.
- మట్కా, గ్యాంబ్లింగ్, కల్తీ మద్య వ్యాపారాలు, మామూళ్ల వసూళ్లు, చట్టవిరుద్ధమైన మైనింగ్ వంటి అన్నిరకాల ఆర్థిక వనరులు ఫ్యాక్షనిస్టులకు అందకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.
- సంవత్సరం పొడుగునా గ్రామస్థులకు పని కల్గించడానికి పెద్ద ఎత్తున నీటిపారుదల సౌకర్యాలను పెంచాలి. పల్లెల్లో, పట్టణాల్లో ఎక్కువ ఆదాయం కల్గించే ఉద్యోగ సదుపాయాలు పెంచే పథకాలు రావాలి.
- ఫ్యాక్షన్ ప్రాంతాల్లో టెండర్ల వ్యవహారాలల్లో ఫ్యాక్షనిస్టులు జోక్యం చేసుకోకుండా విధానాల్లో తగిన మార్పులు చేపట్టాలి. కాంట్రాక్టర్లు, ఫ్యాక్షనిస్టులు సిండికేట్లుగా మారి టెండర్లను కొల్లగట్టకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- ఫ్యాక్షనిజాన్ని హీరోయిజంగా, ఫ్యాక్షనిస్టులను హీరోలుగా చిత్రీకరించడాన్ని నిలిపివేసేందుకు మీడియాను ఒప్పించాలి. వారికి తగిన అవగాహన కల్పించాలి.
- గ్రామస్థాయిలో ఫ్యాక్షన్ నివారించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు, స్థానిక ప్రజలతో కూడిన సంయుక్త కార్యాచరణ కమిటీలను నెలకొల్పాలి.

- ఫ్యాక్షన్ ప్రాంతాల్లో నిజాయితీగల సమర్థవంతమైన ఉన్నతస్థాయి అధికారులను ముఖ్యంగా కలెక్టర్, ఎస్పీ పదవులకు నియమించాలి.
- ఫ్యాక్షనిజాన్ని ఎదుర్కొనేందుకు వారికి తగిన సమయం ఇవ్వాలి.
- అకారణంగా అధికారుల బదిలీలను నిలిపివేయాలి.
- క్రిందిస్థాయి అధికారులు ఒక ప్రాంతంలో 2-3 సంవత్సరాలకంటే ఎక్కువకాలం ఉండకుండా జాగ్రత్తపడాలి.
- సమర్థవంతమైన సేవలందించే పోలీసులకు, ఉద్యోగులకు తగిన పురస్కారాలు ఇవ్వాలి.
- ఫ్యాక్షన్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను నియమించాలి.
- ఫ్యాక్షన్ నిర్మూలనకు అందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలి.
- ఫ్యాక్షన్ నేతలు, వారి అనుచరులపైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి.
- సర్కిల్ పరిధిలో ఒక పార్టీ, జిల్లా కేంద్రం నుంచి రిజర్వుడ్ ప్రత్యేక పార్టీ, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లను ఫ్యాక్షన్ గ్రామల్లోకి రప్పించి, మెరుపు దాడులను విస్తృతంగా చేయించాలి.
- ఫ్యాక్షన్ గ్రామాలపై దాడులు జరిపి బాంబులు, వేటకొడవళ్లు తదితర మారణాయుధాలను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి.
- ఫ్యాక్షన్ గ్రామాల్లో నేరచరిత్ర కలిగిన వారిపై పీడి యాక్ట్ నమోదు చేసి, వారిని చర్లపల్లి జైలుకు తరలించాలి.
- సీమలోని అన్ని తుపాకుల లైసెన్సులను రద్దు చేయాలి.
- పల్లెల్లో విస్తృతంగా మైత్రి సంఘాలను ఏర్పాటు చేయించాలి. అవసరమైన చోట శాంతి సాధక కమిటీలు నెలకొల్పాలి.
- ముఠాకక్షల బారినపడిన గ్రామాలను ఎప్పటికప్పుడు సందర్శించి, గ్రామసభలు నిర్వహించి, ఇరువర్గాలను సమావేశపరచి సయోధ్య కుదర్చాలి. వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలి.
- ప్రజల్ని భయాందోళనలకు గురిచేసే నాయకులు, వారి అనుచరులపై బైండోవర్ కేసులు పెట్టి నిఘా పెంచాలి.
- ఫ్యాక్షనిస్టుల వద్ద వుండే నాటుబాంబులు, మారణాయుధాలను తనిఖీలు నిర్వహించి ఏరివేయాలి.

# ఆటవిక హింసా సంస్కృతి

ఫ్యాక్షన్ అనే పదం అనగానే రాష్ట్ర ప్రజలందరికీ గుర్తుకొచ్చేది రాయలసీమ ప్రాంతమే. సీమ కక్షల సెగతో మండిపోతుందని, ఎక్కడికక్కడ నాటుబాంబులు పేలుతున్నాయని ఎవరైనా అంటే ప్రభుత్వం ఒప్పుకోదు. ఫ్యాక్షన్ భూతంపై ఉక్కుపాదం మోపామని, అది నిద్రలేచే ప్రసక్తే లేదని చెప్తుంది. ఫ్యాక్షన్ నేతలు, వారి అనుచరులపైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామంటారు. సర్కిల్ పరిధిలో ఒక ప్రత్యేక పార్టీ, జిల్లా కేంద్రం నుంచి రిజర్వుడ్ ప్రత్యేక పార్టీ, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లను ఆయా గ్రామాలకు రప్పించి మెరుపుదాడులు చేస్తున్నామని పోలీసులు గొప్పలు చెప్పుకుంటారు. ఫ్యాక్షన్ గ్రామాలపై దాడులు జరిపి బాంబులు, వేటకొడవళ్లు తదితర మారణాయుధాలను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటూ వున్నామని తమను తాము ప్రశంసించుకొని ఉప్పొంగిపోతారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో నేరచరిత్ర కల్గినవారిపై పీడి యాక్ట్ నమోదు చేసి, వారిని చర్లపల్లి జైలుకు తరలిస్తామని వార్నింగ్‌లు కూడా ఇచ్చామంటారు.

ఫ్యాక్షనిస్టులను జిల్లాల నుంచి బహిష్కరిస్తామని, సీమలో శాంతి భద్రతలకు ఎలాంటి ముప్పు లేదని ఘనంగా ప్రకటిస్తున్నప్పుడే ఎక్కడోచోట బాంబు పేలుళ్లు జరిగో, ఒకర్నొకర్ని నరుక్కొనో తమ ఉనికిని ఫ్యాక్షనిస్టులు చాటుకుంటారు. కానీ ప్రభుత్వం మాత్రం తన వైఖరికే కట్టుబడి వుంటుంది. సీమలో ఎక్కడ చూసినా శాంతి కపోతాలు విచ్చలవిడిగా ఎగురుతున్నాయని, ఎండిపోయిన నది దారుల్లో అభివృద్ధి ప్రవహిస్తోందని సంబరపడిపోతుంది. హింస-ప్రతిహింసల గొలుసు చర్య మూలాన్నీ, క్రమాన్నీ అర్థం చేసుకోకుండా దాన్ని ఛేదించడం సాధ్యం కాదనే అంశం వారికి ఎప్పటికీ అర్థం కాదు. అర్థం చేసుకోలేరు. సీమలో ఇలా నిరంతరం నెత్తుటేర్లు పారడానికి గల కారణాలను కూడా వీరు అన్వేషించలేరు... అధ్యయనం చేయలేరు. ఫలితంగా ఏమౌతోంది? ఇదిగో ఇలా కక్షల చరిత్ర పునరావృతం అవుతూనే వుంది.

ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా, శాంతియుతంగా సాగవలసిన ప్రజాస్వామ్యంలో హత్యా రాజకీయాలకు స్థానం కల్గిస్తున్నదెవరు? సీమలో తమ ఆర్థిక ఆధిక్యాన్ని చలాయించుకోవడానికి ఉపయోగపడుతున్న కులం, హింస ప్రాతిపదికలనే రాజకీయ అధికార సాధనకు సోపానాలుగా వాడుకుంటున్నది ఎవరు? సీమలో నిరంతరం నెత్తుటి ధారలు పారడానికి కారణం ఎవరు? కుత్తుకలు తెగనరికే వేటకొడవళ్లు ఎవరికోసం తయారవుతున్నాయి? వాటిని మోస్తున్నదెవరు? వాటి బలిదానం వల్ల కిరీటం పొందుతున్న వారెవరు? ప్రాణాలు కోల్పోతున్నదెవరు? ఆధిపత్య పోరుతో

విగతజీవులై పోతున్న కుటుంబాల గోడుకు కారకులు ఎవరు? ముఠానేతల ప్రతీకారాలకు సమిధలుగా మారి జీవితఖైదు అనుభవిస్తున్న అభాగ్యుల బతుకుకు భరోసా ఎవరు? ఇవన్నీ కేవలం ప్రశ్నలు కానే కావు. పాశుపతాస్త్రాలు. వీటికి జవాబులుండవు.

హింస–ప్రతిహింసల గొలుసు చర్య మూలాన్నీ, క్రమాన్ని అర్థం చేసుకుంటే కానీ, వీటికి సమాధానాలు శోధించడం, సాధించడం, ఛేదించడం సాధ్యం కాదు. సమస్యకున్న ఆర్థిక, రాజకీయ, సాంఘిక కోణాల్ని లోతుగా పరిశీలించాలి. హింసకు తెర దించడానికి ఏయే చర్యలు తీసుకోవాలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలి. సీమలో వేళ్లూనుకుపోయిన ఆటవిక హింసా సంస్కృతికి ఈ హత్యలు పరాకాష్ట అనే అంశం గుర్తుంచుకోవాలి. చర్యకు ప్రతిచర్య సూత్రం ప్రకారం నడిచే ఫ్యాక్షన్ రాజకీయం దెబ్బకు మిగతా సామాన్యజనం పడుతున్న భయం, బాధల్ని అందరూ అర్థం చేసుకోవాలి. సీమ వెనుకబాటుతనం గురించి మాట్లాడడానికి ఎవరూ ముందుకు రాకపోతే 'ఖర్మ' అని సరిపెట్టుకోగలరు. కనీసం 'హత్యల్ని ఆపండి!', 'ఫ్యాక్షనిజాన్ని నిర్మూలించండి!!' అని గొంతెత్తి ఘోషిస్తున్నా పట్టించుకోకపోతే?

## రతనాల సీమకు మిగిలిన రాళ్లు

రాయలసీమ విషయంలో తప్పు మీద తప్పు జరుగుతూనే వుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాయలసీమలో కరువు ఏదో ఒక ప్రాంతంలో విలయతాండవం చేస్తూనే వుంది. నిజానికి దేశంలోని మరే ప్రాంతంలోనూ ఇంతటి దారుణమైన పరిస్థితులు లేవన్నది అక్షరసత్యం. సీమ అనతికాలంలోనే థార్ ఎడారిలా మారబోతుందని పర్యావరణ వేత్తలు చేస్తున్న హెచ్చరికలు కూడా పాలకులకు ఎక్కడం లేదు. ఉదాహరణకు అనంతపురం జిల్లా 125 సంవత్సరాల కాలంలో 63 కరవుల్ని ఎదుర్కొంది. జిల్లాలో గత మూడేళ్ల కాలంలో 230 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుని రాష్ట్రంలోనే అత్యంత దయనీయ విషాదానికి ప్రతీకలయ్యారు. దేశంలోనే అత్యల్ప వర్షపాతంలో అనంతపురం జిల్లా రెండోస్థానంలో నిలుస్తోంది. చిత్తూరు జిల్లాకు అసలు సాగునీటి వనరులే లేవు. సీమలో సాగుకు యోగ్యమైన భూమి 30 లక్షల హెక్టార్లు వుండగా అందులో 5.6 లక్షల హెక్టార్లకు మాత్రమే సాగునీరు అందుతోంది. అది కూడా ప్రతి సంవత్సరం కాదు. 24 లక్షల హెక్టార్ల భూమి వర్షపాతం పైనే సాగుతోంది. ఆ పంట కూడా చివరిదాకా వస్తుందో రాదో తెలియని పరిస్థితి. దీనిని బట్టి సీమ వ్యవసాయ రంగంలో ఎంత వెనుకబడి ఉందో స్పష్టమవుతుంది.

## పారిశ్రామిక దౌర్భాగ్యం

మనరాష్ట్రంలో 130 కోట్ల టన్నుల సున్నపురాయి లభ్యమైతే అందులో 110 కోట్ల టన్నుల సున్నపురాయి కేవలం రాయలసీమలోనే లభ్యమవుతుంది. ముగ్గురాయి, ఇనుము, వజ్రాలు, యురేనియం సీమలో ఎక్కువగా లభిస్తాయి. కానీ వీటి ఆధారిత పరిశ్రమలు ఇంతవరకూ ఏ ప్రభుత్వం నెలకొల్పలేదు. యురేనియంకు సంబంధించి ఇటీవల కొంత ప్రయోజనం కలిగింది. సాగునీటికి కరవై తల్లడిల్లుతున్న సీమ వాసుల్ని ఆదుకోవడానికి పరిశ్రమల ఏర్పాటు కూడా ప్రత్యామ్నాయ మార్గం అవుతుంది.

రాయలసీమ పీఠభూమి, సముద్ర మట్టానికి 1000 అడుగుల నుండి 2000 అడుగుల లోపు ఉంది. కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలు ఇందులో వున్నాయి. సీమలోని గనుల కాంట్రాక్టులు పొందినవాళ్లు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతున్నారు. సీమ అభివృద్ధికి ఏం చేస్తున్నారనేది ప్రధాన ప్రశ్నగా మనకు కనిపిస్తుంది.

## ఊరించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం

ప్రపంచస్థాయి కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని రాయలసీమకు తెస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. కానీ అది సాకారం కాలేదు. 500 నుండి 600 ఎకరాల స్థలం, దానికి రోడ్లు, రైలు, విమానయాన సౌకర్యాలు, అధ్యాపకులతో పాటు వారి భార్యలకు ఉపాధి అవకాశాలుంటాయని, దీనిని కడప జిల్లాలో ఏర్పాటు చేస్తామని అన్నారు. కానీ అది ఆచరణ సాధ్యం కాలేదు. అయినా హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్, సెంట్రల్ యూనివర్శిటీ, సీఫెల్ వంటివి ఉన్నాయి. కానీ సీమలో ఇలాంటివెందుకు ఏర్పాటు చేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇది తేలాలంటే కరవు పీడిత ప్రాంతాల అభివృద్ధి అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

## 'నీటి' అన్యాయం

బచావత్ ట్రిబ్యునల్ ఎదుట ఆంధ్రప్రదేశ్ తన వాదనను వినిపించినప్పుడు మాత్రం రాయలసీమను ప్రధానంగా చూపించారు. తరతరాలుగా కరవు రక్కసి కోరల్లో చిక్కి విలవిలలాడుతున్న రాయలసీమకు సరైన పరిష్కారం కావాలంటే కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ వాటా తప్పనిసరిగా అవసరమని వాదించారు. ఈ వాదన ప్రకారమే కృష్ణా జలాల్లో మనకు నికర జలాలు 800 టిఎంసి మిగులు జలాలపై హక్కు దక్కింది. కానీ రాజకీయ నాయకులు పంచిన వాటా వివరాలు చూస్తే బాధ కలుగుతుంది. మన రాజకీయ నాయకులే రాయలసీమ ప్రాంతానికి తీరని ద్రోహం

చేస్తున్నారని చెప్పడానికి, శ్రీబాగ్ ఒప్పందాన్ని తుంగలో తొక్కుతున్నారని చెప్పడానికి పై ఉదాహరణ ఒక్కటి చాలు.

నిజానికి వర్షపాతాన్ని బట్టి, నదీ పరీవాహక ప్రాంతాన్ని బట్టి జలాల్ని పంపిణీ చేయాలి. కానీ ఈ విధంగా ఎందుకు జరగడం లేదు? నాయకులు పదవుల కోసం, రాజకీయాల కోసం సీమ భవిష్యత్తును ఎడారి చేస్తున్నదెవరు? శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కానీ, సామాజిక న్యాయ ప్రకారం కానీ, రాయలసీమకు దక్కవలసిన అసలు జలాలను కేటాయించాలని, గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసి కృష్ణానదిలోని 120 టిఎంసిల నీటిని రాయలసీమకు మళ్ళించాల్సిన అవసరం ఎంతైనా వుందని మన నాయకులు ఎప్పుడు గుర్తిస్తారు? 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం నీటిపారుదల విషయంలో కరవుసీమ అయిన రాయలసీమకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పిన విషయాన్ని ఎందుకు పాటించడం లేదు?

## రాజధాని నష్టం!

1956లో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రాజధాని తరలిపోయిన తర్వాత నుంచి సీమకు మరిన్ని కష్టాలు మొదలయ్యాయి. అసలు తరలిపోవడానికి ఒప్పుకున్న వాళ్లను ఏమనాలి? అనే ప్రశ్న ఇప్పుడు మళ్లీ చర్చకొస్తోంది. హైద్రాబాద్‌లో 50 వేల కోట్ల అభివృద్ధి సాధ్యమైంది. అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టూ 26 వేల కోట్ల రూపాయల అభివృద్ధి, హైటెక్ సిటీ చుట్టూ 27 వేల కోట్ల రూపాయల అభివృద్ధి జరిగింది.

## డిమాండ్లు

రాయలసీమ హక్కుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 2008 మార్చి నెలలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ను కలిసి ప్రధానమైన డిమాండ్లను ఆయన ముందుంచారు.

- గోదావరి జలాలను కోస్తాంధ్రకు మళ్లించి కృష్ణా నీటిని సీమకు ఉపయోగించాలి.
- రాయలసీమ ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి. మహారాష్ట్రలో మాదిరి రాయలసీమలో రెండో రాజధాని ఏర్పాటు చేయాలి.
- ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేసేటట్లయితే హైద్రాబాదును కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించి, దేశానికి రెండో రాజధానిగా చేయాలి.
- రాయలసీమలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు పన్ను మినహాయింపు ఇవ్వాలి.

- 610 జీవో రద్దు చేయాలి.
- నంద్యాల, గుంతకల్లు, ప్రొద్దుటూరు, తిరుపతి, మార్కాపురంలను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేయాలి.
- పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, గాలేరు–నగరి, వెలిగొండ, గుండ్లమోటు, సిద్ధేశ్వర ప్రాజెక్టు పనులను త్వరితంగా పూర్తి చేయాలి.
- కృష్ణా బేసిన్‌లోని కొయినా నుంచి అరేబియా సముద్రంలో వృథాగా కలుస్తున్న 150 టిఎంసిల నీటిని రాయలసీమకు మళ్ళించాలి.
- రాయలసీమ జిల్లాల్లో సాఫ్ట్‌వేర్, బయోటెక్నాలజీ, స్పోర్ట్స్ పార్కులు ఏర్పాటు చేయాలి. నెల్లూరు, ఒంగోలులో ఎక్కడో చోట కేంద్రీయ విశ్వవిద్యాలయం నెలకొల్పాలి.
- తెలంగాణ పై నిర్ణయం తీసుకునే ముందు రాయలసీమ నేతలతోనూ చర్చించాలి.
- రాయలసీమ అభివృద్ధి మండలిని పునరుద్ధరించి గత అయిదు దశాబ్దాలుగా జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి.
- జనాభా ప్రాతిపదికన కృష్ణా జలాలను రాయలసీమకు కేటాయించాలి.
- లక్ష కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి.
- అభివృద్ధికి నిపుణుల కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి.

రాయలసీమ రతనాల సీమ. రాయల కాలంలో వీధుల్లో రత్నాలు, ముత్యాలు రాశులుగా పోసి అమ్మిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. సీమలో ఉన్న వేలాది చెరువులు అప్పుడు కట్టించినవే. కానీ అది గతించిపోయిన కాలం. నేడు సీమ రాళ్లసీమగా స్థిరపడిపోయింది. రాయలసీమ యొక్క భవిష్యత్ గురించి, సీమలోని ప్రజల కష్టనష్టాల్ని గురించి చర్చించాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది. 1953 నుండి రాయలసీమ ఎంత నిర్లక్ష్యానికి గురైందో అంచనా వేయాల్సిన అవసరం ఉంది. 1956లో సీమవాసులు కర్నూలు రాజధానిని కోల్పోయిన తర్వాత హైదరాబాదులో సుమారు 50 వేల కోట్ల అభివృద్ధి జరిగింది. దీనికి తోడు కృష్ణా జలాల్లో వాటా కూడా కోల్పోయింది. రాష్ట్ర బడ్జెట్‌లో 53 శాతం తెలంగాణాకే వెళ్తుంది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు మూడు ప్రాంతాలకు వచ్చిన పబ్లిక్, ప్రైవేట్ పెట్టుబడులెంత? విద్య, ఉపాధి, ఆరోగ్యం, వ్యవసాయం అంశాల వారీగా తప్పనిసరిగా అధ్యయనం జరగాల్సిన అవసరం వుంది.

# రాయలసీమ జిల్లాల భౌగోళిక స్వరూపం

## కడప

| | | |
|---|---|---|
| విస్తీర్ణం | : | 15,359 చ.కి.మీ. |
| సరిహద్దులు | : | నెల్లూరు, అనంతపురం, చిత్తూరు. |
| నదులు | : | పెన్న, చిత్రావతి, కుందేరు, పాపాగ్ని, సగిలేరు, చెయ్యేరు |
| ముఖ్యపట్టణాలు | : | కడప, రాజంపేట, పొద్దుటూరు, రాయచోటి |

**పుణ్యక్షేత్రాలు :**

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం (కందిమల్లయ్యపల్లి), తాళ్లపాక, పుష్పగిరి, సిద్ధవటం, ఒంటిమిట్ట, జ్యోతి, జమ్మలమడుగు.

**పర్యాటక విశేషాలు :**

భగవాన్ మహావీర్ ప్రభుత్వ పురావస్తుశాల, చాంద్‌ఫిరా గుంబంద్ కట్టడాలు, గండికోట ప్రాచీన వైభవం, అజీమ్ మసీదు, పుష్పగిరి ఆలయాలు, శ్రీ కోదండరామస్వామి ఆలయం, శ్రీ లంకమల్లేశ్వర వన్యప్రాణి అభయారణ్యం.

**సంక్షిప్త పరిచయం :**

పల్లవులు, తెలుగుచోళులు, కాకతీయులు, విజయనగర రాజులు, నిజాం నవాబులు పాలించారు. జిల్లా అడవుల్లోని ఎర్రచందనం దేశానికి విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించి పెడుతోంది. పులులు, చిరుత పులులు ఇక్కడి అరణ్య ప్రాంతాలలో కనిపిస్తాయి. పులివెందులలో ఆస్‌బెస్టాస్ పరిశ్రమ ఉంది. 4000 హెక్టార్ల వ్యవసాయానికి కె.సి.కెనాల్ ప్రధాన జలవనరు. హంద్రీ నీవా, సుజల స్రవంతి, పులివెందుల కెనాల్ నిర్మాణంలో ఉన్నాయి. గాలేరు–నగరి నుంచి తాగునీరు అందుతుంది. సిమెంటు, మైకా పరిశ్రమలు అనేకమంది స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. మాధవరంలోని చేనేత పరిశ్రమ జిల్లాకు ముఖ్య ఆదాయవనరు. ఇప్పపెంట గ్రామంలో బుగ్గవంక నదిపై జలాశయాన్ని నిర్మించే ప్రతిపాదనలు ఉన్నాయి.

# కర్నూలు

| | | |
|---|---|---|
| విస్తీర్ణం | : | 17,658 చ.కి.మీ. |
| సరిహద్దులు | : | గుంటూరు, నెల్లూరు, బళ్ళారి, మహబూబ్‌నగర్, కడప, అనంతపురం |
| నదులు | : | కృష్ణ, తుంగభద్ర, పెన్నేరు. |
| ముఖ్యపట్టణాలు | : | కర్నూలు, నంద్యాల, ఆదోని, ఆత్మకూరు, ఎమ్మిగనూరు |

**పుణ్యక్షేత్రాలు :**

శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామివారి ఆలయం (శ్రీశైలం), శ్రీ గురురాఘవేంద్ర స్వామి సజీవ సమాధి (మంత్రాలయం), ఇంకా... పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం, ఎరుకలమ్మ గుడి, శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి ఆలయం (అహోబిలం), సంగమేశ్వర ఆలయం (మహానంది), శ్రీ సాయిబాబా ఆలయం (తిమ్మాపురం)

**పర్యాటక విశేషాలు :**

బెలుం గుహలు (బెలూం), కర్నూలు కోట, రాళ్లపాడు పక్షుల సంరక్షణాలయం (రాళ్లపాడు), శ్రీశైలం ఆనకట్ట, శ్రీశైల-నాగార్జునసాగర్ పులుల అభయారణ్యం, యాగంటి గుహలు (యాగంటి)

**సంక్షిప్త పరిచయం :**

ఈ ప్రాంతాన్ని చోళులు, కాకతీయులు, విజయనగర రాజులు, ఢిల్లీ సుల్తానులు, నిజాం నవాబులు పాలించారు. పొలవేమన రెడ్డిరాజులు ఇక్కడి పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేశారు. ముడి ఇనుము, రాగి ప్రధాన ఖనిజ సంపద. కెసి కెనాల్ (కర్నూల్, కడప), తుంగభద్ర, కృష్ణ నదులు జిల్లాకు ప్రధాన జలవనరులు. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం హైడ్రో పవర్ ప్రాజెక్టు రాష్ట్రంలో ఎంతో ప్రాముఖ్యమైనది. దీనితో పాటు తుంగభద్రపై నిర్మించిన హంపి విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి జిల్లా విద్యుత్ అవసరాలు తీరుతాయి. జిల్లాలోని అన్ని కళాశాలలూ ఇక్కడి శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోకి వస్తాయి. దుస్తుల తయారీ, పాణ్యం, సువర్ణ సిమెంట్స్, రాయలసీమ పేపర్ మిల్స్ ముఖ్య పరిశ్రమలు.

# చిత్తూరు

| | | |
|---|---|---|
| విస్తీర్ణం | : | 15,152 చ.కి.మీ. |
| సరిహద్దులు | : | తమిళనాడు, కర్నాటక, కడప, అనంతపురం |
| నదులు | : | పాపాఘ్ని, కౌండిన్య, పాలేరు, ఆరణి, స్వర్ణముఖి |
| ముఖ్యపట్టణాలు | : | మదనపల్లి, శ్రీకాళహస్తి, చిత్తూరు, తిరుపతి, రేణిగుంట |

**పుణ్యక్షేత్రాలు :**

తిరుమల–తిరుపతి, శ్రీకాళహస్తి, తిరుచానూరు, శ్రీకాణిపాకం.

**పర్యాటక విశేషాలు :**

ఆకాశగంగ, చంద్రగిరి కోట, హరేరామ హరేకృష్ణ మందిరం, అలమేలుమంగా ఆలయం, నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వర ఆలయం, నాగలాపురం గుడి, శ్రీ అగస్థేశ్వర స్వామివారి ఆలయం, హార్స్‌లీ హిల్స్, కపిలతీర్థం, కౌండిన్య వన్యప్రాణి అభయారణ్యం, శిలాతోరణం, శ్రీ వెంకటేశ్వర వన్య సంరక్షణ కేంద్రం, తలకోన, తిరుచానూరు.

**సంక్షిప్త పరిచయం :**

బ్రిటీష్‌వారు వెళ్లేంత వరకు ఈ ప్రాంతాన్ని పల్లవులు, చోళులు, విజయనగర రాజులు పాలించారు. కొత్త రాతి యుగంలోనే ఇక్కడ మనుషుల జాడలు ఉన్నట్లు చరిత్రకారులు చెబుతారు. ఇక్కడి అరణ్యప్రాంతంలో టేకు, ఎర్రచందనం, తేనె, చింతపండు విదేశీ మారకద్రవ్యాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఆయుర్వేద మూలికలను కూడా ఇక్కడ సాగు చేయడం కనిపిస్తుంది. గాలేరు–నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు జిల్లా నీటి అవసరాలను తీరుస్తోంది. తుంగభద్ర జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. చక్కెర, దుస్తుల తయారీ, రైల్వే వ్యాగన్ల వర్క్‌షాపు, సిరామిక్స్, ఇత్తడి, రాగి ప్రధాన పరిశ్రమలు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉంది. ఇక్కడి న్యూట్రిన్ చాక్లెట్ల పరిశ్రమకు ప్రసిద్ధమైనది. అనేక చిన్నతరహా పరిశ్రమలు జిల్లా వాసులకు ఉపాధి కల్పిస్తున్నాయి. దేశవ్యాప్తంగా క్షయ నివారణకు దిశానిర్దేశాలను సూచించిన ఆరోగ్యవరం ఇక్కడ వుంది. అలాగే పుత్తూరు మండలంలోని రాచపాలెం శల్యవైద్యంలో ప్రసిద్ధిగాంచింది.

# అనంతపురం

| | | |
|---|---|---|
| విస్తీర్ణం | : | 19,130 చ.కి.మీ. |
| సరిహద్దులు | : | కర్నూలు, కడప, చిత్తూరు, కర్నాటక. |
| నదులు | : | పెన్న, చిత్రావతి, కుందేరు, హగిరి |
| ముఖ్యపట్టణాలు | : | అనంతపురం, హిందూపూర్, కదిరి, తాడిపత్రి, ధర్మవరం, రాయదుర్గం. |

**పుణ్యక్షేత్రాలు :**

కొనకండ్ల జైనాలయం, లేపాక్షి ఆలయం, పుట్టపర్తి ప్రశాంతి నిలయం, తాడిపత్రి చింతల వెంకట రమణస్వామి ఆలయం, వేమన సమాధి.

**పర్యాటక విశేషాలు :**

ఆలూరు కోన, ఇకో టూరిజం, ధర్మవరం చేనేతలు, గుత్తికోట, హేమవతి ప్రాచీన కట్టడాలు, పెనుకొండ ప్రాచీన క్షేత్రాలు, తిమ్మమ్మ మర్రిమాను.

**సంక్షిప్త పరిచయం :**

విస్తీర్ణంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోకీ పెద్దది. పల్లవులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, చోళులు, నొలంబులు, విజయనగర రాజులు పాలించారు. హైదర్ ఆలీ, టిప్పుసుల్తాన్‌ల హయాం కొంత నడిచింది. పట్టుసాగుకు ప్రసిద్ధి. హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రధాన జల వనరులు. వ్యవసాయానికి తుంగభద్ర ఎగువ కాలువ ఒక్కటే ప్రధాన ఆధారం. అడవి బ్రాహ్మణపల్లెలో మద్దిలేరు కాలువపై మద్దిలేరు జలాశయాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలున్నాయి. జిల్లాలో 10 శాతం వరకూ అటవీ ప్రాంతమే. ఇక్కడ మూడు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి (శ్రీకృష్ణ దేవరాయ యూనివర్శిటీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ, శ్రీ సత్యసాయి యూనివర్శిటీ). బొమ్మల తయారీకి కూడా ప్రసిద్ధి. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నాలుగు పారిశ్రామిక అభివృద్ధి వాడలలో ఒకటి ఈ జిల్లాలోనే ఉంది. హంపిలో తుంగభద్రపై గల ఆంధ్ర, కర్నాటక ఉమ్మడి ప్రాజెక్టు నుంచే జిల్లాకు విద్యుత్ అవసరాలు తీరుతున్నాయి. నామమాత్ర వర్షపాతం.

## ఫ్యాక్షన్ వ్యాసాలు

రాయలసీమ రాజకీయం - ముఠా కక్షల తోరణం - వ్యాసం

రచన : వేంపల్లి గంగాధర్ - 9 జూలై 1998 -

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక.

ఫ్యాక్షన్ చిచ్చుకు 'సీమ' భస్మం - వ్యాసం

రచన : వేంపల్లి గంగాధర్ - 16 జూలై 1998 -

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక

పాలెగాళ్ల రాజ్యం - రక్తపు మరకల చరిత్ర - వ్యాసం

రచన : వేంపల్లి గంగాధర్ - 23 జూలై 1998 -

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక

కరువు సీమలో కక్షల పోరు - వ్యాసం

రచన : వేంపల్లి గంగాధర్ - 21 మే 2008

- వార్త దినపత్రిక

'సీమ' నేలపై నెత్తుటి సంతకం - వ్యాసం

రచన : వేంపల్లి గంగాధర్ - 25 మే 2008

- ఆదివారం ఆంధ్రప్రభ అనుబంధం

రతనాల సీమకు మిగిలిన రాళ్లు - వ్యాసం

రచన : వేంపల్లి గంగాధర్ - 13 జూన్ 2008

- వార్త దినపత్రిక

## ఫ్యాక్షన్ కథలు

దేగల రాజ్యం - మొలకలపున్నమి కథాసంపుటిలో

రచన : వేంపల్లి గంగాధర్ - ఏప్రిల్, 2006

కొలిమ్మాను - 'తేజ' న్యూస్ వీక్లీ

రచన : వేంపల్లి గంగాధర్ - 21 డిసెంబర్, 2007

ఒక మొండి కత్తి - కుంటి గుర్రం - వార్త దినపత్రిక

రచన : వేంపల్లి గంగాధర్ - 20 మే, 2008

సాయుధుడు - 'సూర్య' దినపత్రిక

రచన : వేంపల్లి గంగాధర్ - 6 జులై, 2008

# ఉషస్సు ప్రచురణలు










For Copies :

Ushassu Prachuranalu

# 4/432/A,
Vivekananda Nagar,
KADAPA - 516 001.
Andhra Pradesh - India.
Cell : 9440074893